అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 29-6-2023
సంపుటి : 9 | సంచిక : 179 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

సమస్త జనులకు సమానంగా ప్రయోజనాలు

- సీఎం కేసీఆర్ బక్రీద్ శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమిష్టి ప్రయోజనం కోసం వ్యక్తిగత స్వార్థాన్ని విడిచి త్యాగాలకు సిద్ధపడ్డప్పుడే సమాజ హితం జరుగుతుందని సీఎం కేసీఆర్ అన్నారు. త్యాగాల ద్వారా ప్రాప్తించిన ప్రయోజనాలు సమస్త జనులకు సమానంగా అందినప్పుడే ఆ త్యాగాలకు సార్ధకత చేకూరుతుందనే సందేశాన్ని బక్రీద్ పండుగ విశ్వ మానవాళికి అందిస్తుందని తెలిపారు. బక్రీద్ (ఈదుల్ అజ్ హా) పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ భక్తి, త్యాగం, కరుణ, విశ్వాసం అనే గొప్ప గుణాలను ...9లో

ఉపాధిలో వివక్ష


నిధుల కేటాయింపు అంతా ఒకేలా వద్దు- కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్యానెల్ సిఫార్సు

- ఇప్పటికే నిధుల్లో భారీ కోత విధించిన మోడీ సర్కారు

కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకం నిధుల కేటాయింపులో కోత విధించిన మోడీ సర్కారు ఇప్పుడు దాన్ని మరింత కుదించే చర్యలకు పాల్పడుతున్నది. ఇస్తున్న అరకొర నిధుల్ని కూడా అన్ని రాష్ట్రాలకు ఒకేలా కాకుండా 'పేదరికం' ప్రాతిపదికన ఇవ్వాలంటూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్యానెల్ సిఫార్సు చేసింది. దీనివల్ల అనేక రాష్ట్రాల్లో 'ఉపాధి' నిధులకు కోత పడే ప్రమాదం ఉంది. దానికి తోడు ఏఏ రాష్ట్రాల్లో ఏఏ ఉపాధి అభివృద్ధి పనులు చేపట్టారో లెక్కలు తీసి, దాని ప్రకారమే నిధులు కేటాయించాలని కూడా ప్యానెల్ సిఫార్సు చేసింది. దీనితో ఇప్పటి వరకు ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కాస్తో కూస్తో అభివృద్ధిని సాధించిన రాష్ట్రాలకూ నిధుల కేటాయింపులో కోత పడే అవకాశం ఉంది.



2014లో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు క్రమంగా తగ్గుతున్నాయి. 2023-24 కేంద్ర బడ్జెట్‌లో 'ఉపాధి' కేటాయింపులు 32 శాతం తగ్గాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి డిమాండ్ బాగా పెరిగింది. కానీ కేంద్ర ప్రభుత్వం అప్పటి నుంచే బడ్జెట్‌లో నిధుల కోతను పెంచుతూ వస్తుండటం గమనార్హం.



నవతెలంగాణ-న్యూఢిల్లీ

ఉపాధి హామీ పథకం సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2022 అక్టోబర్‌లో తొమ్మిది మంది సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అమర్జీత్ సిన్హా నేతృత్వంలోని కమిటీ ఇటీవలే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దానిలో 'ఉపాధి' నిధుల్ని మరింత కుదిస్తూ, కేంద్ర నిర్ణయానికి అనుగుణంగా సిఫార్సులు చేసినట్టు తెలుస్తున్నది. దేశంలోని 49శాతం పేదలున్న ప్రాంతాల్లో 70శాతం ఉపాధి నిధులు ఖర్చు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేసిందే తప్ప, నిధుల కేటాయింపు పెంచాలని మాత్రం పేర్కొనలేదు. ఇప్పటి వరకు 'ఉపాధి' కింద సృష్టించబడిన ఆస్తులను నిధుల కేటాయింపునకు అనుసంధానం చేస్తూ, దీన్ని పూర్తిగా సవరించాలని సిఫార్సు చేసింది. దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పనులు విస్తరించి ఉన్న మొత్తం 7,245 బ్లాకుల్లో 3,500 బ్లాకులు (49 శాతం) అత్యంత పేదరికంలో ఉన్నాయనీ, అక్కడే 70 శాతం ఉపాధి నిధులను ఖర్చు చేయాలని సూచించింది. ఈ 3,500 బాకుల్లో 2,500 నీటి కొరత ఉన్న బ్లాక్‌లు, 1,000 పేదరికంతో ఉన్న బ్లాక్‌లుగా గుర్తించామని కమిటీ తెలిపింది. ఈ ప్రాంతాల్లో బడ్జెట్ వ్యయంలో 70 శాతం ఖర్చు చేయాలని సిఫార్సు చేసింది. మోడీ సర్కారు అధికారంలోకి వచ్చి 9 ఏండ్లు దాటినా దేశంలో ఇప్పటికీ 2,500 బ్లాకుల్లో తీవ్రమైన నీటి కొరత ఉన్నట్టు ఈ నివేదిక స్పష్టం చేయడం గమనార్హం. ఇప్పుడు 'ఉపాధి' నిధుల్ని ఇక్కడ ఖర్చు చేయాలని కమిటీ సిఫార్సు చేయడం వివాదాస్పదంగా మారింది. నీటి కొరతకు 'ఉపాధి' నిధుల్నే ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. కేంద్రప్రభుత్వం అనేక పథకాల ద్వారా గ్రామీణ నీటి వసతిని కల్పిస్తున్నట్టు ప్రచారం చేస్తున్నది. ఇప్పుడు ఈ స్కీంలకు ఈ నిధుల్ని మళ్ళించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. వామపక్షాల ఒత్తిడితో 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. డిమాండ్-ఆధారిత పథకం ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 100 రోజుల నైపుణ్యం లేని పనికి హామీ ఇస్తుంది. 2014లో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు క్రమంగా తగ్గుతున్నాయి. 2023-24 కేంద్ర బడ్జెట్‌లో 'ఉపాధి' కేటాయింపులు 32 శాతం తగ్గాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి డిమాండ్ బాగా పెరిగింది. కానీ కేంద్ర ప్రభుత్వం అప్పటి నుంచే బడ్జెట్‌లో నిధుల కోతను పెంచుతూ వస్తుండటం గమనార్హం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, బీహార్, ఉత్తరప్రదేశ్, అస్సాం, మేఘాలయ, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లోని 10 రాష్ట్రాల్లో కేంద్ర గ్రామీణాభివద్ధి మంత్రిత్వ శాఖ ప్యానెల్ సర్వే నిర్వహించినట్టు పేర్కొని, 'అందరికీ ఒకే పరిమాణం' నిధుల కేటాయింపు పని చేయదని తేల్చింది. సర్వే సందర్భంగా ...2లో

ఈటల చుట్టూ రాజకీయం

వై కేటగిరీ భద్రత కల్పించనున్న కేంద్రం!

- అలర్ట్ అయిన రాష్ట్ర సర్కారు
- భద్రత పెంచాలని పోలీసులకు డీజీపీ ఆదేశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హస్తినలో రెండు, మూడు రోజుల పాటు హాట్‌హాట్‌గా సాగిన తెలంగాణ రాజకీయాలు మళ్లీ ఈటల రాజేందర్ వైపు తిరిగాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ఆపరేషన్ ఆకర్ష్‌లకు దిగటంతో ఒక్కసారిగా వేడెక్కిన రాష్ట్ర రాజకీయం ఈటల జమున ప్రెస్‌మీట్‌తో మరోమలుపు తీసుకున్నది. కౌశిక్‌రెడ్డి నుంచి ప్రాణహాని ఉందనీ, రూ.20 కోట్ల సుపారీ కూడా ఇచ్చారంటూ ఆమె చేసిన ఆరోపణలు రాజకీయంగా కలకలం సృష్టించాయి. కౌశిక్ రెడ్డి కూడా ప్రెస్‌మీట్ పెట్టి ఆయన్ను చంపించాల్సిన అవసరం తనకు లేదనీ ఖండించారు. ఈ నేపథ్యంలో ఆయనకు భద్రత పెంచాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఆ భద్రత పెంపు విషయమూ రాజకీయ రంగు పులుముకున్నది. బీజేపీలోకి పోయాక రాజకీయంగా ఒంటరై క్రమంగా గ్రాఫ్ పడిపోతున్న క్రమంలో పొలిటికల్ మైలేజ్‌ను పెంచుకునేందుకు ఈటల 'సుపారీ' ఎత్తుగడను ఎత్తుకున్నారా? రాజకీయ లబ్ది కోసం ఇలాంటి వ్యాఖ్యలను జమునతో చేయించారా? నిజంగానే బీఆర్ఎస్ నేత కౌశిక్‌రెడ్డి రాజకీయంగా టార్గెట్ చేశారా? ఇలా అనేక ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. కొద్దిరోజులుగా కాంగ్రెస్ హడావిడితో సాగుతున్న మీడియా, ప్రజల దృష్టి అంతా ఇప్పుడు ఈటలపై పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను టార్గెట్ చేసిందనీ, కేంద్రం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని ఆయనకు వై కేటగిరీ భద్రత కల్పిస్తూ ఒకటెండ్రు రోజుల్లో ఉత్తర్వులు కూడా తీసుకురాబోతున్నదని ప్రచారం ఊపందుకున్నది. అయితే, ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారకరామారావు స్పందిస్తూ..ఈటల తమ పార్టీలో చాలా ఏండ్ల పాటు పనిచేశారనీ, అలాంటి మంచి వ్యక్తిపై ఇలాంటి వార్తలు రావడం సరిగాదని చెప్పుకొచ్చారు. ఒకడుగు ముందుకేసి రాజేందర్‌కు భద్రత పెంచే విషయంపై ఐపీఎస్‌ను పంపి పర్యవేక్షించాలని డీజీపీ అంజనీ కుమార్‌ను ...9లో

భీమ్ ఆర్మీ చీఫ్‌పై కాల్పులు



లక్నో : దళిత నాయకులు, భీమ్ ఆర్మీ చీఫ్ చంద్ర శేఖర్ అజాద్‌పై ఉత్తరప్రదేశ్‌లో గుర్తు తెలియని దుండగులు బుధవారం కాల్పులు జరిపారు. సహరన్‌పూర్ జిల్లాలోని డీయోబండ్ పట్టణంలో ఈ దారుణం జరిగింది. దుండగులు జరిపిన కాల్పుల్లో అజాద్ గాయపడ్డారు. డియోబండ్‌లోని ఒక మద్దతుదారుడి ఇంటి వద్ద ఒక కార్యక్రమంలో హజరుకావడానికి వెళుతుండగా అజాద్ ప్రయాణిస్తున్న ఎస్‌యువిపై దుండగులు అనేక రౌండ్ల పాటు కాల్పులకు ...9లో



17 నుంచి పార్లమెంట్ సమావేశాలు!

న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై మూడో వారం నుంచి ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. మరికొద్ది రోజుల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీపీఏ) సమావేశం జరగనుంది. అందులో ఈ అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశంలో సమావేశ తేదీలపై చర్చ జరగనుంది. జులై 17 ప్రారంభమై ఆగస్టు 10 వరకు సమావేశాలు జరగనున్నాయి.

ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. ఢిల్లీలో బదిలీ పోస్టింగ్ విషయంలో లెఫ్టినెంట్ గవర్నర్‌కు అధికారాలు ఇచ్చే బిల్లుపై మోడీ ప్రభుత్వం వ్యతిరేకతను ఎదుర్కోవలసి ఉంటుంది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దేశవ్యాప్తంగా తిరుగుతూ బీజేపీ వ్యతిరేక పార్టీలను కలుస్తూ ఈ విషయంపై మద్దతు కోరుతున్నారు.

కేజ్రీవాల్ బిల్లును వ్యతిరేకించాలని కాంగ్రెస్‌ను కూడా కోరారు. యూనిఫాం సివిల్ కోడ్‌పై ప్రధాని మోడీ తాజా ప్రకటనపై పార్లమెంటులో దుమారం రేగవచ్చు.

కొత్త పార్లమెంట్ హౌస్‌లో జరిగే మొదటి సెషన్ ఇదే కావడం గమనార్హం. దీనికి ఆతిథ్యం ఇవ్వడానికి కొత్త పార్లమెంట్ హౌస్ సిద్ధంగా ఉంది. మే 28న ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రారంభించారు.

ఉస్మానియా ఆస్పత్రి పరిస్థితి ఆందోళనకరం

రాష్ట్ర గవర్నర్ తమిళిసై



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంతో గొప్ప చరిత్ర కలిగిన ఉస్మానియా ఆస్పత్రి దుస్థితి చూస్తే ఆందోళన కలుగుతోందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి సంబంధించి గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని కోరుతూ 'జస్టిస్ ఫర్ ఓజీహెచ్' పేరుతో ఉన్న ఓ ట్విటర్ ఖాతాకు ఆమె రీట్వీట్ చేశారు. ఆస్పత్రిలో రోగులు పడుతున్న ఇబ్బందులకు సంబంధించిన ఫొటోతో పాటు.. కొత్త భవన నిర్మాణానికి జాయింట్ అసోసియేషన్ విడుదల చేసిన లేఖకు సంబంధించిన ఫొటోలు ట్వీట్‌కు జత ...9లో

బీజేపీ అధికార ప్రతినిధిలా మాట్లాడొద్దు

రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి తప్పుడు ఆరోపణలు

- కోర్టు పరిధిలో ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణం....
- గవర్నర్ తమిళిసై ట్వీట్‌పై మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజ్యాంగ పదవిలో ఉన్న రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ బీజేపీ అధికార ప్రతినిధిలా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని కోఠిలో పునరుద్ధరించిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయంతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ...9లో

సమస్యలు పరిష్కరించాలంటే.. ఈడ్చేశారు

ఎస్ఎఫ్ఐ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు :ఎస్ఎఫ్ఐ నాయకులు



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రయివేటు స్కూళ్లలో ఫీజులు తగ్గించి, ప్రభుత్వ స్కూళ్లలో వసతులు పెంచాలని, యూనివర్సిటీలను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన చలో కలెక్టరేట్ తీవ్ర ఉద్రిక్తంగా మారింది. సమస్యలు పరిష్కరించే వరకు కదిలేది లేదని సుమారు గంటపాటు కలెక్టరేట్ గేటు ఎదుట భీష్మించు కూర్చున్నారు. ప్రతిసారీ వినతిపత్రాలు సమర్పించడమే తప్ప సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధిగా లేదని విద్యార్థి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పష్టమైన హామీ ఇవ్వాలని భీష్మించారు. నిజామాబాద్ కలెక్టరేట్ గేటు వద్ద రాకపోకలు అడ్డుకుని పెద్దఎత్తున నినదించారు. ఈ సమయంలో ...9లో

2న ఖమ్మంలో తెలంగాణ జన గర్జన సభ

- అదే రోజు భట్టి పాదయాత్ర ముగింపు.. పొంగులేటి చేరిక..
- హాజరుకానున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే వివరాలు 9లో



పీవీకి భారతరత్న ఎందుకడగటం లేదు?

- కేసీఆర్‌ను ప్రశ్నించిన బండి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పీవీ నర్సింహారావుకి భారతరత్న ఇవ్వాలనే అంశం సంగతి తరువాత చూద్దాం. ముందు పీవీ ఘాట్‌కు వచ్చి నివాళి అర్పించమనండి. మోడీ నా దోస్త్ అని కేసీఆర్ పదేపదే అంటున్నాడు కదా..భారతరత్న ఇవ్వాలని ఎందుకు ...9లో



చినుకు చింత

గ్రేటర్‌కు పొంచి ఉన్న ముప్పు? ప్రతి వర్షాకాలం అస్తవ్యస్తమే.. అయినా చర్యలకు దిగని బల్దియా



(ఫైల్)

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్‌లో చినుకు పడితే చిత్తడిగా మారుతోంది.. సాధారణ వర్షానికే కాలనీలు నీట మునుగుతున్నాయి. మరింత గట్టి వర్షం పడితే రోడ్లన్నీ జలమయంగా మారిపోతున్నాయి. గంటల తరబడి రోడ్లపై ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇరుక్కుపోతున్నారు. గ్రేటర్ పరిధిలో ప్రతి వర్షాకాలం అస్తవ్యస్తంగా మారుతోంది. రెండు మూడేండ్లుగా కురిసిన భారీ వర్షాలతో నగరవాసులు వారాల తరబడి వరద నీటిలోనే ఉండిపోవాల్సి వస్తోంది. దీనంతటికీ జీహెచ్ఎంసీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడమే ప్రధాన కారణం. శివారు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. శివారు మున్సిపాల్టీలూ పట్టించుకోవడం లేదు. ఇలా అయితే, ఈ సారీ వర్షాలు భారీగా పడితే పరిస్థితి ఏంటని నగర వాసులు భయాందోళనకు గురవుతున్నారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు

నగరంలో జోరుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. పార్కులు, ఖాళీ స్థలాలు, గుట్టలు, చివరకు గుడులను సైతం కబ్జా చేస్తున్నారు. దీనికి తోడు హైదరాబాద్‌లో వరదనీరు బయటకు పోయేందుకు సరైన ఏర్పాట్లు లేవు. ఈ విషయం చాలా సర్వేల్లో తేలింది. 60 ఏండ్ల కిందట నిజాం పాలకులు హైదరాబాద్‌లో రెయిన్‌వాటర్ మేనేజ్‌మెంట్ చేపట్టారు. నీళ్లు చెరువుల్లోకి, కుంటల్లోకి పోయేలా రోడ్ల పక్కన డ్రెయిన్లు కట్టించారు. అయితే, రోజురోజుకూ నగరం విస్తరించడం.. భూముల ధరలు పెరగడంతో చెరువులు, కుంటలు కనుమరుగవుతూ వచ్చాయి. ఎటుచూసినా నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారింది. అపార్ట్‌మెంట్లు, కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్‌లు వెలుస్తుండటంతో వరద నీరు సాఫీగా బయటకు పోయే పరిస్థితి లేకుండా పోయింది. చినుకు పడితే సిటీలోని రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. కాలనీలు, బస్తీలు నీట మునుగుతున్నాయి.

2020, 2021, 22లో వచ్చిన భారీ వర్షాలతో గ్రేటర్ పరిధిలో చాలా ప్రాంతాల్లో ఇండ్లలోకి నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉన్న విషయం తెలిసిందే. వందలాది కాలనీలు నీటమునిగి బురదమయంగా మారాయి. చాలా ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి ప్రజలకు సేవలందించారు. 2020 సంవత్సరంలో 1500కు పైగా కాలనీలు, బస్తీలు, 2021ఏడాదిలో 150, 2022లో 100 వరకు ...9లో

యూసీసీ అమలు దేశ వైవిధ్యంపై దాడి : ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ : ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు దేశ బహుళత్వం, వైవిధ్యంపై దాడి చేయడమేనని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. దేశంలో యూసీసీని అమలు చేయాలని, కానీ ప్రతిపక్షాలు దాన్ని అడ్డుకుంటున్నట్టు ప్రధాని మోడీ ఆరోపించిన సంగతి తెలిసిందే. భోపాల్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తప్పుపడుతున్నాయి. హిందూ మతంలో ముందుగా ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలనీ, దేశంలోని ప్రతి ఆలయంలో ఎస్టీలు, ఎస్సీలు పూజలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని డీఎంకే నేత టీకేఎస్ ఇళంగోవన్ సూచించారు. యూసీసీ తమకు అవసరం లేదని, ఎందుకంటే రాజ్యాంగం ప్రతి మతానికి రక్షణ కల్పించిందని అన్నారు. ప్రధాని మొదట దేశంలో పెరుగుతున్న పేదరికం, ధరల పెరుగుదల, నిరుద్యోగంపై స్పందించాల్సి వుందని కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఒకవైపు మణిపూర్ మండిపోతోందనీ, కానీ ప్రధాని మణిపూర్ అంశంపై ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదని అన్నారు. ట్రిపుల్ తలాక్ అనేది ఇస్లాంలో విడదీయరాదని భాగమైతే పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఖతర్, జోర్డాన్, సిరియా వంటి ముస్లిం మెజారిటీ దేశాల్లో ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు.

ఉమ్మడి పౌరస్మృతిపై ముస్లిం వర్గాన్ని ప్రతిపక్షాలు రెచ్చగొడుతున్నాయని ప్రధాని ఆరోపించారు. ప్రజలకు రెండు రకాల రూల్స్ ఉంటే ఒక కుటుంబం ఎలా పనిచేస్తుందని, అప్పుడు దేశం ఎలా పనిచేస్తుందని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ఉమ్మడి పౌరస్మృతి కావాలంటే దాన్ని పార్లమెంట్‌లో బీజేపీ ప్రవేశపెట్టవచ్చునీ, వాళ్లను ఎవరు అడ్డుకున్నారని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరీ ప్రశ్నించారు. పార్లమెంట్‌లో యూసీసీ ప్రవేశపెట్టకుండా, ప్రతిపక్షాలపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. భారత్‌లో ఉన్న బహుళత్వాన్ని, భిన్నత్వాన్ని ప్రధాని మోడీ సమస్యగా చూస్తున్నారని, యూసీసీ పేరుతో దేశ ఔనత్యాన్ని తగ్గిస్తారా అని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసి మండిపడ్డారు.

ఉపాధిలో వివక్ష

(మొదటిపేజీ తరువాయి)

కొత్త సాంకేతికత జోడింపులకు వ్యతిరేకంగా కమిటీకి అనేక ఫిర్యాదులు అందాయని తెలిపింది. దానిలో హాజరు నమోదు చేయడానికి మొబైల్ యాప్, తప్పనిసరి ఆధార్ ఆధారిత చెల్లింపులు ఉన్నాయని వివరించింది. ఉపాధి కార్మికులు, కార్యకర్తలతో సహా ఉపాధి హామీతో అనుబంధించబడిన వారు తప్పనిసరి చేసిన మొబైల్ యాప్ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)ని వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ యాప్‌లో ప్రతి కార్మికుడి హాజరును గుర్తించడానికి వర్క్‌సైట్‌లో రెండు టైమ్ స్టాంప్డ్, జియో-ట్యాగ్ చేయబడిన ఫోటోగ్రాఫ్‌లు తీసుకోవా లని నిబంధన విధించారు. అనేక సాంకేతిక లోపాలతో ఉన్న ఈ యాప్‌ను కార్మికులు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు దీన్నే ప్రమాణికంగా చేసుకొని కేంద్ర ప్యానెల్ కమిటీ కొత్త సిఫార్సులు చేసింది.

బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే తెలంగాణే బెటర్...

మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ పాలిత రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అన్ని రంగాల్లోనూ అగ్రభాగంలో ఉందని మంత్రి హరీశ్ రావు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో పలు కార్యక్రమా ల్లో పాల్గొన్న ఆయన, ఢిల్లీలో కాంగ్రెస్, బీజేపీ నేతల వరుస సమావేశాలపై కామెంట్లు చేశారు. తెలంగాణ తరహా పథకాలను దేశవ్యాప్తంగా కావాలని ప్రజలు కోరుతున్నారని చెప్పారు.

మహారాష్ట్ర పోలీసులు తమ కూ తెలంగాణ పోలీసులకిస్తున్న ఇన్సెంటివ్‌లు కావాలని ఆశిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీల ప్రయత్నం రాష్ట్రంలో రెండో స్థానం కోసమేనని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ ఉన్నంత కాలం ఆయన నాయకత్వానికే ప్రజలు ఓటేస్తారని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు మంత్రి పదవులను మార్చినా, అధ్యక్షులు మార్చినా, నాయకుల ను బుజ్జగించినా ప్రజల ఆలోచనల్లో మార్పు రాదని ధీమా వ్యక్తం చేశారు. గత తొమ్మిదేండ్లుగా రాష్ట్రంలో కర్ఫ్యూలు, అల్లర్లు, అసెంబ్లీ ముందు నీళ్ల కోసం ఖాళీ కుండల ప్రదర్శనలు, కరెంటు కోసం కందెనల ప్రదర్శన లు లేవని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో ఉన్న మధ్యప్రదేశ్‌లో ఎరువులు దొరక్క ఎనిమిది మంది రైతులు చనిపోయారని గుర్తుచేశారు.

ప్రజారోగ్యానికి అధునాతన చికిత్స

- హోంశాఖ మంత్రి మహమూద్ అలీ
- ఉస్మానియా ఆస్పత్రి అధునాతన చికిత్సల థియేటర్ ప్రారంభం
- సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో ఫ్యాకో మిషన్‌లు ప్రారంభం



నవతెలంగాణ - ధూల్‌పేట్

ప్రజా ఆరోగ్యానికి అధునాతన చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలోని జీహెచ్‌ఎంసీ బ్లాక్ (ఓటీ కాంప్లెక్స్) 3వ అంతస్తులో కొత్తగా ఏర్పాటు చేసిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆపరేషన్ థియేటర్, పునరుద్ధరించిన జనరల్ సర్జరీ ఓపీ, లింగమార్పిడి క్లినిక్ (సౌకర్యం), పెయిన్ క్లినిక్ (సౌకర్యం)ను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోల్కర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ట్రో సర్జికల్‌లో మరింత అధునాతన చికిత్సలు నిర్వహించేందుకు ఈ థియేటర్ విభాగం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లింగ మార్పిడి, పెయిన్ క్లీనిక్ అధునాతన చికిత్సలు అందుబాటు లోకి వచ్చాయన్నారు. వైద్యంలో ప్రావీణ్యం, అనుభవం గల వైద్యులు అధునాతన చికిత్సలు అందిస్తూ ప్రత్యేకతను చాటుతున్నారని అభినందించారు.

ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తున్న అధునాతన వైద్య చికిత్సలు ప్రజలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శంకర్ యాదవ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి, అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ బి.త్రివేణి, ఆర్ఎంఓ- 1 డాక్టర్ బి.శేషాద్రి, హెచ్ఓడి, సర్జికల్ జీ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం, డాక్టర్ మధుసూధన్, హెచ్ఓడి ఎండోక్రినాలజీ, డాక్టర్ రాకేశ్ సహాయ్, హెచ్ఓడి, అనస్థీషియా విభాగం, డాక్టర్ పాండునాయక్, హెచ్ఓడి, జనరల్ సర్జరీ విభాగం, డాక్టర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



త్యాగానికి ప్రతీక.. బక్రీద్

- ముస్లింలు, ప్రజలకు కాసాని శుభాకాంక్షలు

నవతెలంగాణ-హైదరాబాద్

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగుదేశం తెలంగాణ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ రాష్ట్రంలోని ముస్లిం సోదర, సోదరీమణులకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకను ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందోత్సాహాలతో, సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. బక్రీద్ పుణ్యఫలంతో ప్రజలందరి మధ్య శాంతి సామరస్యం, సోదరభావం వెల్లివిరియాలనీ, అన్ని తరగతుల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో గురువారం నాటి బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కాసాని జ్ఞానేశ్వర్ ఆకాంక్షించారు.

హస్తినలో తెలంగాణ రాజకీయం

కాంగ్రెస్, బీజేపీ నేతల వ్యూహరచన

- ఇరుపార్టీల నేతలూ ఢిల్లీలో మకాం
- ఆఘమేఘాల మీద ఢిల్లీకి బండి
- ఎమ్మెల్యే జగ్గారెడ్డికి ఏఐసీసీ పిలుపు
- అమిత్‌షాతో మంత్రి కేటీఆర్ రహస్య భేటీ!



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికల హడావిడి షురూ అయింది. 'హస్తిన' సాక్షిగా తెలంగాణ రాజకీయం సాగుతున్నది. ఇటు కాంగ్రెస్...అటు బీజేపీ అధిష్టానాలు తమ ముఖ్యనేతలను ఢిల్లీకి పిలిచి మరీ వ్యూహరచనలు చేస్తుండటంతో పొలిటికల్ హీట్ రోజురోజుకీ పెరుగుతున్నది. నేతల హాట్‌హాట్ కామెంట్లు, చేరికల హడావిడిలు, పిలుపులు, ఒకరిపై మరొకరి ఫిర్యాదులు, అధిష్టానాల మందలింపులు, గోడదూకడాలు వంటి రాజకీయ పరిణామాలతో గడియగడియకూ ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ మంత్రులు కూడా హస్తినలో కేంద్ర పెద్దలను కలవటంపైనా రాజకీయంగా అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

రేవంత్ బృందంతో సుదీర్ఘ చర్చలు

కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైన పొంగులేటి, జూపల్లితో చర్చించేందుకు రేవంత్ నేతృత్వంలో ఓ బృందం ఢిల్లీ వెళ్లింది. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలు, చేరికలు, బహిరంగసభలు, ఎన్నికల్లో అనుసరించాల్సిన పద్ధతులపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ రాష్ట్రంపై ఫోకస్ చేశారని ఆ వర్గాలు చెప్పాయి. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలపై అధిష్టానం సీరియస్ అయినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా, రానున్న ఎన్నికల్లో పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ నేత మధుయాష్కీ గౌడ్ ఢిల్లీలో చెప్పారు. టికెట్ల విషయంలో అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

మంత్రి కేటీఆర్ ఇప్పుడే కేంద్రమంత్రులను ఎందుకు కలిశారు?

మంత్రి కేటీఆర్ ఉన్నట్టుండి ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలవడం కూడా ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చుతున్నాయి. ఆయన పర్యటనలో మరో ఆసక్తిరమైన చర్చ చోటు చేసుకుంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మంత్రి కేటీఆర్‌కు అపాయింట్‌మెంట్ ఇచ్చినట్టు ప్రచారమైంది. వెనువెంటనే అమిత్‌షా అపాయిట్‌మెంట్ రద్దు అయినట్టు తెలియజేశారు.

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అన్న ప్రచార నేపథ్యంలో బహిరంగంగా అపాయింట్‌మెంట్ రద్దు చేసి, రహస్యంగా భేటీ అయ్యారనే ప్రచారం జరుగుతున్నది. ఆ తర్వాతనే బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడంలో బీజేపీ నేతల నోర్లు మూతపడ్డాయని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. కాంగ్రెస్, బీజేపీ నేతలు హస్తిన వేదికగా రాజకీయాలకు పదును పెడుతున్నారు.

ఒకవైపు బీఆర్ఎస్ ఢిల్లీ రాజకీయం నడుపుతూనే...రాష్ట్రంలోనే కాదు... మహారాష్ట్రలోనూ కారు బలాన్ని చూపించేందుకు భారీ కాన్వాయ్‌తో సోలాపూర్‌కు వెళ్లారు. అంతేకాకుండా కాంగ్రెస్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జగ్గారెడ్డి కూడా కారెక్కుతారనే ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఖండించారు.

ఎమ్మెల్యే జగ్గారెడ్డిని హడావుడగా ఢిల్లీకి పిలిపించారు. కాంగ్రెస్ అంతర్గత విషయాలపై ఆయన రాహుల్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. పదే పదే రేవంత్‌రెడ్డిపై ఆయన చేస్తున్న వ్యాఖ్యల నేపథ్యంలో అధిష్టానం అడిగి తెలుసుకున్నట్టు ఆ వర్గాలు చెప్పాయి. ఢిల్లీకి చేరిన రాష్ట్ర రాజకీయాలు రాష్ట్రానికి చేరిన తర్వాత ఎటువంటి పరిణామాలు జరుగుతాయో వేచి చూడాల్సిందే.

'ఇది ఎన్నికల సమయం. కర్నాటక ఎన్నికల ఫలితాలతో ఇప్పటికే తీవ్రంగా నష్టపోయాం. తెలంగాణలో మీరూ పార్టీలు వీడితే ఉన్న కాస్త పట్టుపోతుంది. పొలిటికల్‌గా దక్షిణాదిలో బీజేపీకి పెద్ద డ్యామేజ్ అవుతుంది. అలాంటి వాటికి మీరు అవకాశం ఇవ్వొద్దు. 2024లో కేంద్రంలో ఎట్లాగో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. అప్పుడు రాజగోపాల్‌రెడ్డికి

పోవద్దు...ప్రాధాన్యత ఇస్తాం

జాతీయస్థాయిలో మంచి ప్రాధాన్యత ఇస్తాం. మంత్రి పదవి కూడా పరిశీలిస్తాం.

రాష్ట్రంలో నేతల మధ్య సఖ్యత తీసు కొస్తాం. ఈటల రాజేందర్‌కు రాష్ట్రంలో సముచిత స్థానం కల్పిస్తాం. బీఆర్ఎస్‌పై దూకుడుగా ముందుకెళ్లండి. దయచేసి ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీని మాత్రం వీడకండి' అంటూ వారిద్దరినీ అమిత్‌షా కోరినట్టు బయట ప్రచారం జరుగుతున్నది. అమిత్‌షా మాటలకు వారిద్దరూ సైలెంట్‌గా చెవులూపి బయటకు వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే బండి సంజయ్‌ని ఆఘమేఘాల మీద ఢిల్లీకి రప్పించి అందరినీ కలుపుకుని పోవాలని హెచ్చరించినట్టు తెలిసింది. పార్టీలో చేరిన వారికి సరైన గౌరవం ఇవ్వాలని తెలియదా? అంటూ అమిత్‌షా ఘాటుగానే మందలించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఆ సమయంలో హస్తినలోనే ఉన్న ఈటల, రాజగోపాల్‌రెడ్డి లను బండి సంజయ్ కలవలేదు.

ఈ క్రమంలో బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా హస్తం గూటికి చేరుతారనే చర్చ మొదలైంది. ఆ సమయంలో వారిద్దరూ కూడా ఢిల్లీలో అమిత్‌షా, నడ్డాతో భేటీ అయి, బీజేపీ అంతర్గత విషయాలను వారికి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. దీంతో వారి మధ్య విభేదాలు తారాస్థాయిలో ఉన్నాయని ఆ వర్గాలు అంటున్నాయి. తెలంగాణలో ఇప్పటి వరకూ బీజేపీ బలోపేతానికి ఏ చిన్న అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకున్న కమలనాథులు... కవితను అరెస్ట్ చేసే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుండటంతో బీఆర్ఎస్, బీజేపీ మధ్య రహస్య ఒప్పందం జరిగిదంటూ కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. మరోవైపు ఈ మధ్య కేసీఆర్ పదేపదే కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తూ మాట్లాడుతుండటం, అదే బాటలో మంత్రులు, పార్టీ నేతలు కూడా నడవడంతో లోలోపల ఏదో జరుగుతోందనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.

నిబద్ధత గల కమ్యూనిస్టు వేగినాటి

- సంస్మరణ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

వేగినాటి వెంకటేశ్వర్లు నిబద్ధత గల కమ్యూనిస్టు అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామంలో వేగినాటి వెంకటేశ్వర్లు సంస్మరణ సభను పార్టీ నాయకులు తమ్మినేని వెంకట్రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సభలో నున్నా మాట్లాడుతూ.. జీవితాంతం ఎర్రజెండా నీడలో మహోన్నత విలువలతో కూడిన జీవితం గడిపిన వ్యక్తి వెంకటేశ్వర్లు అని అన్నారు. వేగినాటి కుటుంబం పేదరికంలో ఉన్నా ఎటువంటి ప్రలోభాలకూ గురికాకుండా జీవితాంతం ఎర్రజెండాను చేతబట్టి, కాలుకు గజ్జకట్టి ఎంతోమందికి తన పాట, ఆట, మాట ద్వారా చైతన్యం కలిగించిన వ్యక్తి అని కొనియాడారు. సుదీర్ఘకాలం కమ్యూనిస్టు పార్టీలో పని చేయడంతో పార్టీ వ్యవహారాల్లో అనుక్షణం బిజీగా ఉండేవారని, అయినా కుటుంబాన్ని ఇద్దరి పిల్లలను కంటికి రెప్పలా కాపాడిన ఆయన భార్య సత్యవతి జీవితం ఆదర్శనీయమన్నారు. వెంకటేశ్వర్లు మరణం సీపీఐ(ఎం)కు, ప్రజానాట్యమండలికి తీరని లోటన్నారు. వేగినాటి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, వై.విక్రమ్ మాట్లాడుతూ.. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా చెదరని ఆత్మవిశ్వాసం వేగినాటి సొంతమన్నారు. సభలో పార్టీ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, సర్పంచ్ సిద్దినేని కోటయ్య, ఆంధ్ర బ్యాంక్ సొసైటీ వైస్ చైర్మెన్ తమ్మినేని విజయలక్ష్మి, సీపీఐ(ఎం) నాయకులు షేక్ బషీరుద్దీన్, బోడపట్ల సుదర్శన్, ప్రకాష్, రంజాన్ పాషా, దోనోజు లక్ష్మయ్య, జాజుల నాగేశ్వరరావు, వేగినాటి బుచ్చి రామయ్య, యల్లంపల్లి నాగయ్య, జక్కంపూడి కృష్ణ, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు అన్నాబత్తుల సుబ్రహ్మణ్య కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నామ లక్ష్మీనారాయణ, వేముల సదానంద్, జిల్లా నాయకులు, వేగినాటి కుమారులు భాస్కర్, లెనిన్, సోదరులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నాకు ఏం జరిగినా కేసీఆర్‌దే బాధ్యత

- మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

నవతెలంగాణ-రఘునాథపల్లి

సైకో కౌశిక్ రెడ్డిని ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తూ హత్య రాజకీయాలకు పాల్పడుతున్నారని, తనకు ఏం జరిగినా సీఎం కేసీఆర్‌దే బాధ్యత అని మాజీ మంత్రి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం వరంగల్ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామంలో ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి తనను హత్య చేసేందుకు కుట్రలు చేస్తున్నారని, అందుకు ప్రధాన కుట్ర దారి కేసీఆర్ అని ఆరోపించారు. కొన్ని రోజులుగా ఒక సైకో ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలను తిట్టడం, బెదిరించడం, అక్రమ కేసులు పెట్టడం జరుగుతుందని, దాంతో అతనిపై వరంగల్, కరీంనగర్ సీపీలకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఒక సర్పంచ్‌ని కూడా గతంలో జైలుకు పంపించారని ఆరోపించారు. హుజూరాబాద్, జమ్మికుంట చౌరస్తాల్లో ఎవరు తప్పు చేశారో తెలుసుకుందాం రా అని సవాల్ విసిరారు. నీతి నిజాయితీ ఉంటే ప్రతి అంశంపై దర్యాప్తు చేసి ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేయాలని సీపీలను కోరారు. ఈటల రాజేందర్ తెరిచిన పుస్తకం అని, ఎవరికి ఎలాంటి హామీ చేయలేదని తెలిపారు గతంలో మాజీ నక్సలైట్ నహీం సాంబశివుని చంపినప్పుడు 100 సార్లు నన్ను హెచ్చరించారని, అయినా భయపడలేదని, ఇలాంటి వారికి కూడా తాను భయపడనని స్పష్టంచేశారు. సమావేశంలో మాజీ సైనికులు డాక్టర్ మాచర్ల బిక్షపతి, నాయకులు కట్ల సదానందం, పిట్టల కుమార్, మారబోయిన సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల కోసం పాఠశాలల దత్తత

- సినీ నటి మంచు లక్ష్మి
- గద్వాల జిల్లాలో 30 ప్రభుత్వ పాఠశాలల దత్తతకు ఒప్పందం



నవతెలంగాణ- జోగులాంబ గద్వాల

పేద విద్యార్థుల కోసమే పాఠశాలలను దత్తత తీసుకుంటున్నట్టు ప్రముఖ నటుడు మోహన్ బాబు కూతురు, నటి మంచు లక్ష్మి అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని 30 ప్రభుత్వ పాఠశాలలను టీచ్ ఫర్ చేంజ్ ఫౌండర్ మంచు లక్ష్మి దత్తత తీసుకుంటున్నట్టు కలెక్టర్ క్రాంతి సమక్షంలో బుధవారం ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ.. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిద్దేందుకు తమ సంస్థ పని చేస్తుందని తెలిపారు. గతంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో పూర్తిస్థాయిలో పనిచేసి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేసినట్టు చెప్పారు. చదువులో వెనుకబడిన జిల్లాలో ఇలాంటి సేవలు చేయడం చాలా సంతోషంగా ఉందని, ఆగస్టు లోపు పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహన్, విద్యాశాఖ అధికారి సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

యూనివర్సిటీల టైం స్కేల్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

- వారికి కనీస వేతనాలివ్వాలి : జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ వర్సిటీ సదస్సులో సీఐటీయూ కార్యదర్శి జె.వెంకటేశ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యూనివర్సిటీలలో పనిచేసే టైమ్ స్కేల్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలనీ, ఎన్ఎంఆర్, డైలీవేజ్, కంటింజెంట్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలివ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హన్మకొండ జిల్లాలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. దీనికి ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మెట్టు రవి అధ్యక్షత వహించారు. ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాగుల రమేష్, (కాకతీయ యూనివర్సిటీ) రామ్‌చందర్, దేశిని రవి, అచ్చికాయల చిరంజీవి, (శాతవాహన) శ్రీనివాస్, సతీష్, (ఎజి యూనివర్సిటీ, హనుమకొండ) జి. సమ్మయ్య, వి. దర్గయ్య, ఎస్‌బి. రఘు, రాజ్‌భరత్, ఎం. రమేష్, కె. స్వరూప, రమ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 18 వర్సిటీల్లో టైమ్ స్కేల్, డైలీవేజ్, ఎన్ఎంఆర్, కంటింజెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర పద్ధతుల్లో సుమారు 10 వేల మంది పనిచేస్తున్నారని చెప్పారు. వారికి వేతనాల్లో తీవ్రమైన వ్యత్యాసాలున్నాయనీ, మూడేండ్లుగా ఏజెన్సీల ద్వారానే నియామకాలు జరుగుతున్నాయని వివరించారు. యూనివర్సిటీలు నిర్ణయించిన కనీస వేతనాలే అతి తక్కువగా ఉన్నాయనీ, వాటిలోనూ ఏజెన్సీలు పర్సంటేజీల పేరుతో కోతలు పెడుతున్నాయని విమర్శించారు. ఒక్కో యూనివర్సిటీకి ఒక్కో వేతన నిర్ణయం అమలు చేయడం దారుణమన్నారు. యూనివర్సిటీల యాజమాన్యాలు, రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. వారికి కనీస వేతనాలివ్వడంతో పాటు గుర్తింపు కార్డులు, బస్ పాస్‌లివ్వాలనీ, రూ.10 లక్షల ఇన్సూరెన్స్ చెల్లించాలని కోరారు. రాగుల రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత దయనీయ స్థితిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు న్యాయమైన డిమాండ్లపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో భవిష్యత్ కార్యాచరణను మెట్టురవి ప్రవేశపెట్టారు.

సదస్సు కార్యాచరణ

- జూలై 1న రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వద్ద రిలే నిరాహార దీక్షలు.
- ఆర్థిక శాఖామంత్రి, విద్యా శాఖామంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీలకు జూలై 3 నుంచి 6 వరకు రాయబారాలు
- నాన్ టీచింగ్ స్టాఫ్ అందరూ డిమాండ్ బ్యాడ్జీలు ధరించాలి.
- జూలై 7న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద యూనివర్సిటీల నాన్ టీచింగ్ శంఖారావం సభకు వేలాదిగా తరలిరావాలి.

తగ్గిన సీజనల్ వ్యాధులు : మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతంతో పోలిస్తే రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు చాలా వరకు తగ్గాయని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యాలయంలో ఆయన జిల్లా వైద్యారోగ్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మిషన్ భగీరథ అమలుతో కలుషిత నీటి ద్వారా వచ్చే వ్యాధులు దాదాపు తగ్గిపోయాని తెలిపారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా కీటకాల ద్వారా వచ్చే వ్యాధులు చాలా వరకు తగ్గాయనీ, అక్కడక్కడా వెలుగు చూస్తున్నాయని చెప్పారు. ఆ వ్యాధుల నియంత్రణకు చర్యలు



తీసుకుంటున్నామని తెలిపారు. మలేరియాను గుర్తించే 8 లక్షల రాపిడ్ కిట్లు, డెంగీని గుర్తించే 1.23 లక్షల ఎలిజా కిట్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. 26 ఆస్పత్రుల్లో బ్లడ్ కాంపోనెంట్ మెషిన్లు సేవలందిస్తున్నాయని వివరించారు.

'గృహలక్ష్మి'లో వికలాంగులకు ఐదు శాతమివ్వాలి

- మంత్రి వేములకు రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ కె.వాసుదేవరెడ్డి వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు ఐదు శాతం కోటా కేటాయించాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ కె.వాసుదేవరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో మంత్రి ప్రశాంత్ రెడ్డికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సమాజానికి ఎంతో కృషిచేసిందని కొనియాడారు. దేశంలోనే వికలాంగులకు అత్యధికంగా పింఛన్ ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది వికలాంగులున్నారనీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని సంక్షేమ పథకాల్లో కూడా వికలాంగులకు రిజర్వేషన్ అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు. గృహలక్ష్మి పథకంలోనూ ఐదు శాతం కోటా కేటాయించాలని కోరారు.

రైతు నుంచి లంచం తీసుకుంటూ.. ఏసీబీకి పట్టుబడ్డ ల్యాండ్ సర్వేయర్ ఏడీ,

- సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ

భూమి నాలా కన్వర్షన్ చేసిన తర్వాత పంచనామ సర్టిఫికెట్ ఇవ్వడానికి లంచం తీసుకుంటూ ల్యాండ్ సర్వేయర్ ఏడీ, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. నిజామాబాద్‌లోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు బుధవారం వలపన్ని వారిని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. మోర్తాడ్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన రాజేందర్ అనే రైతుకు సంబంధించిన భూమి నాలా కన్వర్షన్ చేసిన తర్వాత పంచనామ సర్టిఫికెట్ కోసం కొన్ని రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. సర్టిఫికెట్ కోసం జూనియర్ అసిస్టెంట్ రహీమా, సూపరింటెండెంట్ వెంకటేశ్ రూ॥ 5000 తీసుకున్నారు. ఏడీకి మరో రూ.10వేలు ఇస్తేనే సర్టిఫికెట్ ఇస్తామని చెప్పడంతో బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం రూ.10వేలు ఏడీ శ్యామ్ సుందర్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ముగ్గురిని విచారణ చేసి కరీంనగర్‌కు పంపినట్టు ఏసీబీ డీఎస్పీ, సీఐ శ్రీనివాస్, నాగేష్ తెలిపారు.

8 నెలల క్రితమే పోస్టింగ్.. గతంలోనూ అనేక అక్రమాలు

సంగారెడ్డి జిల్లాకు చెందిన శ్యాం సుందర్‌రెడ్డి గతంలో మహబూబ్‌నగర్‌లో పనిచేసినప్పుడు అనేక ఆరోపణలు వచ్చాయి. దాంతో అక్కడి కలెక్టర్ ఆయన్ను సరెండర్ చేశాడు. నిజామాబాద్‌లో ఏడీ పోస్టు ఖాళీ కావడంతో ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నించగా.. అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి తిప్పి పంపారు. చివరకు కమిషనర్ సిఫారసుతో 8 నెలల క్రితం వచ్చి జాయిన్ అయ్యారు. అప్పటి నుంచి రైతులను ఇబ్బందులు పెడుతూనే ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఇటీవల మంత్రి వేములతో సైతం చివాట్లు తిన్నట్టు సమాచారం. చివరాఖరకు రైతు ఫిర్యాదుతో ఏసీబీకి చిక్కి కటకటాలపాలయ్యారు.

విడిపోయిన గూడ్స్ రైలు బోగీలు..

- గార్డ్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-కేసముద్రం రూరల్



పై నుంచి వస్తున్న ఓ గూడ్స్ రైలు.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం-ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు లింక్ తెగిపోవడంతో గమనించిన క్యాబిన్ గాడ్.. లోకో పైలెట్‌ను అప్రమత్తం చేయడంతో ప్రమాదాన్ని తప్పించాడు. ఇంజన్‌తో కూడిన గూడ్స్ రైలు కేసముద్రం నుంచి వరంగల్ బయలుదేరి వెళుతున్న క్రమంలో కొన్ని బోగీలు ఇంజన్ నుంచి వేరు బడ్డాయి. అలా రైలు.. ఓ కిలో మీటర్ మేర ప్రయాణం చేయడంతో గమనించిన క్యాబిన్‌లో ఉన్న గార్డు అప్రమత్తతతో వెంటనే లోకో పైలెట్‌కు సమాచారం ఇవ్వడంతో రైలు ఆపారు. ఆపై విడిపోయిన బోగీలను ఇంజన్‌తో ఉన్న మరో బోగీలకు తగిలించుకొని ప్రయాణం కొనసాగించారు. ప్రమాదం తప్పడంతో లోగో పైలెట్లు, క్యాబిన్ గార్డు ఊపిరి పీల్చుకున్నారు.

సర్కారు రైస్‌మిల్లులకు అడుగులు

- స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లలో ఏర్పాటుకు ఆలోచనలు
- రూ.2వేల కోట్లతో మిల్లుల ఏర్పాటుకు సీఎం గ్రీన్‌సిగ్నల్
- రూ.100కోట్లకుపైగా పెట్టుబడికి టేలర్‌మేడ్ ఇన్సెంటీవ్స్
- స్పెషల్ జోన్లలో ఐదేండ్లపాటు యూనిట్ విద్యుత్‌కు రూ.2 చార్జీ
- 75శాతం వరకు వడ్డీ మాఫీ, మార్కెట్ ఫీజులో 100శాతం రాయితీ
- బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్
- హైదరాబాద్ సచివాలయంలో జపాన్ సటాకే కార్పొరేషన్ ప్రతినిధులతో భేటీ



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'రాష్ట్రంలో భూమికి బరువయ్యేంతలా వస్తున్న ధాన్యం దిగుబడులకు ఇప్పుడున్న మిల్లింగ్ సామర్థ్యం సరిపోవడం లేదు. అందువల్ల ప్రభుత్వమే రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన చోట మిల్లుల ఏర్పాటుకు అడుగులు వేస్తోంది. ఇప్పటికే సీఎం కేసీఆర్ మిల్లుల ఏర్పాటుకు రూ.2వేల కోట్ల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వీటితోపాటు స్పెషల్ ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్లు ఏర్పాటు చేసి అక్కడ పెట్టుబడులు పెట్టి మిల్లులు ఏర్పాటు చేసుకునేవారికి రాయితీలు, ప్రభుత్వ సహకారం అందిస్తాం' అని బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ సచివాలయంలో జపాన్‌కు చెందిన సటాకే కార్పొరేషన్ ప్రతినిధులతో ఆయన బుధవారం భేటీ అయ్యారు.

ప్రభుత్వం మిల్లులను ఏర్పాటు చేయడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లలో ప్రత్యేకంగా రూ.100కోట్లకు పైగా పెట్టుబడి పెట్టినవారికి టేలర్ మేడ్ ఇన్సెంటీవ్స్ అందిస్తుందని మంత్రి చెప్పారు. ఈ జోన్లలో సాధారణ పెట్టుబడిదారులకు సైతం ఐదేండ్లపాటు యూనిట్ విద్యుత్‌కు రూ.2చార్జీతో నాణ్యమైన కరెంటు, 75 శాతం వరకూ వడ్డీ మాఫీ, మార్కెట్ ఫీజుల్లో 100 శాతం రాయితీ అందిస్తుందని తెలిపారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, స్వయం సహాయక సంఘాలు, సహకార సంఘాలకు ప్రత్యేక రాయితీలనూ అందిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు.

సీఎం దార్శనికతతోనే పదింతల ధాన్యం దిగుబడి


సీఎం కేసీఆర్ దార్శనిక విధానాలతోనే ధాన్యం దిగుబడులు రాష్ట్రంలో పదింతలు పెరిగాయని మంత్రి గంగుల అన్నారు. అందుకు అనుగుణంగానే మిల్లింగ్ ఇండస్ట్రీని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2014లో 1815 రైస్ మిల్లులు ఉండగా నేటికి వాటి సంఖ్య 2574కి మాత్రమే పెరిగిందని, ఈ నేపథ్యంలో ఏటా 3 కోట్ల టన్నులకుపైగా ఉత్పత్తవుతున్న ధాన్యాన్ని మిల్లింగ్ చేసే సామర్థ్యం సరిపోవడం లేదని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మిల్లులను ఏర్పాటు చేసేందుకు సీఎం కేసీఆర్ ఆదేశించారని, అందుకు రూ.2వేల కోట్లు ఇచ్చేందుకు అనుమతులూ ఇచ్చారని చెప్పారు.

ప్రపంచ టెక్నాలజీని ఒడిసిపట్టుకుని..

ప్రపంచవ్యాప్తంగా వచ్చే అత్యాధునిక టెక్నాలజీని ఒడిసిపట్టడంలో తెలంగాణ ప్రభుత్వం ముందు ఉంటుందని, మిల్లింగ్ ఇండస్ట్రీలోనూ ఆ సాంకేతికతను అందిపుచ్చుకుంటామని తెలిపారు. ధాన్యం మిల్లింగ్‌తోపాటు ఉప ఉత్పత్తులైన రైస్ బ్రాన్ ఆయిల్, నూక తదితరాల ప్రాసెసింగ్ సైతం చేస్తామన్నారు. ఇందుకోసం ప్రపంచంలోనే అత్యాధునిక టెక్నాలజీ అందిస్తున్న 'సటాకే', 'సైలో' తదితర కంపెనీల ప్రతినిధులతో చర్చిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సటాకె కార్పొరేషన్, ఇతర కంపెనీల ప్రతినిధులు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని మంత్రికి వివరించారు. గంటకు 20టన్నుల నుంచి 1200 టన్నుల మిల్లింగ్ కెపాసిటీ తమ సొంతమని తెలిపారు. బాయిల్డ్, రా రైస్ దేనికైనా అనుగుణంగా అత్యంత అధునాతన పద్ధతుల ద్వారా వ్యర్థం, వ్యయం తగ్గేలా టెక్నాలజీ అందిస్తున్నామని చెప్పారు. అమెరికా, చైనా, థాయిలాండ్, వియత్నాం తదితర దేశాలతోపాటు ఇండియాలోని తమ కార్యకలాపాలను వివరించారు. కంపెనీ ప్రతినిధులతో అన్ని అంశాలూ కూలంకషంగా చర్చించిన మంత్రి గంగుల.. త్వరలోనే పూర్తి స్థాయి నివేదికను ముఖ్యమంత్రికి సమర్పిస్తామని తెలిపారు. ఈ భేటీలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్, సంస్థ జీఎం రాజారెడ్డి, టిఎస్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ డైరెక్టర్ అఖిల్ కుమార్ గవార్, ప్రతినిధి సుష్మ, జపాన్ సటాకే కార్పోరేషన్ ప్రతినిధులు ఆర్యే బజాజ్, హెచ్. సతీష్ కుమార్, కె.విఠల్, కె.వినయ్ కుమార్ పాల్గొన్నారు.

సంపాదకీయం

'ప్రాథమికం'... అత్యంత ఆవశ్యకం...



ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దేన్ క్యూర్ అనేది ఆంగ్లంలో ఉన్న ఒక నానుడి. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే అది రాకుండా తీసుకోవాల్సిన నివారణా చర్యలు ముఖ్యమనేది దాని సారాంశం. వైద్యానికి సంబంధించిన ఈ నానుడిని అన్ని విషయలకూ పోల్చుకోవచ్చు. ప్రజారోగ్యానికి

వామపక్ష పాలనలోని కేరళలో కొన్ని దశాబ్దాలుగా ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేసేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకున్నారు. ఫలితంగా అక్కడ గ్రామీణ స్థాయిలోనే, ప్రాథమిక దశలోనే జబ్బును గుర్తించి, దాని నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటారు. దీంతో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ప్రజల ఆరోగ్యం మెరుగుపడటమేగాక.. వారి ఆయుర్దాయం కూడా పెరిగిందని తేలింది. అందుకే ప్రజారోగ్యంలో కేరళ దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచింది. ఇప్పుడు తెలంగాణకు కూడా ఆ మోడల్ అత్యంత అవసరం.

సంబంధించి ఈ పోలిక ఎక్కువ అవసరం. ఎందుకంటే ఇప్పుడు వర్షాకాలం ఆరంభమైంది కాబట్టి.. సీజనల్ వ్యాధుల దాడి ఆరంభమైంది కాబట్టి. 'బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసిన తర్వాత గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయి. పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి తర్వాత సీజనల్ వ్యాధులు తగ్గాయి. మిషన్ భగీరథ వల్ల నీటి సంబంధిత వ్యాధులూ తగ్గుముఖం పట్టాయి...' అంటూ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తాజాగా ప్రకటించారు. హైదరాబాద్‌లోని పెద్దాసుపత్రులకు బయటి నుంచి వచ్చే రోగుల (ఓపీ) సంఖ్య కూడా తగ్గిందంటూ ఆయన నొక్కి వక్కాణించారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లోని సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయా..? లేక పెరిగాయా..? అన్నది ఇక్కడ మనం నిశితంగా పరిశీలించి, పరిష్కరించాల్సిన అంశం.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం... పెద్దాసుపత్రుల నిర్మాణం, జిల్లాకో వైద్య కళాశాల ఏర్పాటుపై దృష్టి సారించిన విషయం వాస్తవమే. ఇందులో భాగంగానే నిమ్స్‌లో దశాబ్ది బ్లాక్, వరంగల్ ఎంజీఎంలో 28 అంతస్తులతో నూతన భవనం, హైదరాబాద్ చుట్టూ నిమ్స్ తరహాలో నాలుగు వైపుల నాలుగు పెద్దాసుపత్రుల ఏర్పాటుకు సర్కారు చర్యలు చేపట్టిన సంగతి విదితమే. అయితే ఇవి రాజధాని నగరానికి, జిల్లా కేంద్రాలు, ముఖ్యమైన నగరాలు, పట్టణాలకు పరిమితమైనవి. ఇక్కడి నుంచి కిందికి తొంగిచూస్తే గానీ మనకు అసలు విషయం బోధపడదు. ముఖ్యంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన ప్రాంతాలు, మారుమూల పల్లెల్లో అసలు సిసలు పరిస్థితి మనకు కనబడుతుంది. కనీసం సూది మందుకు కూడా దిక్కులేని గూడేల్లో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్‌గున్యాకు చికిత్సను ఊహించగలమా..? చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ.. ప్రసవ వేదన పడుతున్న గర్భిణీలను డోలీల్లో మోసుకెళుతున్న దృశ్యాలు ఇప్పటికీ మన ఆదిలాబాద్, ఏటూరు నాగారం, భద్రాచలం, ములుగు, ఆమ్రాబాద్ ఏజెన్సీ ఏరియాల్లో కనబడుతూనే ఉంటాయి..మనతో అవి కంటతడి పెట్టిస్తూనే ఉంటాయి. అంబులెన్సు వెళ్లటానికి కూడా సరైన దారి లేక 'వైద్యమో చంద్రశేఖరా...' అంటూ జనం అరిగోస పడుతున్న సందర్భాలు ఇప్పటికీ అనేకం.

ఈ గోసలకు, ప్రజల ఆరోగ్య బాధలకు ప్రధాన కారణం విధానపరమైన లోపమేనని చెప్పక తప్పదు. వామపక్ష పాలనలోని కేరళలో కొన్ని దశాబ్దాలుగా ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేసేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకున్నారు. ఫలితంగా అక్కడ గ్రామీణ స్థాయిలోనే, ప్రాథమిక దశలోనే జబ్బును గుర్తించి, దాని నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటారు. దీంతో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ప్రజల ఆరోగ్యం మెరుగుపడటమేగాక.. వారి ఆయుర్దాయం కూడా పెరిగిందని తేలింది. అందుకే ప్రజారోగ్యంలో కేరళ దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచింది. ఇప్పుడు తెలంగాణకు కూడా ఆ మోడల్ అత్యంత అవసరం. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, ఫీవర్ ఆస్పత్రికి జ్వర పీడితులు క్యూ కడుతున్నారనేది గణాంకాలు చెబుతున్న వాస్తవం. విశ్వ నగరంలోనే ఇలా జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో ఇక మండల, గ్రామీణ ప్రాంతాల పరిస్థితి చెప్పలేం. ఈ క్రమంలో కేవలం ద్వితీయ (జిల్లా కేంద్ర ఆస్పత్రులు), తృతీయ స్థాయి (రాష్ట్ర స్థాయి ఆస్పత్రులు, వైద్య కళాశాలలు) వైద్యం మీదే కాకుండా ప్రాథమిక స్థాయి వైద్యంపై కూడా సర్కారు ఎక్కువగా దృష్టి సారించాలన్నది నిపుణుల సూచన. పీహెచ్‌సీలు, సామూహిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో కావాల్సిన వైద్య పరికరాలు, మందులను అందుబాటులో ఉంచటం అన్నది ఇక్కడ కీలకం. వైరల్ ఫీవర్లు ఎక్కువైనప్పుడు వాటి నిర్ధారించేందుకు వీలుగా సంబంధిత కిట్లను కూడా కిందిస్థాయికి సరఫరా చేయాలి. దీంతోపాటు రోగుల సంఖ్యకు సరిపడా వైద్యులు, నర్సులు, పారామెడికల్, ఇతర సిబ్బందిని నియమించటం ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని సత్వరమే అందించే వీలు కలుగుతుంది. ఆ దిశగా ఏలికలు ఆలోచించి, నిర్ణయాలు తీసుకున్నప్పుడే 'ఆరోగ్య తెలంగాణ...' సాధ్యం.

సాగునీటి సమస్య పరిష్కారానికి ఇంకెంతకాలం?



సారంపల్లి మల్లారెడ్డి

"నీళ్ళు, నిధులు, నియామకాలు" సాధన కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి 2014 జూన్ 2న తెలంగాణ విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. రాష్ట్రంలో 1.63కోట్ల ఎకరాలు సాగులో ఉండగా, 2014 నాటికి 40లక్షల ఎకరాలు మాత్రమే సాగునీటి వనరులు కల్పించబడ్డాయి. కృష్ణా, గోదావరి నదులు రాష్ట్రం గుండా ప్రవహిస్తున్నప్పటికీ 60శాతం సాగుభూమి నీటి సౌకర్యానికి నోచుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2014 నుండి 2023 మార్చి నాటికి రూ.1,18,647.48కోట్లు కేసీఆర్ ప్రభుత్వం బడ్జెట్‌నుండి సాగునీటిపై వ్యయం చేసింది. ఇవికాక కార్పొరేషన్ల ద్వారా మరో రూ.66,245.37 కోట్లు వ్యయం చేసింది. ఇంత ఖర్చు చేసినా నేటికీ 75.10లక్షల ఎకరాలు మాత్రమే సాగునీటి కిందికి తీసుకొచ్చింది. దశాబ్దాల కింటే అప్పటి ప్రభుత్వాలు 1956 నుండి 2004 వరకు రూ.17వేల కోట్లు ప్రాజెక్టుల నిర్మాణానికి వ్యయం చేశాయి. 2004 నుండి 2014 వరకు జలయజ్ఞం పేరుతో వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.92వేల కోట్లు వ్యయం చేశారు. 2015 నుండి 2022 డిసెంబర్ వరకు టీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.84లక్షల కోట్లు (బడ్జెట్, కార్పొరేట్ రుణాలతో సహా) వ్యయం చేసింది.

టీఆర్ఎస్ హయాంలో మూడు ప్రాజెక్టులు రీడిజైన్

టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు ప్రాజెక్టులను రీడిజైన్ చేసింది. 1. కాళేశ్వరం 2. సీతారామసాగర్ 3. పాలమూరు ఎత్తిపోతల. ఈ మూడు ప్రాజెక్టులతో పాటు కల్వకుర్తి ప్రాజెక్టును కూడా రీడిజైన్ చేసి

2022 ఆగస్టు మొదటివారంలో కాళేశ్వరానికి చెందిన కన్నెపల్లి పంప్‌హౌజ్ వద్ద 17పంపులు నీటిలో మునిగాయి. రక్షణ కవచంగా ఏర్పాటు చేసిన గోడ కూలిపోవడంతో ఈ బాహుబలి పంపులు నీటమునిగాయి. ఇంతవరకూ రెండు పంపులు మాత్రమే మరమ్మతులు చేశారు. మొదట రూ.20కోట్లతో రిపేరు చేస్తామన్న చీఫ్ ఇంజనీర్ తర్వాత రూ.1,650కోట్లు కావాలని ఎస్టిమేషన్ వేశారు. ఇప్పటికీ రిపేర్లు కొనసాగుతూనే ఉన్నాయి. గత మూడు సంవత్సరాల క్రితం కల్వకుర్తి ఎత్తిపోతలకు చెందిన ఎనిమిది పంపులు నీటిలో మునిగిపోయాయి. అందులో నాలుగు పంపులు మాత్రమే రిపేరు చేశారు.

ఆయకట్టును పెంచారు. అలాగే శ్రీశైలం నుండి సొరంగమార్గం ద్వారా రూపొందించిన డిండి ప్రాజెక్టు ఆయకట్టును కల్వకుర్తి ద్వారా మార్చి 3,41,500 ఎకరాలకు నూతన ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. 150 సంవత్సరాల క్రితం కాటన్ మహాశయుడు నిర్మాణం చేసిన దుమ్ముగూడెం డ్యామ్‌కు 200మీటర్ల దిగువన సీతమ్మ సాగర్ ప్రాజెక్టును ప్రారంభించారు. 6.74లక్షల ఎకరాల ఆయకట్టుకు ఉపయోగపడే విధంగా రూ.2600కోట్లతో పనులు జరుగుతున్నాయి. 63గ్రామాలతో పాటు అశ్వాపురం, చర్ల, దుమ్ముగూడెం మండలాలే కాక ఖమ్మం, వరంగల్ ప్రాంతాలకు కూడా ఉపయోగపడే విధంగా డిజైన్ చేశారు. గోదావరి మట్టం సముద్రమట్టానికి 43మీటర్లు ఉండగా ఈ డ్యామ్‌ను 69మీటర్ల ఎత్తులో నిర్మాణం చేపడుతున్నారు. 2023నాటికి పూర్తిచేయాలన్న లక్ష్యం నెరవేరలేదు. ఈ డ్యామ్ ద్వారా 36.57టిఎమ్‌సిల నీరు నిల్వ ఉంటుంది. 3,121 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతున్నాయి. గతంలో నిర్మాణం చేపట్టిన 20మేజరు ప్రాజెక్టుల కింద 67,15,342 ఎకరాల ఆయకట్టును సాగులోకి తేవాల్సి ఉంది. ఇందులో పెనుగంగపై లోయర్ పెనుగంగ (47,520 ఎకరాలు), రాజుపేట (2500 ఎకరాలు), చెనాక-కొరాట (13,500 ఎకరాలు), పింపార్డే (4500 ఎకరాలు) కొత్త ప్రాజెక్టులను నిర్మాణం చేపట్టారు. గతంలో ప్రాణహితపై కౌటాల వద్ద చేపట్టిన ప్రాజెక్టును మార్చి ప్రస్తుతం మహారాష్ట్రలోని వార్ధా నదిపై నిర్మాణం కొనసాగిస్తున్నారు. అదే విధంగా సంగారెడ్డి జిల్లాలో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను రూ.5,197.80 కోట్లతో ప్రారంభించారు. సంగమేశ్వర కింద 2.19లక్షల ఎకరాలు, జహీరాబాద్, ఆందోల్, సంగారెడ్డి నియోజకవర్గాలలో 11మండలాలు సాగునీటి వసతి కల్పిస్తారు. బసవేశ్వర లిఫ్టు కింద 1.65లక్షల ఎకరాలకు, నారాయణఖేడ్, ఆంధోల్‌లలో ఎనిమిది మండలాలకు సాగునీరందించాలి. ఈ కొత్త ప్రాజెక్టులే కాకుండా తుపాకులగూడెం (సమ్మక్క బ్యారేజ్) పూర్తికావచ్చింది. సమ్మక్క బ్యారేజ్ నిర్మాణంతో దేవాదుల ఎత్తిపోతల పథకం కోసం నిర్మాణం చేసిన పంప్‌హౌజ్ సంవత్సరం పొడవునా నీటిలో ఉంటుంది. ఆవిధంగా దేవాదులకు కేటాయించిన 6లక్షల ఎకరాలకు నీటి సౌకర్యం కల్పించడం జరుగుతుంది. గోదావరి జలాలను వినియోగంలోకి తేవడంలో కాళేశ్వరం ప్రాజెక్టు, సీతారామ ప్రాజెక్టులు అత్యంత కీలకంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులే కాకుండా కాళేశ్వరం కార్పొరేషన్ 2016లో ఏర్పాటు చేసి బ్యాంకుల నుండి రుణాలు తెచ్చారు. 2019లో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కాళేశ్వరం కార్పొరేషన్‌లో కలిపారు. మంజీరా కార్పొరేషన్ ఏర్పాటు చేసి మెదక్ జిల్లాకు సాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. కార్పొరేషన్ ద్వారా రూ.1,17,091కోట్లు మంజూరు పొందినప్పటికీ నేటివరకూ రూ.81,296 కోట్లు మాత్రమే రుణాలు అందాయి. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, నాబార్డు, రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ (ఆర్ఇసి), పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా రుణాలు పొందారు. ఈ రుణాలను బడ్జెట్‌లో చూపలేదు. ఈ ఆదాయం కాకుండా, బడ్జెట్ నుండి రూ.1.18లక్షల కోట్లు వ్యయం చేశారు.

దశాబ్దాలు గడుస్తున్నా పూర్తికాని ప్రాజెక్టులు

దశాబ్దాల క్రితం నుండీ నిర్మాణం సాగుతున్నా శ్రీరాంసాగర్ రెండో దశ, దిండి, నెట్టెంపాడు, కల్వకుర్తి, బీమా, దేవాదుల, కోయిల్‌సాగర్, చౌటపల్లి హన్మంతరెడ్డి లిఫ్ట్, లెండి, పోచారం, శ్రీరాంసాగర్ వరద కాలువ, ఏఎమ్ఆర్ ప్రాజెక్టులు ఇంతవరకూ పూర్తికాలేదు. ఎప్పటికప్పుడు కొత్త ప్రాజెక్టులను ప్రారంభించటం, గతంలో చేపట్టిన ప్రాజెక్టులను

2019లో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కాళేశ్వరం కార్పొరేషన్‌లో కలిపారు. మంజీరా కార్పొరేషన్ ఏర్పాటు చేసి మెదక్ జిల్లాకు సాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. కార్పొరేషన్ ద్వారా రూ.1,17,091కోట్లు మంజూరు పొందినప్పటికీ నేటివరకూ రూ.81,296 కోట్లు మాత్రమే రుణాలు అందాయి. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, నాబార్డు, రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ (ఆర్ఇసి), పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా రుణాలు పొందారు. ఈ రుణాలను బడ్జెట్‌లో చూపలేదు. ఈ ఆదాయం కాకుండా, బడ్జెట్ నుండి రూ.1.18లక్షల కోట్లు వ్యయం చేశారు.

పూర్తిచేయకపోవడమే కాక పంటకాలువల నిర్మాణం లేక ఆ ప్రాజెక్టులపై పెట్టిన పెట్టుబడి వృధా అవుతున్నది. ఆదిలాబాద్ జిల్లాలో 2004లో ప్రారంభించిన జలయజ్ఞంలోని 12మధ్యతరహా ప్రాజెక్టులు నేటికి పూర్తి కాలేదు. జగన్నాధ ప్రాజెక్టు రూ.60కోట్లతో ప్రారంభించి రూ.220కోట్లు వ్యయం చేసినా పూర్తి కాలేదు. 2023 ఫిబ్రవరి 11న ముఖ్యమంత్రి శాసనసభలో చేసిన ప్రకటన ప్రకారం 2014 నుండి డిసెంబర్ 2022 వరకు 19.48లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. 24 భారీ ప్రాజెక్టుల కింద 69లక్షల ఎకరాలు, 36 మధ్యతరహా ప్రాజెక్టుల కింద 24.73లక్షల ఎకరాలు, ఐడిసి, చిన్నతరహా ప్రాజెక్టుల కింది 5.53లక్షల ఎకరాలు, మిషన్ కాకతీయ పథకం కింద 22,000 చెరువులను మరమ్మతు చేయడం ద్వారా మొత్తం 46వేల చెరువుల కింద 20.78లక్షల ఎకరాల ఆయకట్టు నీటివసతి కల్పించినట్లు చెప్పారు. అదే సమావేశంలో 2022-23లో 12 ప్రాజెక్టుల కింద 12.97లక్షల ఎకరాల ఆయకట్టును లక్ష్యంగా పెట్టుకుని 59,178 ఎకరాలకు మాత్రమే సాగునీటి వనరులు కల్పించారు. 2023-24లో 18 ప్రాజెక్టుల కింద 16.74లక్షల ఎకరాలు లక్ష్యంగా పెట్టుకుని ఇంతవరకూ సాగులోకి తేలేదు. 2024-25 సంవత్సరానికి 8 ప్రాజెక్టుల కింది 12.44లక్షల ఎకరాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తంగా రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం పాలమూరు ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులను సంతృప్తి పర్చడానికి నార్లాపూర్, ఏదుల, కరివెన, ఉదండాపూర్ ప్రాజెక్టులలోకి ఆగస్టు 23 నాటికి నీటిని పంప్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే గౌరవెల్లి ప్రాజెక్టు కింద కాలువలు పూర్తిచేయాలని కూడా ఆదేశించారు. కానీ 2022 ఆగస్టు మొదటివారంలో కాళేశ్వరానికి చెందిన కన్నెపల్లి పంప్‌హౌజ్ వద్ద 17పంపులు నీటిలో మునిగాయి. రక్షణ కవచంగా ఏర్పాటు చేసిన గోడ కూలిపోవడంతో ఈ బాహుబలి పంపులు నీటమునిగాయి. ఇంతవరకూ రెండు పంపులు మాత్రమే మరమ్మతులు చేశారు. మొదట రూ.20కోట్లతో రిపేరు చేస్తామన్న చీఫ్ ఇంజనీర్ తర్వాత రూ.1,650కోట్లు కావాలని ఎస్టిమేషన్ వేశారు. ఇప్పటికీ రిపేర్లు కొనసాగుతూనే ఉన్నాయి. గత మూడు సంవత్సరాల క్రితం కల్వకుర్తి ఎత్తిపోతలకు చెందిన ఎనిమిది పంపులు నీటిలో మునిగిపోయాయి. అందులో నాలుగు పంపులు మాత్రమే రిపేరు చేశారు. తెలంగాణలో సాగునీటి పథకాలన్నీ లిఫ్టు పథకాలే. వీటికి 13,250 మెగావాట్ల విద్యుత్తు కావాలి. ఏటా ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీల కింద రూ.35వేల కోట్లు (యూనిట్‌కు రూ.6.30పైసలు) వ్యయం చేస్తున్నది. ప్రస్తుతానికి కాళేశ్వరానికి 4627మె.వా., పాలమూరు ఎత్తిపోతలకు 2944మె.వా వినియోగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ అంచనాలు పెరిగే అవకాశం కూడా ఉంది. నిపుణుల సలహా ప్రకారం లిఫ్టు పథకాలు 25 సంవత్సరాలు పనిచేస్తాయి. ఆ తర్వాత మరల వీటిని పునః నిర్మించాల్సి ఉంటుంది. లిఫ్టు పథకాల ద్వారా సాగు వ్యయం బాగా పెరుగుతుందని వ్యాఖ్యానాలు చేస్తున్నారు. లిఫ్టు పథకాల ద్వారా సాగునీటికే కాక తాగునీరు, భూగర్భజలాల వృద్ధి, చెట్లుచేమలు, గాలిలో తేమ, చేపలు, పరిశ్రమలు, ప్రజారోగ్యం పెరుగుదలతో పాటు పర్యావరణంలో మార్పులు వస్తాయి. ఈ ప్రయోజనాలన్నింటినీ గణించకుండా ఒక్క సాగునీటినే అంచనావేయడం సరైంది కాదు. కేంద్ర ప్రభుత్వం గోదావరి-కావేరి నదుల అనుసంధానం చేయాలని ప్రతిపాదించింది. గోదావరి నదిపై ఉన్న తుపాకులగూడెం ప్రాజెక్టు (సమ్మక్క బ్యారేజి) నుండి కృష్ణా నదికి మళ్ళించి, అక్కడినుండి పెన్నాకు, కావేరికి నీటిని పంప్ చేయాలని తెలంగాణ ప్రభుత్వంతో చర్చించింది. అందుకు తెలంగాణ ప్రభుత్వం కూడా సమ్మతించింది. అదే సందర్భంలో దశాబ్దాల క్రితం చేపట్టి అమలు జరుగుతున్న ప్రాజెక్టులను నిర్ణీత సమయంలో పూర్తిచేసే విధంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించాలి. నిధుల దుబారా జరగకుండా, కాలయాపన ద్వారా ప్రాజెక్టుల ఎస్టిమేషన్ పెరగకుండా ప్రభుత్వం సత్వరమే ప్రాజెక్టులను పూర్తిచేయాలి. ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలి. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత మూడు సంవత్సరాల వరకు కాంట్రాక్టరు బాధ్యతగా నిబంధనలు రూపొందించాలి. అప్పుడే తెలంగాణలో సాగునీటి, తాగునీటి సమస్యతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడే వీలుంటుంది.



రాష్ట్రంలో సాగునీటి అభివృద్ధి వివరాలు (లక్షల ఎకరాలలో)

సంవత్సరం	నీటివసతి కల్పించినది	స్థిరీకరణ
1956 వరకు	16.03	-
1956-2004	36.13	-
2004-2014	5.71	0.93
2014-2022	17.23	30.57
మొత్తం	75.10	31.50

అశాస్త్రీయ దృక్పథం!



గతేడాది 300కి పైగా సైన్స్ అవార్డులను రద్దు చేసిన కేంద్రం తాజాగా మరో తొంభై రెండింటిని రద్దు చేయడం శాస్త్ర విజ్ఞానం పైన, శాస్త్రీయ దృక్పథం పట్ల కమలనాథుల కక్షకు తార్కాణం. సైన్స్, హెల్త్ రంగాల్లో అవార్డులను నిలిపేయాలని శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడెమీ ఈ అవార్డులను నిలిపేసినట్టు ప్రకటించింది. యువ శాస్త్రవేత్తలు, సైన్స్ టీచర్లు, అంతర్జాతీయ హోదా కలిగిన శాస్త్రవేత్తలకు ఇవ్వడానికి ఉద్దేశించిన 72అవార్డులను రద్దు చేసింది. నేషనల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా కూడా 20కి పైగా అవార్డులను కూడా పక్కకు పెట్టింది. శాస్త్రవేత్తల కోసం శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన అవార్డులను అర్థంతరంగా హఠాత్తుగా రద్దు చేయడాన్ని బుద్ధిజీవులు విమర్శించడం సహజం. ఇది మన శాస్త్రీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని లాక్కునేందుకు చేపట్టిన ప్రక్రియని కొందరు ఆగ్రహిస్తున్నారు. ప్రభుత్వ నిధులు పొందుతున్న సంస్థ ఎవరికి ఎప్పుడు అవార్డులు ఇవ్వాలనేది ప్రభుత్వమే నిర్ణయించాలన్నది ఇందులోని ఆంతర్యమని ఓ శాస్త్రవేత్త వ్యాఖ్యానించారు. స్వయంప్రతిపత్తి సంస్థలుగా పేర్కొనబడే ఆయా సంస్థలను పూర్తిగా సర్కారు పెత్తనంలో నడపడానికేనని అంటున్నారు. యువ శాస్త్రవేత్తలకు, సైన్స్ టీచర్లకు అవార్డులు రద్దు చేయడాన్ని కేవలం వారి కెరీర్‌లోని అవకాశాలను గుంజుకోవడంగా కాకుండా వారిలో శాస్త్ర విజ్ఞానం పట్ల గల తృష్ణను చంపేయాలన్న దుర్బుద్ధితో సర్కారు చేసిందని భావించాల్సి ఉంటుంది.

శాస్త్రీయ దృక్పథాన్ని (సైంటిఫిక్ టెంపర్) అభివృద్ధి చేయడం భారత పౌరుల ప్రాథమిక బాధ్యతగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఎ(హెచ్) పేర్కొంది. అందుకు భారతీయ పౌరులందరూ శాస్త్రీయ దృక్పథాన్ని కలిగుండాలి, అలా ఉండేలా ప్రోత్సహించాలి. కానీ సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వమే అందుకు విరుద్ధంగా వ్యవహరించడం దారుణం. రాజ్యాంగంలో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రాథమిక బాధ్యతగా పేర్కొన్నది యావత్ ప్రపంచంలో ఒక్క భారతదేశమే! జవహర్‌లాల్ నెహ్రూ తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించవలసిన ఆవశ్యకత గురించి వివరించారు. అది జాతీయోద్యమ భావన. స్వతంత్ర భారత ప్రభుత్వం ఏర్పడ్డాక శాస్త్ర విజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు, ప్రోత్సహించేందుకూ ఎన్నో ప్రతిష్టాత్మక సంస్థలను స్థాపించారు. సిఎస్ఐఆర్, ఎన్‌సిఎస్‌టిసి వంటివి ఎన్నో వచ్చాయి. సమకాలీన ప్రపంచంలో సైతం మన శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు, డాక్టర్లు అగ్రభాగాన ఉన్నారంటే అటువంటి అవగాహనతో ఎంతో ముందు చూపుతో స్థాపించిన వివిధ ఐఐటిలు, ఐసిఎంఆర్, ఎయిమ్స్ వంటివీ కారణం.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, హేతువాద దృష్టి, ప్రశ్నించేతత్వం పెరిగితే ఛాందస భావాలు, మూఢ విశ్వాసాలు వంటివాటికి ఎదురుదెబ్బ తగులుతుంది. మత ప్రాతిపదికన ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడమే లక్ష్యంగా గల సంఘపరివార్ శక్తులకు శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధత శత్రువుల వంటివే. అందుకే ప్రముఖ హేతువాదులైన ధబోల్కర్, గౌరీ లంకేష్, పన్సారే లాంటివారిని హత్య గావించారు. భౌతికంగా వారిని మట్టుబెట్టినా, అనేకమందిని బెదిరించినా హేతువును అడ్డుకోవడం సాధ్యం కావడం లేదు. అందుకే ఆ కుదురు నుండే వచ్చిన ప్రభుత్వ పెద్దలు ఈ వ్యవస్థలో భాగంగా ఉన్న శాస్త్రీయ దృక్పథానికి తూట్లు పొడవాలని ఇటువంటి కుయత్నాలు చేస్తున్నారు. ఇటువంటి కుట్రలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలూ, ప్రగతి కాముకులు ఒక్కటై ఎదిరించాలి. భారత దేశ చరిత్ర, భారతీయ తాత్వశాస్త్రంలో చార్వాకులు, సాంఖ్యులు వంటివారి పాత్ర ఎంతో గొప్పది. వారి వారసత్వంగా సైన్సును, శాస్త్రీయ దృక్పథాన్ని నిలబెట్టడానికి, మరింతగా ప్రోత్సహించడానికీ భారతీయులందరమూ కృషి చేయాలి. ఛాందసత్వానికి, మౌఢ్యానికీ పెద్దపీట వేస్తున్న మోడీ సర్కారు విధానాల్ని తిప్పికొట్టాలి.

-ఫీచర్స్ అండ్ పాలిటిక్స్



చినుకుల దండ

చిటపట చినుకులు
కలసికట్టుగా కురుస్తున్నాయి
చూరులోంచి రాలుతున్న నీటి పువ్వులు
గోడ వారగా జారి వాడ దారి పడుతున్నాయి

ఉసిళ్లు ఉప్పెనలా గుడ్డి లాంతరు చుట్టూ
గుమిగూడి గిరికీలు కొడుతున్నాయి
కప్పల బెకబెకలతో కీచురాళ్లు గొంతు కలిపి
రాతిరంతా చేసిన సంగీత జాతర


భూమి పొరల్ని చీల్చుకుంటూ
గుమ్మడి గింజ పురుడు పోసుకుంటోంది
తొలకరికి తొంగి చూసే ఆరుద్ర పురుగు
ఎర్రని ముద్దమందారం లా
పచ్చిక మీద పారాడుతోంది

ఇంటి ముందు రాతి గుండు
ధ్యానాన్ని భగ్నంచేసే చినుకుల చిలిపి ప్రయత్నం
దండెం మీద ముత్యాల చినుకుల
సత్యాన్వేషణ

ఎదురు చూపుల
నాన్నమెడలో వాన చినుకుల దండ
వంటిల్లు చల్ల బడింది
వాన అంటే అందుకే
నాకు వల్లమాలిన ప్రేమ

- రెబ్బారం రాంబాబు

దేశం గొంతెత్తాలి...



సిహెచ్. కృష్ణారావు
9490098586

హింసాకాండతో మండుతున్న మణిపూర్ నుండి పది పార్టీలకు చెందిన ప్రతినిధులు ఢిల్లీకి వచ్చారు. రెండు వర్గాల ఘర్షణ వల్ల రాష్ట్రంలో ఇప్పటికే 150మందికి పైగా చనిపోయారని సామాజిక సంస్థలు విశ్లేషిస్తున్నాయి. ఆరవై వేల మందిపైగా నిరాశ్రయులయ్యారని ప్రసార సాధనాలు ఘోషిస్తున్నాయి. ఢిల్లీకి వచ్చిన మణిపూర్ ప్రతినిధులు జూన్ పదో తేదీ నుండి ప్రధాని అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు కాశారు. వారిని కలవటానికి ప్రధాని సమయం ఇవ్వలేదు. ఆదిపురుష్ చిత్రం డైలాగ్ రైటర్‌కు మాత్రం 45నిమిషాలు సమయమిచ్చి ముచ్చటించారు. అంతేకాదు రైలు ప్రమాదంలో అనేకమంది ప్రాణాలు కోల్పోయిన 'బాలాసోర్'ను ప్రధాని సందర్శించారు. అందుకు అభినందించాలి. కానీ ఎంతోమంది ప్రాణాలు కోల్పోయి, నిరాశ్రయులుగా మారుతూ, నేటికీ హింసాకాండ కొనసాగుతున్న మణిపూర్‌కు ఎందుకు పోవటం లేదు. అక్కడికెళ్తే సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది గనుక. ఇది అక్షరాల నిజం. అందుకే మౌనాసనంతో, యోగా విన్యాసాల కోసం యూఎస్‌ఒకు, అంతర్జాతీయ మద్దతు కూడగట్టేందుకు యూఎస్ఏకు మందీ మార్బలంతో ప్రధాని దేశం విడిచి వెళ్ళారు. మణిపూర్‌లో మెయిటీలు, కుకీలు తదితర జాతుల మధ్య అపనమ్మకాలతో చిచ్చురేగి యాభై రోజులు దాటింది. మారణకాండ సాగుతున్న సమయంలో ప్రధాని కర్నాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో, రోడ్‌షోలలో వారం రోజుల పాటు అక్కడే గడిపారు. హింస ప్రారంభంలోనే ప్రధాని నిబద్ధత, ధృడసంకల్పంతో తగిన చర్యలు తీసుకుంటే 24గంటల్లోనే మారణకాండ ఆగిపోయేదని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాటి నుండి నేటి వరకు రాష్ట్రంలో శాంతికోసం ఒక్కమారైనా ప్రధాని నోరు విప్పలేదు. కనీసం మన్‌కీ బాత్‌లోనైనా ప్రవచిస్తారేమోనని ఎదురు చూసిన వారికి ఆశాభంగమే కలిగింది. కేంద్రం లోనూ, ఆ రాష్ట్రంలోనూ ఉన్నవి ఒకే పార్టీ ప్రభుత్వాలు. కాషాయ నేతల భాషలో చెప్పాలంటే డబుల్ ఇంజన్ సర్కార్. మణిపూర్ నుండి బీజేపీకే చెందిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలకు నమ్మకం పోయిందని ప్రధానికే మెమోరాండం అందజేసినట్టు పత్రికల్లో చూశాం.

మణిపూర్‌లో చిచ్చుకు కారణం కాషాయనేతలేనన్నది బహిర్గతమవటంతో దేశం విస్తుపోయింది. బీజేపీయే కదా అధికారంలో ఉన్నది వారెందుకు బాధ్యుల వుతారన్న కౌంటర్ వాదనలు వినిపించాయి. నిజమేననిపిస్తుంది. మణిపూర్ రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న 'మెయిటీ' జాతి ప్రజలకు ఎస్‌టీ రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తే ఆ రాష్ట్రంలో అధికారం శాశ్వతం చేసుకోవచ్చన్న 'దురాలోచన'తో పావులు కదిపారు. శతాబ్దాలుగా అక్కడి ప్రజల మధ్య నెలకొన్న ఐక్యత, సామరస్యతలతో చెలగాటమాడారన్న విషయం దేశంలో, మీడియా, వీడియోలు బట్టబయలు చేశాయి. ప్రార్థనా మందిరాలపై దాడులలో ఆర్‌ఎస్ఎస్ హస్తమంటూ పత్రికలలో కథనాలు చూశాం. విభజనవాదానికి హద్దులేముంటాయి? సాధనే దానికి సరిహద్దు. మణిపూర్‌లో శాంతికోసం మాట్లాడటమంటే విభజన వాదాన్ని వ్యతిరేకించటమే అవుతుంది. ఆర్ఎస్ఎస్ ప్రచారకర్తగా చెప్పుకునే ప్రధాని అందుకే నోరువిప్పటం లేదన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. దేశ సంస్కృతి భిన్నత్వంలో ఏకత్వంగా విలసిల్లుతూ దేశాన్ని భావ సమైఖ్యతతో భారతీయులను ఐక్యంగా ఉంచగలుగు తున్నది. రాజకీయపార్టీలు తమ పాలనతో మెజారిటీ ప్రజలకు దగ్గరవటం, తమ విధానాలకు, పాలనా సామర్థ్యానికి గీటురాయిగా భావిస్తారు. కానీ విభజన వాదులు అధికారానికై ఎన్నుకున్న మార్గం దేశానికి, ప్రజలకు అత్యంత ప్రమాదకరమైంది. కులం, మతం, ప్రాంతం, భాషలలో మెజారిటీగా ఉన్న ప్రజలను భావోద్రే కాలకు గురిచేసి అధికారానికై ఎగబాకాలనుకోవటం అమానవీయమే కాదు అత్యంత హేయం. వాస్తవాలతో సంబంధం లేకుండా ఎవరో కొందరు మూర్ఖులనో, మూఢాచారాలో సాకుగా, బూచిగా చూపి ఏదో ప్రమాదం ముంచుకొస్తున్నట్లుగా మెజారిటీ ప్రజానీకాన్ని రెచ్చగొట్టే ధోరణి అత్యంత గర్హనీయం. ఈ విధానాలకు నిరసన తెలిపే వారిపై తమ అధికార దండం ఆయుధాలుగా ఈడీ, సీబీఐ, ఐటీల ద్వారా దాడులకు ప్పాలడుతున్నారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న తలసీచందు, ప్రొఫెసర్ నాగేశ్వర్, దేవి వంటివారిని ట్రోల్‌చేస్తూ చంపుతామని బెదిరిస్తున్నారు.





ప్రజలు భావోద్వేగాలకు గురయ్యే నాటకీయ పరిణామాలను ఎన్నికల సమయంలో చూశాం. ప్రత్యామ్నాయ విధానాలతో బలమైన రాజకీయ పక్షాలు ఐక్యంగా ప్రజల ముందు కనిపించకపోవటం వలన రెండవసారి కూడా ఈ విభజనవాదులు కేంద్రంలో అధికారానికి రాగలిగారన్నది వాస్తవం. ప్రపంచంలో రెండవ పెద్ద దేశంగా, ప్రజాస్వామ్య మూలాలున్న భారత్‌లో మనువాద ప్రచారకులు అధికారంలో కొనసాగటం చూస్తున్నాం. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థకు జీవనాడిగా ఉన్న రాజ్యాంగంపైనే దాడి చేస్తున్నారు. కేంద్ర మంత్రులు, పాలకపార్టీ ప్రతినిధులు మన రాజ్యాంగం పనికిమాలినదంటూ, నాటి ప్రాచీన మనుధర్మ శాస్త్రమే నేటి రాజ్యాంగానికి ప్రత్యామ్నాయమని ప్రచారం చేస్తున్నారు. అయినా రాజ్యాంగ పరిరక్ష కుడిగా ప్రధాని నోరు విప్పరు, వారిని నివారించరు. ప్రజల పక్షాన మాట్లాడకుండా, విభజన వాద భావజాలం ప్రతినిధులుగా మరల అధికారానికై, కుటిలమైన ఎత్తుగడలతో వ్యవహరించటమే ఆశ్చర్యం కలిగిస్తుంది. దేశానికి పతకాలు తెచ్చిన రెజ్లర్లతో ఫొటోలు దిగి, తేనేటి విందులిచ్చారు ప్రధాని మోడీ. అందులోని మహిళా రెజ్లర్లే 'లైంగిక వేధింపులకు గురవుతున్నాము, చర్యలు తీసుకోండి' అని అభ్యర్థిస్తూ రోడ్లపైకి వచ్చినా నాలుగు మాసాల నుండి ప్రధాని మోడీ నోరువిప్పటం లేదు. రెజ్లర్ల, మణిపూర్ ప్రజల వేదన మానవ మృగాల మధ్య అరణ్య రోదనగా మారిపోయింది.ప్రజల సమస్యలు, బాధలు, వేదనల పట్ల గుడ్డిగా, చెవిటిగా, మూగవారిగా వ్యవహరించటమే కనిపిస్తున్నది. శుద్ధులతో 'మంకీబాత్'లు, ఉద్వేగాలతో భాషణలు, ఎన్నికల్లో భ్రమలు గొల్పే వాగ్దానాలతో విశ్వరూపం ప్రదర్శిస్తారు. తొమ్మిది సంవత్సరాలుగా ఇదే తంతును చూస్తూనే ఉన్నాం. నాడు అక్షరాస్యులుగా ఆధిపత్య స్థానాల్లో ఉన్న కొద్దిమంది, మనుధర్మశాస్త్ర సూత్రాలతో నిరక్షరాస్యులుగా మెజారిటీ ప్రజలను మానసికంగా బానిసల్ని చేసిన తీరు చరిత్రలో చూశాం. అక్షరాస్యులుగా ఉన్న మెజారిటీ ప్రజలను నేడు మెజారిటీ, మైనారిటీలుగా చీల్చే భావజాల ప్రచారంతో అధికారంలో కొనసాగటం ప్రస్తుతం చూస్తున్నాం. ప్రజాసమస్యలపై మోడీ నోరువిప్పటం భ్రమేనన్నది స్పష్టం. ప్రధానిగా ప్రజల సమస్యలపై స్పందించకుండా పార్టీ, కార్పొరేట్ ప్రచారకగా ఏకపక్ష ధోరణితో వ్యవహరించేవారిని ఎంతకాలం భరిస్తాం! కనుక ఇప్పుడు నోరు విప్పాల్సింది జనం. లేదంటే అధికార కాంక్షతో మనుషుల మధ్య విభజన సృష్టిస్తున్న మనువాద చక్రాల కింద నలిగిపోతాం!

నాడు అక్షరాస్యులుగా ఆధిపత్య స్థానాల్లో ఉన్న కొద్దిమంది, మనుధర్మశాస్త్ర సూత్రాలతో నిరక్షరాస్యులుగా మెజారిటీ ప్రజలను మానసికంగా బానిసల్ని చేసిన తీరు చరిత్రలో చూశాం. అక్షరాస్యులుగా ఉన్న మెజారిటీ ప్రజలను నేడు మెజారిటీ, మైనారిటీలుగా చీల్చే భావజాల ప్రచారంతో అధికారంలో కొనసాగటం ప్రస్తుతం చూస్తున్నాం. ప్రజాసమస్యలపై మోడీ నోరువిప్పటం భ్రమేనన్నది స్పష్టం. ప్రధానిగా ప్రజల సమస్యలపై స్పందించకుండా పార్టీ, కార్పొరేట్ ప్రచారకగా ఏకపక్ష ధోరణితో వ్యవహరించేవారిని ఎంతకాలం భరిస్తాం! కనుక ఇప్పుడు నోరు విప్పాల్సింది జనం. లేదంటే అధికార కాంక్షతో మనుషుల మధ్య విభజన సృష్టిస్తున్న మనువాద చక్రాల కింద నలిగిపోతాం!

మష్రూమ్స్‌తో మజా మజా..



పుట్టగొడుగులను వివిధ రకాల వంటకాల్లో విస్తృతంగా ఉపయోగిస్తారు. సూప్, సలాడ్లలలో కూడా వాడతారు. గుడ్లతో సమానంగా వీటిలో పోషకాలు ఉంటాయి. శాండ్‌విచ్‌లలో ఇతర కూరగాయలతో పాటు వీటిని ఉపయోగిస్తారు. పిజ్జాలలోనూ వీటి వినియోగం ఉంటుంది. పుట్టగొడుగుల్లో అధిక పోషక విలువలు ఉన్నాయి. ఇవి 92 శాతం నీటిని కలిగి ఉంటాయి. అందువల్ల వీటిని కూరల్లో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. వీటితో చేసే కొన్ని రకాల వంటలు ఈ వారం మీ కోసం...

మసాలా కర్రీ



కావాల్సిన పదార్థాలు : పుట్టగొడుగులు : 200గ్రా॥, ఉల్లిగడ్డలు - రెండు, పచ్చిమిర్చి - ఆరు, టమాటాలు - రెండు, లవంగాలు - నాలుగు, దాల్చినచెక్క - అంగుళం ముక్క, కారం - చెంచా, జీలకర్రపొడి - చెంచా, ఉప్పు - సరిపడా, పసుపు - అర చెంచా, వెల్లుల్లి ముద్ద - చెంచా, నూనె - కప్పు, చిన్న మెంతి ఆకులు - చెంచా

తయారుచేసే విధానం : బాణలిలో నూనె వేసి లవంగాలు, దాల్చిన చెక్క వేసి వేయించాలి. ఉల్లిగడ్డ ముక్కలు కూడా వేసి వేగాక వెల్లుల్లి ముద్ద, కారం, జీలకర్రపొడి, పసుపు, ఉప్పు వేసి కలపాలి. కొద్దిగా నీళ్ల చిలకరించి వేయించాలి. మసాలా వేగి నూనె తేలాక టమాటా ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. పుట్టగొడుగుల ముక్కలు వేసి సన్ననిమంట మీద మరో పది నిమిషాలు ఉడికించాలి. చివరగా మెంతి ఆకులు వేసి కొద్దిసేపు కలిపి దించాలి.


బఠాణీతో..



కావాల్సిన పదార్థాలు : పచ్చి బఠాణీలు - ఒకటిన్నర కప్పులు, పుట్టగొడుగులు - 200గ్రా॥, ఉల్లిగడ్డలు - రెండు, టమాటాలు - నాలుగు, కారం - చెంచా, దనియాలపొడి - చెంచా, పసుపు - చెంచా, గరం మసాలా - చెంచా, జీడిపప్పు ముద్ద - అరకప్పు, యాలకులు - నాలుగు, దాల్చినచెక్క - అంగుళం ముక్క, అల్లం వెల్లుల్లి పేస్టు - రెండు చెంచాలు, నూనె : నాలుగు చెంచాలు, ఉప్పు: రుచికి సరిపడా

తయారుచేసే విధానం : పుట్టగొడుగుల్ని కడిగి ముక్కలుగా కట్ చేసుకుని పక్కన ఉంచుకోవాలి. బాణలిలో నూనె వేసి యాలకులు, దాల్చినచెక్క, ఉల్లి గడ్డ ముక్కలు వేసి వేయించాలి. తర్వాత అల్లంవెల్లుల్లి పేస్టు వేసి ఓ నిమిషం వేయించాలి. టమాటో ముక్కలు కూడా వేసి ఉడికించాలి. తర్వాత కారం, దనియాలపొడి, పసుపు, గర మసాలా, ఉప్పు వేసి ఓ రెండు నిమిషాలు ఉడికించాలి. జీడిపప్పు ముద్దని ఓ కప్పు నీళ్లలో కలిపి బాణలిలో పోయాలి. తర్వాత మరో కప్పు నీళ్లు పోసి మరిగించాలి. ఇందులో బఠాణీలు, పుట్టగొడుగులు వేసి, ఉడికిన తర్వాత దించాలి.

చిల్లీ



కావాల్సిన పదార్థాలు : బటన్ మష్రూమ్స్ - 200గ్రా॥, క్యాప్సికమ్ - రెండు, ఉల్లిగడ్డ - ఒకటి, అల్లం - అంగుళం ముక్క, వెల్లుల్లి - ఆరు రెబ్బలు, నూనె - రెండు చెంచాలు, కారం - చెంచా, సోయాసాస్ - రెండు చెంచాలు, కార్న్ ఫ్లోర్ - చెంచా, వెనిగర్ - చెంచా, నీళ్లు - కప్పు, ఉప్పు - రుచికి సరిపడా

తయారుచేసే విధానం : పుట్టగొడుగుల్ని రెండు ముక్కలుగా, క్యాప్సికమ్ లోపలి గింజలు తీసేసి ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. ఉల్లిగడ్డ ముక్కలు, అల్లం, వెల్లుల్లి కలిపి మెత్తని ముద్దలా మిక్సీ పట్టుకోవాలి. తర్వాత కళాయిలో నాలుగు చెంచాల నూనె వేసి ఉల్లిముద్ద వేసి బాగా వేయించాలి. తర్వాత కారం వేసి కలిపి, అరకప్పు నీళ్లకూడా పోసి సిమ్‌లో పెట్టి ఉడికించాలి. ఇప్పుడు క్యాప్సికమ్ ముక్కలు, పుట్టగొడుగు ముక్కలు, ఉప్పు వేసి కలిపి మూత పెట్టి తక్కువ మంట మీద ముక్కలు ఉడికే వరకూ ఉంచాలి. తర్వాత సోయాసాస్, వెనిగర్ వేసి కలపాలి. ఒక గిన్నెలోమ కొన్ని నీళ్ళు తీసుకుని అందులో కార్న్ ఫ్లోర్ వేసి కలిపి ఉంచాలి. ఈ మిశ్రమాన్ని కూరలో వేసి మరో రెండు నిమిషాలు ఉడికించి దించాలి.

ఆంధ్రా స్టైల్



కావాల్సిన పదార్థాలు : పుట్టగొడుగులు - పావుకిలో, ఉల్లి గడ్డ - మూడు, పచ్చిమిర్చి - మూడు, కారం - చెంచా, పసుపు - పావు చెంచా, కొత్తిమీర - కట్ట, నూనె - వేయించడానికి సరిపడా, ఉప్పు - తగినంత, అల్లం - అంగుళం ముక్క, వెల్లుల్లి - రెండు రెబ్బలు, జీలకర్ర - చెంచా, గసగసాలు - చెంచా, దనియాలు - చెంచా

తయారుచేసే విధానం : పుట్టగొడుగుల్ని కడిగి ముక్కలుగా కోయాలి. ఉల్లిగడ్డలు, పచ్చిమిర్చి సన్నగా పొడవుగా తరిగి ఉంచుకోవాలి. అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, గసగసాలు, దనియాల దినుసులన్నీ మెత్తని పేస్టులా మిక్సీ పట్టుకోవాలి. బాణలిలో నూనె వేసి ఉల్లి గడ్డ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. తర్వాత కారం, పుట్టగొడుగులు ముక్కలు, పసుపు, ఉప్పు వేసి ఐదు నిమిషాలు వేయించాలి. ఇందులో కప్పు నీళ్లు పోసి మధ్యస్తంగా ఉండే మంటమీద రెండు నిమిషాలు ఉడికించాలి. ముక్కలు బాగా ఉడికిన తర్వాత మసాలా ముద్ద వేసి మరో ఐదు నిమిషాలు ఉడికించి దించి కొత్తిమీర చల్లితే సరి.

రోజు తీసుకునే ఆహారంలో పుట్టగొడుగులను చేర్చడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో పొటాషియం, ప్రోటీన్, రాగి, సెలీనియం, భాస్వరం, యాంటీఆక్సిడెంట్లు, ఫైటోకెమికల్స్, విటమిన్లు సి, బి, డి వంటి అనేక పోషకాలు ఉన్నాయి. ఇవి మన శరీరాన్ని అనేక వ్యాధుల నుండి, ఇన్ఫెక్షన్ల నుండి కాపాడతాయి. వీటిలోని కాల్షియం ఎముకలను బలంగా చేస్తాయి. అంతేకాదు వీటిలో క్యాలరీలు తక్కువ. ఆకలిని తగ్గిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారు వీటిని రెగ్యులర్‌గా తీసుకోవడం మంచిది. పుట్టగొడుగులలో విటమిన్ డి పుష్కలంగా లభిస్తుంది.

రాజ్మాతో..



కావాల్సిన పదార్థాలు : రాజ్మా- కప్పు, మష్రూమ్స్ - 200 గ్రా॥, ఉల్లిగడ్డ - ఒకటి, టమాటాలు- రెండు, పచ్చిమిర్చి- రెండు, అల్లం వెల్లుల్లి ముద్ద- చెంచా, ఉప్పు, కారం- రుచికి తగినంత, పసుపు- చిటికెడు, దనియాల పొడి - అర చెంచా, గరం మసాలా - అర చెంచా, ఆమ్‌చూర్ పొడి - అర చెంచా, జీడిపప్పులు- ఆరు, పంచదార - చెంచా, జీలకర్ర- చెంచా, కొత్తిమీర- కొద్దిగా, నెయ్యి- అర చెంచా.

తయారుచేసే విధానం : రాజ్మా గింజల్ని ముందు రోజు రాత్రి నానబెట్టి మర్నాడు నీళ్ల ఒంపేసి కుక్కర్‌లో మూడు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. తర్వాత టమాటాలు, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి తరిగి పెట్టుకోవాలి. బాణలిలో అరచెంచా నెయ్యి వేసి కరిగించి ఉల్లిగడ్డ ముక్కలు వేయించాలి. వేగాక అల్లం వెల్లుల్లి ముద్ద వేసి పచ్చి వాసన పోయాక దించి, కాస్త చల్లారాక అందులో టమాటా, జీడిపప్పు, ఉప్పు, కారం మిక్సీ జార్‌లో వేసి మెత్తగా చేసుకోవాలి. తర్వాత మరో కడాయిలో అరచెంచా నెయ్యి వేసి కరిగాక జీలకర్ర, మష్రూమ్స్, పచ్చిమిర్చి వేసి వేయించాలి. మష్రూమ్స్ మగ్గిన తర్వాత ఉల్లిగడ్డ మిశ్రమం వేసి కలపాలి. తర్వాత ఉడికించిన రాజ్మా, అరకప్పు నీళ్ల పోసి మూత పెట్టాలి. గ్రేవీలా ఉడికిన తర్వాత కొత్తిమీర వేసి కలిపి దించేస్తే సరిపోతుంది.

కుర్మా



కావాల్సిన పదార్థాలు : మష్రూమ్స్- రెండు కప్పులు, ఉల్లిగడ్డలు- రెండు, టమాటాలు- రెండు, అల్లం వెల్లుల్లి ముద్ద- చెంచా, కారం- రెండు చెంచాలు, మిరియాల పొడి- చెంచా, కొబ్బరిపాలు- అరకప్పు, పచ్చిమిర్చి- రెండు, ఉప్పు - తగినంత, కొత్తిమీర తురుము - కొద్దిగా, నూనె - వేయించడానికి సరిపడా.

తయారుచేసే విధానం : మష్రూమ్‌లను చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఉల్లిగడ్డ, టమాటాలను కూడా ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. టమాటా ముక్కలు, సగం ఉల్లిగడ్డ ముక్కలు, మిక్సీలో వేసి మెత్తని పేస్టులా పట్టి పెట్టుకోవాలి. ఇప్పుడు కళాయిలో నూనె పోసి వేడయ్యాక మిగిలిన ఉల్లిగడ్డ ముక్కలు వేసి వేయించాలి. అందులో అల్లం వెల్లులి ముద్ద, కారం, టమాటా ముద్ద వేయాలి. తర్వాత మష్రూమ్ ముక్కలు కూడా వేసి బాగా కలియబెట్టాలి. కొద్దిసేపటి తర్వాత అందులో కొబ్బరిపాలు, పొడవుగా చీల్చిన పచ్చిమిర్చి, ఉప్పు వేసి కలిపి మూతపెట్టాలి. ఈ మిశ్రమం మొత్తం గ్రేవీగా తయారవుతుంది. ఇందులో కొత్తిమీర చల్లి ఒక నిమిషం కలిపి దించేస్తే సరిపోతుంది. వేడివేడి మష్రూమ్ కుర్మాను పలావు, రోటీలతో కలిపి తీసుకుంటే చాలా బాగుంటుంది.

ఆ వయసు దాటాకే...

ప్రస్తుతం మొబైల్ ఫోన్ అంటే తెలియని పిల్లలు లేరు. రెండేండ్లు కూడా నిండని పిల్లలు ఫోన్‌లకు అలవాటు పడిపోతున్నారు. ఇది వారి మానసిక, శారీరక ఆరోగ్య పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ మధ్య కాలంలో పిల్లలు, ముఖ్యంగా యువత ఇంటర్నెట్, సోషల్ మీడియాకు బానిసలుగా మారి అర్థ రాత్రివరకూ ఫోన్లను ఉపయోగించడం అధికమైందని, దీని వల్ల జ్ఞాపకశక్తి తగ్గడం, చిరాకు, అసహనం అధికం కావడం, శారీరక శ్రమకు దూరం కావడంతో పలు రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు, యువకులు రోజుకు కనీసం ఎనిమిది గంటల పాటు నిద్రపోయే విధంగా తల్లిదండ్రులు చర్యలు చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. కొంతమంది పిల్లలు అదే పనిగా ఫోన్ పట్టుకుని ఉండటం వల్ల నరాల సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని సర్వేల్లో వెల్లడయింది. కాబట్టి మొబైల్ ఫోన్, టాబ్, లాప్‌టాప్‌ల ఉపయోగాన్ని పరిమిత సమయంలోనే వినియోగించేలా చూడాలని సూచించారు. సోషల్ మీడియాపై మన నియంత్రణ ఉండాలి కానీ అవే మనల్ని నియంత్రించే స్థాయిలో ఉండకూడదని వారు హెచ్చరిస్తున్నారు. ఎవరైనా రోజుకు నాలుగు గంటల కన్నా అధికంగా ఇంటర్నెట్ ఉపయోగిస్తే అది వ్యసనం కిందకి వస్తుందని తెలిపారు. విద్యాపరమైన అవసరాలకే ఇంటర్నెట్ వినియోగం ఉత్తమమని, అపరిమితంగా ఉపయోగిస్తే కలిగే అనర్థాలను పిల్లలకు అర్థమయ్యేట్టు చెప్పాలంటున్నారు. ఇంట్లోనే సంగీత సాధన, వ్యాయామం లాంటివి అలవాటు చేసి, సెల్‌ఫోన్‌లకు పిల్లలను సాధ్యమయినంత దూరం చేయాలని సూచిస్తున్నారు.



పెసలతో కాంతివంతంగా...

పెసలు మన ఆరోగ్యానికి ఎంత మంచివో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందుకే ఈ రోజుల్లో వాటిని మొలకల రూపంలో తినడం అలవాటు చేసుకున్నారు. ఆహారంగానే కాదు, చర్మానికి కూడా వీటితో ఎన్నో ప్రయోజనాలున్నాయి. చర్మం మృదువుగా, కోమలంగా, కాంతివంతంగా మారాలంటే పెసలతో ఫేస్‌ప్యాక్ చేసి ఉపయోగించుకోవచ్చు. అది ఎలా చేసుకోవాలో తెలుసుకుందాం..!



- రెండు చెంచాల పెసలను రాత్రంతా నీటిలో నానబెట్టాలి. ఉదయం ఆ పెసలను పేస్టులా చెసి, అందులో చెంచా బాదం నూనె, చెంచా తేనె వేసి కలపాలి. ఈ పేస్టును ముఖానికి రాసుకొని 15 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత నీటితో కడిగేసుకుంటే కోమలమైన చర్మం మీ సొంతం.
- పెసలును గ్రైండ్ చేసి... పొడి చేసుకుని ఉంచుకోవాలి. చెంచా పిండి, చెంచా తేనె తీసుకుని కలిపి ముఖానికి బాగా పట్టించాలి. పూర్తిగా ఆరిపోయేవరకూ అలా వదిలేయాలి. తర్వాత దూది లేదా నీటితో మెల్లగా తడి చేస్తూ మర్ధన చేసినట్లుగా మొత్తం తుడిచేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే, చర్మంపై మృతకణాలు, క్రిములు తొలగిపోతాయి.
- పెసల పేస్టులో రెండు టీ స్పూన్ల యుగర్ట్ వేసి కలపాలి. మచ్చలున్న చర్మంపై ఈ మిశ్రమాన్ని అప్లై చేయాలి. పది నిమిషాలు అలాగే ఉంచేసి చల్లటి నీటితో కడిగెయ్యాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే ఫలితం ఉంటుంది.

ఉస్మానియా ఆస్పత్రి పరిస్థితి ఆందోళనకరం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఎంతో మందికి అత్యంత మెరుగైన వైద్య సేవలు అందించిన చరిత్ర ఉస్మానియా ఆస్పత్రికి ఉందని గుర్తుచేశారు. ఆస్పత్రి నూతన భవన నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

సమస్యలు పరిష్కరించాలంటే.. ఈడ్చేశారు

(మొదటిపేజీ తరువాయి)



కలెక్టరేట్ నుంచి వెళ్లకపోతే కేసులు పెడతామని పోలీసులు విద్యార్థులను హెచ్చరించారు. అయినప్పటికీ విద్యార్థులు ఆందోళన కొనసాగించారు. దాంతో పోలీసులు, విద్యార్థులకు మధ్య తీవ్ర తోపులాట జరగడంతో పోలీసులు.. విద్యార్థి నాయకులను ఈడ్చేశారు. బలవంతంగా అరెస్టు చేసి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ ఆందోళనలో పాల్గొన్న ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వందలాది మంది విద్యార్థులు కలెక్టరేట్ గేటు ఎదుట బైటాయించి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికీ పూర్తిస్థాయిలో పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేయలేదని తెలిపారు. మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. స్కూళ్లలో టీచర్ల కొరత ఉందని, ఎంఈఓలు లేరని చివరకు స్కావెంజర్లను కూడా సర్కారు నియమించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ యూనివర్శిటీలను నీరుగారుస్తూ ఇష్టారీతిన ప్రయివేటు వర్సిటీలకు అనుమతి ఇస్తున్నారని విమర్శించారు. ఇటీవల గురునానక్ అనే ప్రయివేటు యూనివర్శిటీ అడ్మిషన్ల పేర లక్షలు వసూళ్ల చేసి 4 వేల మంది విద్యార్థులను రోడ్డునపడేసిందని గుర్తు చేశారు. ఇక కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోడీ నూతన విద్యావిధానం పేర కుల, మతాల మధ్య విద్వేషం నింపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెలోషిప్‌లను నిలుపుదల చేస్తూ ఇబ్బందుల పాల్జేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదోడికి, ఉన్నోడికి విద్యలో అసమానతలు తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యలపై పలుమార్లు వినతిపత్రం సమర్పించినా సమస్యలు పరిష్కారం కావడం లేదని, కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, నలుగురు వచ్చి వినతిపత్రం సమర్పించి వెళ్లాలని పోలీసులు సూచించారు. దీనిపై నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ప్రధాన గేటు మూసివేశారు. అయినప్పటికీ.. విద్యార్థులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు విద్యార్థులను ఈడ్చేశారు. అరెస్టు చేసి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విఘ్నేష్, అనిల్, నగర కార్యదర్శి మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, నాయకులు విశాల్, యూనివర్శిటీ బాధ్యులు ప్రసాద్, సంధ్య, ఛత్రు, జోహర్‌సింగ్, సందీప్, శైలజ, నీలిమతో పాటు పలువురు విద్యార్థులున్నారు.

సమస్త జనులకు సమానంగా ప్రయోజనాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజల్లో పెంపొందిస్తుందని సీఎం కేసీఆర్ అన్నారు.

సకల మత విశ్వాసాలను, సాంప్రదాయాలను గౌరవిస్తూ తెలంగాణ రాష్ట్రంలో పాలన కొనసాగుతున్నదని సీఎం అన్నారు. అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా కలిసిమెలసి జీవించేలా, గంగ జమున తహజీబ్‌ను కాపాడుకుంటూ తెలంగాణ ఆధ్యాత్మిక పరంపరను కొనసాగిస్తున్నామన్నారు. దేశానికే ఆదర్శవంతమైన లౌకిక ఆధ్యాత్మిక కార్యాచరణ రాష్ట్రంలో అమలవుతుందని తెలిపారు. ఇస్లాం సహా మైనారిటీ మతస్తుల అభివద్ధి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తుందని వివరించారు. అల్లా దయ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

బీజేపీ అధికార ప్రతినిధిలా మాట్లాడొద్దు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి మాట్లాడుతూ ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ అంశం హైకోర్టు పరిధిలో ఉందనీ, ఒకసారి తీర్పు వచ్చాక ఆధునాతనమైన భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. గవర్నర్ వ్యాఖ్యలు కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్టు...తప్పుల కోసం భూతద్దంలో వెతికినట్టున్నాయని విమర్శించారు. ఆ వ్యాఖ్యలు దురదృష్టకరమంటూ విచారం వ్యక్తం చేశారు. ఉస్మానియా ఆస్పత్రిపై మొదట స్పందించింది సీఎం కేసీఆర్ అని తెలిపారు. 2015 జూలైలో సీఎం ఆస్పత్రిని సందర్శించి, నూతన భవన నిర్మాణానికి రూ.200 కోట్లు ప్రకటించారని గుర్తుచేశారు. అయితే కొంత మంది అదే ఏడాది ఆగస్టులో కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారనీ, అప్పట్నుంచి ఆ అంశం న్యాయవివాదంలో ఉందని వివరించారు. కోర్టు ఆదేశాల మేరకు ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్, ఐఐటీ హైదరాబాద్ నిపుణులతో ప్రభుత్వం వేసిన స్వతంత్ర కమిటీ ప్రస్తుత భవనం ఆస్పత్రి నిర్వహణకు పనికి రాదని నివేదిక ఇచ్చిందని తెలిపారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం కోర్టు చెప్పిందని తెలిపారు. కోర్టు నుంచి సానుకూలమైన తీర్పు వస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్రం ఒప్పుకున్నా.... గవర్నర్ అభినందించదెందుకు?

దేశంలో వంద శాతం ఆస్పత్రి డెలివరీలు జరుగుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కేంద్రం చెప్పినా గవర్నర్ అభినందించదెందుకు? అని హరీశ్ రావు ప్రశ్నించారు. "ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీలను 30 శాతం నుంచి 70 శాతానికి పెంచి సీన్ రివర్స్ చేశాం. కంటివెలుగు రెండో దశ కార్యక్రమంలో 1.62 కోట్ల మందికి పరీక్షలు, 45 లక్షల మందికి కండ్లద్దాల పంపిణీ చేశాం. నిమ్స్ ఆస్పత్రిలో పడకల సంఖ్యను 900 నుంచి 1,500కు పెంచాం. మరో 2 వేల పడకలతో విస్తరిస్తున్నాం. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ వంటి పథకాలతో మాతా, శిశు మరణాలను తగ్గించాం. నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అనే పరిస్థితి నుంచి నేను పోతా బిడ్డ సర్కార్ దవాఖానకు అనే స్థాయికి చేర్చాం. గతంలో 20 ఏండ్లకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే, తొమ్మిదేండ్లలో 21 కాలేజీలు ఏర్పాటు చేశాం. లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లతో దేశంలో మొదటి స్థానంలో ఉన్నాం. డయాలసిస్ సెంటర్లను 3 నుంచి 102కు పెంచాం. నిటిఅయోగ్ ర్యాంకుల్లో మూడో స్థానానికి చేరాం. బస్తీ దవాఖానాలను నిటిఅయోగ్ ప్రశంసించింది. బోధనాస్పత్రుల్లో ఓపీ తగ్గించి, ఆ ఆస్పత్రులపై ఒత్తిడి తగ్గించాం. గాంధీ, నిమ్స్, ఉస్మానియా ప్రభుత్వాస్పత్రుల్లో అవయవమార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నాం.... " అని మంత్రి హరీశ్ రావు వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అనేక మంచి కార్యక్రమాలను నిర్వహించినప్పటికీ గవర్నర్ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని గానీ, కనీసం వైద్యారోగ్యశాఖ సిబ్బందిని గానీ అభినందించేందుకు ఆమెకు మనసెందుకు రాలేదో అర్థం కావడం లేదన్నారు. ఈ విషయాలపై గవర్నర్ ఎందుకు స్పందించరు? ఒక డాక్టర్‌గా కనీసం గవర్నర్ అభినందించాలి కదా?. ప్రశంసిస్తే మేమింకా ఉత్సాహవంతంగా పనిచేస్తాం కదా? అని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి కనబడదు, మంచి వినబడదు. మంచి మాట్లాడను అన్నట్టుగా వ్యవహరిస్తే ఎలా? అని ప్రశ్నించారు. చెడును మాత్రమే చూస్తాం. చెడు మాత్రమే వింటాం. చెడు మాత్రమే మాట్లాడతాం.. అన్నట్టుగా వ్యవహరించడం రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గవర్నర్‌కు తగదని హితవు పలికారు.

చినుకు చింత

(మొదటిపేజీ తరువాయి)

కాలనీలు బస్తీలు ముంపు బారిన పడ్డాయి. నాటి బాధలు అనుభవించిన వారికి ఇప్పటికీ ఆ దృశ్యాలు కండ్లముందు కదలాడుతున్నాయి. ఒక గంటలో రెండు సెంటీమీటర్లకు మించి వర్షం పడినా నాలాలు పొంగిపొర్లుతున్నాయి. ఏండ్లకు ఏండ్లు గడుస్తున్నా వరద సమస్యలకు మాత్రం చెక్ పడటం లేదు.

ప్రత్యేక డ్రయినేజీ వ్యవస్థ ఎక్కడ?

గ్రేటర్‌లో భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి.దానికితోడు గొలుసుకట్టు చెరువులు చాలా వరకు వాటి అస్థిత్వం కోల్పోయాయి. నగరంలో స్ట్రామ్ వాటర్ డ్రైన్ తప్పనిసరి కానీ, గ్రేటర్ హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ వర్షం నీరు వెళ్లేందుకు ప్రత్యేక డ్రయినేజీ వ్యవస్థ లేదు. నాలాలు ఆక్రమణలకు గురవుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు కార్పొరేటర్లు ఆవేదన చెందుతున్నారు. సాధారణ పౌరులు సొంత స్థలంలో చిన్న చిన్న నిర్మాణాలు చేసుకుంటే కూల్చివేస్తున్న అధికారులు.. నాలాలను, చెరువులను ఆక్రమించిన బడాబాబులు పెద్ద పెద్ద నిర్మాణాలు కడుతున్నా అడ్డుకోక పోవడమే ముంపు సమస్యను తీవ్రతరం చేస్తుందని విమర్శిస్తున్నారు.

ఇప్పటికీ అదే పరిస్థితి

2020- 21లో వర్షాలతో హైదరాబాద్‌లో 1500 నుంచి 2000 కాలనీలు, బస్తీలల్లో వరదలు వచ్చాయి. ఇప్పుడు అలాంటి వర్షం వస్తే పరిస్థితేమిటి అంటే బల్దియా చెప్పలేని స్థితి. ఇక గ్రేటర్‌లో ఉన్న నాలాల్లో పూడికతీత పనులు అంతంత మాత్రంగానే ఉంది. వర్షాలు ప్రారంభమైనా ఇంకా 35 శాతం నాలాలు పూడిక తీయలేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇటీవల కొత్తగా నిర్మించిన వర్షపునీటి కాలువలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మేలో వచ్చిన వర్షాలతో కాలాసిగూడలో నాలా ప్రమాదం జరిగి ఒక బాలిక మృతిచెందింది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇండ్లలోకి వరద నీరు చేరింది. నగర వాసులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నాలాల పరిస్థితి అలానే ఉంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు నగర వాసులు భయాందోళన చెందుతున్నారు. ముందస్తుగానే అవసరమైన మరమ్మతులు చేసుకుని రోడ్లతోపాటు పలు ఏరియాల్లో నీళ్ల నిల్వకుండా చర్యలు తీసుకుంటే బాగుండేదని పలువురు సూచిస్తున్నారు. కండ్లెదుట అనేక అక్రమాలు జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

2న ఖమ్మంలో తెలంగాణ జన గర్జన సభ

నవతెలంగాణ - కూసుమంచి

ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిక, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా ఖమ్మంలో 2వ తేదీన నిర్వహించే తెలంగాణ జనగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే పిలుపునిచ్చారు. ఈ సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరవుతున్నట్టు తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లాలో పాదయాత్ర ముగించుకుని ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర శిబిరం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి 'హాథ్ సే హాథ్' జోడో యాత్ర, ఏఐసీసీ దిశా నిర్దేశం ప్రకారంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క భగభగ మండే ఎర్రటి ఎండలను సైతం లెక్కచేయకుండా పాదయాత్రను చేశారని తెలిపారు. ఈ యాత్రలు కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి దోహదపడతాయన్నారు. ఖమ్మంలో జులై 2వ తేదీన నిర్వహించే తెలంగాణ జనగర్జన సభ ఏర్పాట్లు, పాదయాత్ర ముగింపు నిర్వహణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ దగ్గరుండి కోఆర్డినేషన్ చేస్తారని చెప్పారు. ప్రజల సంపదను కేసీఆర్ లూటీ చేస్తున్నారని ఆరోపించారు.

మహారాష్ట్రకు 600 వాహనాలతో వెళ్లడం వెనక దాగివున్న ఉద్దేశం ఏంటి అని ప్రశ్నించారు. వేల కోట్ల రూపాయలు ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేయడానికి కేసీఆర్‌కు ఎవరు ఇస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ ఖర్చు పెడుతున్న ప్రతి పైసా ప్రజలది కాదా అని నిలదీశారు. లిక్కర్ స్కాంలో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి ఇప్పటికి జైల్లోనే ఉన్నారని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను సైతం విచారణ చేశారని, అదే స్కాంలో నిందితురాలుగా ఉన్న కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితను ఇవ్వాలో, రేపో అరెస్టు చేస్తామని హడావిడి చేసిన దర్యాప్తు సంస్థలు ఎందుకు సైలెంట్‌గా ఉన్నాయని ప్రశ్నించారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి, కవిత ఇద్దరూ ఒక కేసులో నిందితులైనప్పుడు కవితను ఎందుకు అరెస్టు చేయడం లేదో ప్రజలు ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రి రాం రెడ్డి దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు, పీసీసీ ఐటీ సెల్ చైర్మెన్ మదన్ మోహన్ రావు, డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న తదితరులు ఉన్నారు.

ఈటల చుట్టూ రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. దీంతో బుధవారం మేడ్చెల్ డీసీపీ సందీప్‌కుమార్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఈటల ఇంటికి వెళ్లారు. భద్రత కల్పిస్తామని చెప్పారు. ఇప్పుడు ఇదే రాజకీయంగా చర్చనీయాంశం అవుతున్నది. ఈటల అంటేనే భగ్గుమంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారిగా తన వైఖరిని మార్చుకుని ఈటల పట్ల సానుకూలంగా మాట్లాడటం కొత్త ఊహాగానాలకు తెరలేపుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే భద్రతను స్వీకరిస్తారా? కేంద్రం ఇచ్చే భద్రతాదళతంతో ముందుకెళ్తారా? అనేది ఈటల చేతుల్లోనే ఉంది.

చెరుకు చేదే...

- ఎంఎస్‌పీ కేవలం రూ.10 పెంపు
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

న్యూఢిల్లీ : చెరుకు రైతులకు కేంద్రం తీపి కబరు వినిపించలేదు. ఈ పంటకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)ను కేవలం రూ.10 మాత్రమే కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రి వర్గం సమావేశం నిర్ణయం తీసుకుంది. సమావేశ అనంతరం నేషనల్ మీడియా సెంటర్ (ఎన్ఎంసీ)లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రులు అనురాగ్ సింగ్ ఠాకూర్, మనుసుఖ్ మాండవీయా మాట్లాడారు. కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిన నిర్ణయాలను వెల్లడించారు. చెరుకు పంటకు ఏటా ప్రకటించే ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్ (ఎఫ్ఆర్‌పీ) ధరను ఈ సీజన్‌లో క్వింటాలు రూ.10 చొప్పున పెంచి రూ. 315 నిర్ణయించింది. ఈ నిర్ణయం ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ తీసుకుందని తెలిపారు. ఈ తాజా నిర్ణయంతో దేశవ్యాప్తంగా 5 కోట్ల మంది చెరకు రైతులకు లబ్ధి చేకూరుతుందని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. అక్టోబర్ నుంచి మొదలయ్యే సీజన్‌లో చక్కెర కర్మాగారాలు రైతులకు క్వింటాల్‌పై సరసమైన, ప్రోత్సాహకర ధర (ఎఫ్ఆర్‌పి)గా రూ.315గా చెల్లించాల్సి ఉంటుంది. గతేడాది ఎఫ్ఆర్‌పీ రూ.305గా ఉండగా, 2023-24 ఏడాదికి గాను క్వింటాల్‌పై రూ.315 కేంద్రం నిర్ణయించినట్టు అనురాగ్ ఠాకూర్ తెలిపారు.

పీవీకి భారతరత్న ఎందుకడగటం లేదు?

(మొదటిపేజీ తరువాయి)

అడగడం లేదు?' అని సీఎం కేసీఆర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని పీవీ ఘాట్‌లో ఆయనకు బండి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ తమిళనాడు సహాయ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ కోశాధికారి శాంతికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్వీ సుభాష్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గీతామూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ..ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకోవడమే కేసీఆర్ పని అని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్రాహ్మణ ఓట్లు చీల్చేందుకే ఆనాడు కేసీఆర్ పీవీ జపం చేశారన్నారు. పీవీ ఘాట్ ను కూల్చేస్తామని ఓవైసీ అంటే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

భీమ్ ఆర్మీ చీఫ్‌పై కాల్పులు

(మొదటిపేజీ తరువాయి)

తెగబడ్డారు. దుండగులు కూడా కారులో నుంచే కాల్పులు జరిపారు. అజాద్ పొత్తి కడుపులోకి బుల్లెట్ దూసుకుపోవడంతో వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉంది. దుండగులు ఉపయోగించిన వాహనం హర్యానా రిజిస్ట్రేషన్‌తో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. దుండగులు కోసం గాలింపు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కాల్పుల ఘటనపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. బీజేపీ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతల దుస్థితికి ఈ ఘటన నిదర్శనమని విమర్శించాయి.

ప్రాజెక్టులు సరే... కాలువలేవీ...?

- బ్రాంచ్ కెనాళ్లు, ఫీల్డ్ ఛానళ్లను నిర్మించరా ?
- వృధాగా సముద్రంలోకి సాగు నీరు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ అనగానే సాధారణంగా నీళ్లు, నిధులు, నియామకాలు మనకు గుర్తొస్తాయి. అలాగే ప్రాజెక్టులు అనగానే బ్రాంచ్‌కెనాళ్లు, ఫీల్డ్ ఛానళ్ల గుర్తురావాలి. కానీ, అలా జరగడం లేదు. ఎద్దును కొని పగ్గానికి భయపడ్డట్టు ఉంది పరిస్థితి. భారీ ప్రాజెక్టులు కడుతున్నా ప్రభుత్వాలు, పిల్ల కాలువలను మరిచిపోతుంటాయి. దీంతో ఆశించిన లక్ష్యం ఆమడదూరంలోనే ఉంటున్నది. దీంతో ప్రజాధనం సద్వినియోగం కావడం లేదు. ప్రాజెక్టులు రాష్ట్ర వ్యవసాయ రంగంలో భారీ మార్పులకు కారణమవుతున్నాయి. భూగర్భ జలాలు పెరగడానికి ఊతమిస్తున్నయి. ప్రభుత్వాల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ధనదాహం మూలంగా విలువైన జనంసొమ్ము ప్రాజెక్టుల్లోనీ నీళ్లల్లో కొట్టుకుపోతున్నది. ఆనక ఆ భారం ప్రజల నెత్తిమీద మోపాల్సి వస్తున్నది. పూర్తిస్థాయిలో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించని కారణంగా ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కిలా ఉంది పరిస్థితి. ప్రమాణాల మేరకు ప్రాజెక్టులు కడితే ఆర్థిక నష్టాలు, కష్టాలు ఉండవని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్న మాట.

ప్రాజెక్టు అంటే..

పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) ఆమోదం పొందిన వెంటనే నిర్ణీత కాలంలో పూర్తి చేయాలి. అప్పుడే అది సమగ్ర ప్రాజెక్టు అవుతుంది. కానీ భూసేకరణ జరగలేదనీ, బిల్లులు ఇవ్వడం లేదంటూ కాంట్రాక్టర్లు అదనపు నిధుల కొరకు వెంపర్లాడుతూ అంచనాల సవరణ(రివైజ్డ్ ఎస్టిమేట్లు) పేరుతో డీపీఆర్‌లో ఉన్న మొత్తం కంటే నాలుగైదు రెట్లు పెంచిన సందర్భాలూ ఎన్నో.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువలు రెండో విడతకు సంబంధించి 77 కిలోమీటర్లు ఉన్నాయి. ఇందులో డీబీఎం(మానేరు వెనుక పంపిణీ) అధికం. వర్ధన్నపేటలోని ఆకేరుసాగు నుంచి ప్రారంభమై, మూసీవరకు సాగుతుంది. పంపిణీ కోసం దాదాపు బ్రాంచ్‌కెనాళ్లు 20 వరకు ఉన్నాయి. వీటికి ఫీల్డ్ ఛానెళ్లు చాలా ఉన్నాయి. 2.30 లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు ఈ కాలువలు వినియోగిస్తారు. సుమారు 30 ఏండ్ల తర్వాత వీటిని తవ్వారు. దీంతో తుమ్మలు(చెట్లు) మొలిచాయి. అప్పట్లోనే రూ.220 కోట్లు ఖర్చయ్యాయి. అవినీతి జరిగిదంటూ 12 మంది ఇంజినీర్లు, అధికారులను సస్పెండ్ చేశారు. ఆరు నెలల క్రితం శ్రీరాంసాగర్ నుంచి రెండో దశకు నీళ్లు వదిలారు. కానీ, నీటి ప్రవాహం సరిగ్గా సాగడం లేదు. ఆ కాలువలు, చెరువులు నింపడానికి అనువుగా లేకపోవడమే. లైనింగ్ కూలిపోయింది. ఇసుక, సిమెంట్, సలాక్ పెట్టి మరమ్మత్తులు చేయాలి. ఇకపోతే పాలేరు నుంచి భక్తరామదాసు డిస్ట్రిబ్యూటరీ లిఫ్ట్ నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 64 వేల ఎకరాలకు నీళ్లు వదిలారు. ఈ కాలువలూ సక్రమంగా లేవు. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి 3.40 లక్షల ఎకరాలు, బీమా 2.03 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు 2.00 లక్షల ఎకరాలు, కొయిల్‌సాగర్ కింద 38,250 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రధాన ప్రాజెక్టుల పనులు పూర్తయ్యాయి. కానీ, లైనింగ్ పనులు చేయకపోవడం మూలాన నీరు వృధాపోతున్నది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. భారీ ప్రాజెక్టులు పూర్తయినా, బ్రాంచ్‌కెనాళ్లు, ఫీల్డ్ ఛానెళ్ల నిర్మాణం పెండింగ్‌లో ఉంటుండటంతో సమస్య కొలిక్కి రావడం లేదు. ప్రధానమైన ఈ రెండు రకాల కాలువల నిర్మాణం ప్రభుత్వం చేయాలి. పిల్ల కాలువలను ఎక్కడికక్కడ స్థానికంగా ఉండే రైతులు చేసుకుంటారు.

ఎఎంఆర్ ప్రాజెక్టు..

ఎలిమినేటి మాధవ రెడ్డి(ఎఎంఆర్) ప్రాజెక్టు ఆయకట్టు రూ.2.70 లక్షల ఎకరాలు. ఈ మేరకు సాగునీరందించడానికి కాలువలు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం పంపింగ్ సైతం జరుగుతున్నది. బ్రాంచ్‌కెనాళ్లు లేకపోవడంతో కరువు ప్రాంతాలకు నీళ్లు అందడం లేదు. ఎప్పుడో నిర్మించిన కాలువలు కూలిపోయాయి. అలాగే 2004 నుంచి ఆదిలాబాద్ జిల్లాలో 14 మధ్యతరహా ప్రాజెక్టులు చేపట్టారు. అందులోనూ ఆరు ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ పథకం ఏఐబీపీ కింద ఉన్నాయి. 2004లో చేపట్టిన ఈ ప్రాజెక్టులు పూర్తయినా, పంటకాలువలు లేకపోవడంతో ప్రాజెక్టుల నీరు వృధా అవుతున్నది. ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.50 లక్షల నుంచి రూ. 3 కోట్ల వరకు కేటాయించారు.

సుద్దవాగు, గొల్లవాగు, ఎర్రవాగు, మత్తడివాగు, సాత్నాల, ర్యాలీవాగు మరమ్మత్తులు చేయకపోవడంతో నష్టం జరుగుతున్నది. కాలువల్లేక కేవలం 10 వేల ఎకరాలకే నీళ్లు పారుతున్నాయి. 1203 సంవత్సరంలో నిర్మించిన పాకాల, రామప్ప, లక్నవరం ప్రాజెక్టుల కింద కాలువలు బాగా దెబ్బతిన్నాయి. నీరు సద్వినియోగం కావడం లేదు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ ప్రాథమిక కీ విడుదల

జులై 5 వరకు ఆన్‌లైన్‌లో అభ్యంతరాల స్వీకరణ

- టీఎస్‌పీఎస్సీ వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) విడుదల చేసింది. అభ్యర్థుల ఓఎంఆర్ రెస్పాన్స్ షీట్లను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. వాటితోపాటు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష మాస్టర్ ప్రశ్నాపత్రాలను అందుబాటులో ఉంచింది. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతేడాది ఏప్రిల్ 26న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 11న రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా కేంద్రాల్లోని 994 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించామని తెలిపారు. ఈ పరీక్ష కోసం 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, పరీక్షకు హాజరైన 2,33,506 (ప్రాథమిక వివరాల ప్రకారం 2,33,248 హాజరు) మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను స్కాన్ చేశామని వివరించారు. ప్రాథమిక కీకి సంబంధించి ఆన్‌లైన్ ద్వారా అభ్యంతరాలను వచ్చేనెల ఒకటి నుంచి ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఇంగ్లీష్‌లోనే సమర్పించాలని సూచించారు. వాటికి సంబంధించిన ఆధారాలను జతపరచాలని కోరారు. ఈమెయిల్ లేదా నేరుగా అభ్యంతరాలను స్వీకరించబోమని స్పష్టం చేశారు. ఓఎంఆర్ షీట్లు వచ్చేనెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రాథమిక కీ, ఓఎంఆర్ షీట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. అయితే గతేడాది అక్టోబర్ 16న గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షకు 2,85,916 మంది అభ్యర్థులు హాజరైన విషయం తెలిసిందే. అందులో 25,150 మంది అభ్యర్థులను గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలకు కూడా అర్హత సాధించినట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. అయితే ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంతో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేసింది. దీంతో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను తిరిగి ఈనెల 11న నిర్వహించింది.

మహిళా శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- బాలికల విద్యను ప్రోత్సహిస్తున్న సీఎం కేసీఆర్ : మహిళా కమిషన్ చైర్మెన్ సునీతా లక్ష్మారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి సాధికారత సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాకిటి సునితా లక్ష్మారెడ్డి అన్నారు. మహిళా శిశు సంక్షేమానికి, రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యనిస్తున్నదని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్, జాతీయ మహిళా కమిషన్ సారథ్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో 'మహిళల హక్కులు సాధికారతలో భాగంగా ఉపాధి ద్వారా మహిళా సాధికారత' అనే అంశంపై బుధవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు సంపూర్ణ విద్యావంతులు కావాలనే లక్ష్యంతో దేశంలోనే బాలికల విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నదని వివరించారు. అందులో భాగంగానే పాఠశాలలను నెలకొల్పిందని గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న పరీక్షల్లో అమ్మాయిలు ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నారనీ, ఇది మంచి పరిణామమని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు బాలికలకు అండగా ఉన్నాయని చెప్పారు.

మహిళల అభివృద్ధితోనే సమాజం ముందుకెళ్తుందని అన్నారు. లింగ వివక్షతలేని సమాజ నిర్మాణం జరిగినప్పుడే ఆ ప్రాంతం అభివృద్ధిని సాధిస్తుందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్టార్టప్‌లను ప్రారంభించిందని వివరించారు.

మహిళలకు ఎలాంటి సమస్య వచ్చినా తక్షణమే మహిళా కమిషన్ దృష్టికి తేవాలనీ, అప్పుడే సత్వర న్యాయం అందేలా చూస్తామని అన్నారు. ఏ సమస్య వచ్చినా 100, 181 లేదా మహిళా కమిషన్ వాట్సాప్ హెల్ప్ లైన్ నెంబర్ 9490555533 ఫోన్ చేయొచ్చని కోరారు.

ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యులు కుమ్ర ఈశ్వరీబాయ్, కటారి రేవతిరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శారద, కార్యదర్శి కృష్ణకుమారి, డీఆర్డీఓ డీపీఎం స్వర్ణలత, హైకోర్టు అడ్వకేట్ మంజూష పాల్గొన్నారు.

సీఎం దృష్టికి జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశం

- దక్కన్ సొసైటీకి మంత్రి హరీష్ హామీ



నవతెలంగాణ-హైదరాబాద్

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి టి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. ఈ మేరకు డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బొల్లోజు రవి, ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్, కోశాధికారి అయ్యప్ప తదితరులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల ఇండ్ల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిన ప్రాధాన్యతను వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న హైదరాబాద్ సిటీ, రాష్ట్ర స్థాయి జర్నలిస్టులకు మాత్రం ఇండ్ల స్థలాల కేటాయింపు పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. చాలీచాలనీ వేతనాలతో జర్నలిస్టులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని గుర్తు చేశారు. ఉద్యోగరీత్యా ఇతర జిల్లాలు, ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చి పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇంటి అద్దె భారం గుదిబండగా మారిందని గుర్తుచేశారు.

అండగా ఉంటాం..ఆందోళన వద్దు

- జర్నలిస్టు తులసికి ఫెడరేషన్ పరామర్శ



నవతెలంగాణ-హైదరాబాద్

స్వతంత్ర పాత్రికేయురాలు తులసిచంద్‌ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకత్వం పరామర్శించింది. అండగా ఉంటామనీ, ఆందోళన పడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పింది. ప్రజల గొంతుకను ఇక ముందు కూడా వినిపించాలని కోరింది. సంఘ వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బుధవారం హైదరాబాద్‌లో తులసిచంద్ నివాసంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య కార్యదర్శులు ఎస్.కె సలీమ, ఇ.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు బి. రాజశేఖర్ ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వీడియోలు, అసాంఘీక శక్తుల బెదిరింపుల విషయమై దాదాపు గంటసేపు చర్చించారు. వార్తాకథనాల్లో ప్రజాకోణాన్ని కొనసాగించాలనీ, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. 'తనకు గత సంవత్సర కాలంగా బెదిరింపులు వస్తున్నాయని' ఫెడరేషన్ బృందానికి తులసి తెలియజేశారు. మతానికి సంబంధించిన వీడియో చేసినప్పటి నుంచే ట్రోల్స్ ప్రారంభమయ్యాయని వివరించారు. తనకు మీడియా అక్రిడిటేషన్ కార్డు లేదని చెప్పారు. నేను నిజాలను మాత్రమే ప్రజలకు చెప్పాలనీ భావించాననీ, ఆ పనిని ఇక ముందు కూడా చేస్తానని అభిప్రాయపడ్డారు. ఇందుకు స్పందిన ఫెడరేషన్ నాయకత్వం' నిరభ్యంతరంగా మీ పని మీరు చేయండి..మేము మీకు వెన్నంటే ఉంటాం.మద్దతు ఇస్తాం..మీ తరపున పోరాడతాం' అని హామీ ఇచ్చారు. ఫెడరేషన్ బృందం తన ఇంటికి వచ్చి తనకు సంఘీబావం చెప్పడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనపై వస్తున్న ట్రోల్స్, బెదిరింపుల విషయంలో రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాననీ, ఎఫ్ఐఆర్ నమోదు అయిందని వివరించారు. ఆకేసు విచారణ ఎంతవరకు వచ్చిందనే విషయాన్ని ఇంకా తెలుసుకోవాల్సి ఉందని అన్నారు ఇందుకు ఫెడరేషన్ బృందం తనతో మాట్లాడుతూ 'అన్ని విషయాల్లో సహకరిస్తామని' చెప్పారు.

అధ్యక్ష మార్పు ఒట్టిమాటే

- బూత్‌ల వారీగా పార్టీ బలోపేతానికే విస్తారక్‌ల రాక : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రాష్ట్రంలో అధ్యక్షుడి మార్పు ఒట్టిమాటే. తరుణ్‌చుగ్‌తో సహా అనేకసార్లు జాతీయ నాయకులు మార్పు ఉండదని చెప్పినా తప్పుడు వార్తలు ఆగడంలేదు. ఆ వార్తలన్నీ చూసీచూసీ అలవాటైపోయింది. దీన్ని తమ కార్యకర్తలెవ్వరూ పట్టించుకోవట్లేదు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ అన్నారు. 'మేరా బూత్ సబ్‌సే మజ్బూత్' కార్యక్రమంలో పార్టీ బలోపేతం కోసం బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన విస్తారక్‌లకు ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీని బూత్‌ల వారీగా తమ పార్టీని బలోపేతం చేసేందుకే ఆయా రాష్ట్రాల నుంచి 650 మంది విస్తారక్‌లు తెలంగాణకు వచ్చారని తెలిపారు. మంచిర్యాల, ఖాజీపేట, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ల నుంచి మండల కేంద్రాలకు వెళ్లారన్నారు. వారంతా పోలింగ్ బూత్‌ల వారీగా పార్టీని బలోపేతం చేసే పనిలో నిమగ్నమవుతారని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీని బలహీనం చేసేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈటల హత్యకు కుట్ర చేసిన వారిపై తక్షణమే విచారణ జరపడంతోపాటు బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈటల రాజేందర్‌కు కచ్చితంగా తగిన భద్రత కల్పించాలని కోరారు. పార్టీ బలోపేతం కోసమే ఈనెల 8న 11 రాష్ట్రాల అధ్యక్షులు, సంఘటనా మంత్రుల సమావేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

మైస్ టూరిజం కాపిటల్‌గా హైదరాబాద్

- ఈవెంట్ ఇండస్ట్రీ అభివద్ధికి భవిష్యత్తు
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌ను మీటింగ్స్, ఇన్‌సెంటీవ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్(ఎంఐసీఈ) టూరిజం కాపిటల్‌గా అభివద్ధి చేస్తున్నామని పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇప్పటికే ఐటీ, ఫార్మా ఎగుమతుల కేంద్రంగా హైదరాబాద్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. ఈవెంట్ ఇండస్ట్రీ అభివద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైటెక్‌సిటీలోని హైటెక్స్‌లో జులై 24,25 తేదీల్లో 'సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్' నిర్వాహణపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను బుధవారం మంత్రి ఆవిష్కరించారు. నిర్వాహకులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అభివద్ధితోపాటు హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్‌ని పెంచేందుకు ఎన్నో కార్యక్రమాలను రూపొందిస్తున్నదని అన్నారు. మైస్ టూరిజంలో హైదరాబాద్ నగరం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈవెంట్ ఇండస్ట్రీ అభివద్ధికి పర్యాటకశాఖ తరపున పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ బలరాంబాబు, కనీషా సబనాన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తేయండి

- డీజీపీ అంజనీకుమార్‌కు సీపీఐ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ నాయకులపై అక్రమంగా నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తేయాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీజీపీ అంజనీకుమార్‌ను బుధవారం హైదరాబాద్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఈటి నరసింహ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య కలిసి వినతిపత్రం సమర్పించారు. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుంట్లూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 215 నుంచి 224 వరకు సుమారు వందెకరాల భూదాన భూమిలో 10 వేల మంది నిరుపేద కుటుంబాల ప్రజలు గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారని తెలిపారు. స్థానిక రెవెన్యూ అధికారులు ప్రైవేట్ భూకబ్జాదారులతో కుమ్మక్కై ఆ గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దాన్ని అడ్డుకుని గుడిసెవాసులకు అండగా నిలుస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, నాయకులు ముత్యాల యాదిరెడ్డి, పానుగంటి పర్వతాలు, పామిడి శేఖర్‌రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, హరిసింగ్ నాయక్‌తోసహా 21 మందిపై హయత్ నగర్ పోలీసులు అక్రమ కేసులు బనాయించారని పేర్కొన్నారు. ఆ కేసులను వెంటనే ఎత్తేయాలని కోరారు. భూదాన భూమిపై పూర్వాపరాలు పరిశీలించి ప్రస్తుతం నివాసముంటున్న 10 వేల కుటుంబాల ప్రజల గుడిసెలను తొలగించకుండా చూడాలని తెలిపారు. అక్రమ కేసులు బనాయించకుండా ఆదేశించి, పేదలకు న్యాయం చేయాలని డీజీపీని వారు కోరారు. వందెకరాల భూదాన భూమిలో గుడిసెలు వేసుకున్న ప్రజలకు వెంటనే పట్టాలిచ్చి, భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు.

మోడీ దత్తపుత్రుల అవినీతిని బయటపెట్టాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాని నరేంద్ర మోడీ దత్తపుత్రుల అవినీతిని బయటపెట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ డిమాండ్ చేశారు. కేసీఆర్ కూతురుతో సహా తమిళనాడు నుంచి జమ్ము కాశ్మీర్ వరకు ప్రాంతీయ పార్టీలు, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కుటుంబ పాలన సాగుతున్నదని, వాళ్లంతా అవినీతికి పాల్పడుతున్నారంటూ మోడీ ఆరోపణలు చేయడంపై నారాయణ బుధవారం స్పందించారు. దేశం కోసం బీజేపీకి ఓటు వేయాలని కోరడాన్ని ఆయన ఖండించారు. 30 మంది మోడీ దత్తపుత్రులు బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎంత అవినీతికి పాల్పడ్డారో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. అందులో మోడీ ప్రథమ పుత్రుడు అదానీ ఉన్నారని వివరించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.లక్షల కోట్లు ఎగ్గొట్టి దేశం నుంచి వెళ్లిపోయారని విమర్శించారు. ఇక్కడే ఉండే పెద్ద దత్తపుత్రుడు దేశాన్ని దోచుకుంటుటే, వారికి సహకరిస్తున్నారని తెలిపారు. నేరపూరిత సామ్రాజ్యానికి బాధ్యత వహించే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ప్రధాని మోడీ ప్రతిపక్ష పార్టీల గురించి మాట్లాడ్డం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దత్తపుత్రులు ఎంత తిన్నారు, మిగిలిన వాళ్లు ఎంత తిన్నారనే లెక్కలు తీస్తే తమకేమి అభ్యంతరం లేదని వివరించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో పాకో మిషన్లు

- 12 మిషన్ల ప్రారంభించిన మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్, మెహిదీపట్నం

రాష్ట్రంలోని అన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రుల్లో పాకో మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. బుధవారం హైదరాబాద్ సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావు వీటిని వర్చువల్ పద్ధతిలో ఏకకాలంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మహమూద్ అలీ, స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, సరోజినీ దేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగంతో కలిసి ఆయా జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రజా ప్రతినిధులతో హరీశ్‌రావు సమీక్ష నిర్వహించారు. కంటివెలుగు రెండో దశ కార్యక్రమంలో 1.62 కోట్ల మందికి పరీక్షలు చేశామని తెలిపారు. వీరిలో 25.1 శాతం మందికి కంటి సమస్యలున్నట్టు గుర్తించి అవసరమైన వారికి కండ్లద్దాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. మిగిలిన వారి చికిత్స కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రయివేటులో పాకో మిషన్ల ద్వారా కాటరాక్ట్ సర్జరీ చేయించుకునేందుకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వాస్పత్రుల్లో కేవలం సరోజినీ దేవిలో మాత్రమే పరిమితమైన ఈ సేవలను ఇప్పటి నుంచి జిల్లాలకు విస్తరించినట్టు చెప్పారు. వీటితో సర్జరీ చేయించుకున్న తర్వాత ఇన్ఫెక్షన్, కుట్లు వేసుకోవడం, కండ్లద్దాలు ఉపయోగించాల్సిన అవసరం ఉండబోదని స్పష్టం చేశారు. అల్ట్రా సౌండ్ పరిజ్ఞానంతో పనిచేసే ఈ యంత్రాల ద్వారా సర్జరీలు సులభంగా, వేగంగా చేసేందుకు వీలు కలుగుతుందనీ, రోగులు త్వరగా కోలుకుంటారని వివరించారు.

కొత్త మిషన్లలో రెండు సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో, ఒకటి మలక్ పేట ఏరియా ఆస్పత్రిలో, మరో తొమ్మిది ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రుల్లో ప్రజలకు సేవలందించనున్నాయి. ఒక్కో యంత్రం ఖరీదు రూ.28.85 లక్షలు కాగా మొత్తం మిషన్లకు రూ.3.46 కోట్లు ఖర్చు చేసినట్టు మంత్రి తెలిపారు. సరోజినీ ఆస్పత్రిలో త్వరలో ఆధునాతన భవని నిర్మాణానికి అనుమతులు మంజూరునిస్తామని తెలిపారు.

రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు

- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే ఐదురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. గురువారం రాష్ట్రంలో పలు జిల్లాల్లో మోస్తరు వర్షం పడే సూచనలున్నాయని పేర్కొన్నారు. పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. ఆ జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలున్నాయి. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం బుధవారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 222 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎక్కువ వర్షం కురిసింది. మెదక్ జిల్లా ఎల్దుర్తిలో అత్యధికంగా 3.3 సెంటీమీటర్ల వాన పడింది.

హాయిగా నవ్వుకునే చిత్రం

సుధాకర్ కోమాకుల హీరోగా నటించిన హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నారాయణ అండ్ కో'. చిన్నా పాపిశెట్టి దర్శకత్వంలో పాపిశెట్టి ఫిల్మ్ ప్రొడక్షన్స్, సుఖ మీడియా బ్యానర్‌ల పై పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 30న విడుదల కానున్న నేపథ్యంలో హీరో సుధాకర్ కొమాకుల విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలను పంచుకున్నారు. 'నాకు నిర్మాణంపై ఎప్పటి నుంచో ఆసక్తి ఉంది. మొదటి నుంచి వీడియోస్, కవర్ సాంగ్స్ చేస్తూనే ఉన్నాను. ఈ సినిమా కంటే ముందు 'రీసెట్' అనే సినిమా మొదలు పెట్టాం. అది ఇంకా టేకాఫ్ కాలేదు. దర్శకుడు చిన్నా ఈ కథ చెబుతున్నపుడు చాలా గమ్మత్తుగా అనిపించింది. ఏం చేసిన ఫ్యామిలీ అంతా చేస్తారని చెప్పడం చాలా కొత్తగా, హిలేరియస్‌గా ఫీల్ అయ్యాను. ఇది ఫ్యామిలీ మూవీ. ఇలాంటి సినిమాతో నిర్మాణంలోకి రావడం చాలా ఆనందంగా అనిపించింది. సినిమా అంతా చాలా ఫన్‌గా ఉంటుంది. ఫ్యామిలీ అండ్ క్రైమ్ కామెడీ రెండూ అందర్నీ అలరిస్తాయి. ఇందులో తండ్రి పాత్రకు ఎవరిని తీసుకోవాలని ఆలోచిస్తున్నప్పుడు దేవి ప్రసాద్ పేరు చెప్పాను. ఆయన సీరియస్ రోల్స్ చేసినా మంచి కామెడీ సినిమాలు తీశారు. అలాగే బయట ఆయన చాలా సరదాగా ఉంటారు. ఈ పాత్రకు ఆయనైతే పర్ఫెక్ట్ అనిపించింది. ఇందులో నారాయణ గారి అబ్బాయి పాత్రలో కనిపిస్తా. నా పాత్ర చాలా సహజంగా, సెటిల్డ్‌గా ఉంటుంది . నాకు కామెడీ చాలా ఇష్టం. ఇందులో ఫుల్ లెంత్ వినోదం చేసే అవకాశం దక్కింది. ముఖ్యంగా అమాయకత్వం నుంచే పుట్టే కామెడీ కడుపుబ్బా నవ్విస్తుంది. ఇందులో నలుగురు మ్యూజిక్ డైరెక్టర్స్ చేశారు. అలాగే ఈ చిత్రానికి మహిళా ఎడిటర్ సృజన అడుసుమల్లి అద్భుతమైన వర్క్ ఇచ్చారు.



సుధాకర్ కోమాకుల

నాకు బాక్సింగ్ యాక్షన్, డ్యాన్స్, ఎమోషనల్‌గా ఉండే సినిమా లంటే ఇష్టం. త్వరలో ఒక ఎమోషనల్ రోల్ ఉన్న సినిమా చేస్తున్నాను. దీంతోపాటు 'గుండెల్లో దమ్ము', 1980 నేపథ్యంలో ఉండే ఒక లవ్ స్టోరీ చిత్రంలో నటిస్తున్నాను.

గండ రిలీజ్‌కి రెడీ

జీరో బడ్జెట్‌తో వారణాశి సూర్య ఓ వినూత్న ప్రయోగానికి తెరతీస్తూ ఈజీ మూవీస్ బేనర్ పై 'గండ' చిత్రాన్ని డైరెక్ట్ చేస్తూ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 30న విడుదలకు సిద్ధమైంది.

ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ వేడుకలో వారణాశి సూర్య మాట్లాడుతూ, 'ఈ సినిమాతో ఎంతో మంది టాలెంటెడ్ ఆర్టిస్ట్, టెక్నీషియన్స్ ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. ఈ చిత్రాన్ని 22 థియేటర్స్‌లో రిలీజ్ చేయబోతున్నా. మా ఈజీ మూవీస్ సంస్థ త్వరలో ఓ పెద్ద సంస్థతో కలిసి పెద్ద ప్రాజెక్ట్ చేయబోతుంది. అలాగే విజయ్ జెడ అనే దర్శకుణ్ని పరిచయం చేస్తూ మా సంస్థలో మరో జీరో బడ్జెట్ సినిమా చేయబోతున్నాం. చిన్న సినిమాలు పలు కారణాల వల్ల విడుదలకు నోచుకోక ల్యాబ్‌ల్లోనే ఉండ పోయాయి. అలాంటి సినిమా లను టేకప్ చేసి, వాటికున్న సమస్యలను సాల్వ్ చేసి, కంటెంట్ ఉన్న సినిమాలను రిలీజ్ చేయాలన్న ఆలోచనలో కూడా ఉన్నాం. దానికి సంబంధించిన పనులు కూడా జరుగుతున్నాయి. అలాగే కోట్లు పెట్టి పోగొట్టుకున్న చిన్న నిర్మాతలు కేవలం పింఛన్ మీద ఆధారపడి బతుకు తున్న వారున్నారు. అలాంటి వారికి మా సంస్థలో వచ్చే మనీతో కొంత సాయం చేయాలని సంకల్పించాం. మా 'గండ' సినిమా తప్పక అలరిస్తుంది' అని తెలిపారు.


వారణాశి సూర్య

నవచిత్రం

సౌండ్ పార్టీ షూటింగ్ పూర్తి

ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై వి.జె.సన్నీ హీరోగా, హ్రితిక శ్రీనివాస్ హీరోయిన్‌గా తొలి ప్రయత్నంగా నిర్మిస్తున్న చిత్రం 'సౌండ్ పార్టీ'. దర్శకుడు జయశంకర్ సమర్పణలో సంజయ్ శేరి ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. బుధవారంతో ఈ సినిమా షూటింగ్ విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సారథి స్టూడియోలో ఈ చిత్ర టైటిల్ లోగో పోస్టర్‌ను జర్నలిస్ట్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. చిత్ర సమర్పకుడు వి.జయశంకర్ మాట్లాడుతూ, 'నిర్మాత రవి, నేను మంచి ఫ్రెండ్స్. నా చిరకాల మిత్రుడైన సంజయ్‌తో ఆయన ఈ సినిమా చేస్తున్నారు. పక్కా ప్లానింగ్‌తో దర్శకుడు సంజయ్ సినిమాని పూర్తి చేశాడు. అనుకున్న విధంగానే ఆగస్ట్‌లో సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. '25 కంటే ఎక్కువ స్క్రిప్ట్‌లను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, ప్రతిభావంతుడైన సంజయ్ శేరీతో ఈ సినిమా చేశాం. ఈ అద్భుతమైన ప్రయాణంలో నా ప్రియ మిత్రుడు జయశంకర్ మార్గదర్శకత్వం, సపోర్ట్ లభించడం నా అదృష్టం. ఈ సినిమా షూటింగ్‌ని కేవలం 25 రోజుల్లోనే పూర్తి చేశాం' అని ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ అధినేత, నిర్మాత రవి పోలిశెట్టి చెప్పారు. దర్శకుడు సంజయ్ శేరి మాట్లాడుతూ, 'ఇదొక ఫుల్ ఫన్ రైడ్ చిత్రం. అందరి సహకారంతో సినిమా చాలా బాగా వచ్చింది' అని తెలిపారు. 'నేను పార్టీ పెట్టబోతున్నా అంటూ చేసిన వీడియోకు చాలా మంది నుంచి ఫోన్స్ వచ్చాయి. 'సౌండ్ పార్టీ' టైటిల్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. మా నిర్మాత యుఎస్‌లో ఉంటూ కూడా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా పూర్తి చేయడానికి సహకరించారు. మా దర్శకుడు సంజయ్ అద్భుతంగా తీశాడు. జయశంకర్ అన్నీ తానై సినిమాను నడిపించాడు. కచ్చితంగా థియేటర్‌లో ఈ సినిమా గట్టిగా సౌండ్ చేస్తుందని నమ్ముతున్నా. నా కెరీర్‌కి బాగా ఉపయోగపడే చిత్రమిది' అని అన్నారు.


వి.జె.సన్నీ, హ్రితిక శ్రీనివాస్

మెప్పించే యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ

దర్శకుడు కె దశరథ్ నిర్మాతగా వ్యవహరిస్తూ కథ అందించిన చిత్రం 'లవ్ యు రామ్'. ఈ చిత్రానికి డివై చౌదరి దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాత కూడా. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా ఈనెల 30న విడుదల కానునుంది. ఈ నేపథ్యంలో రచయిత, నిర్మాత దశరథ్ మీడియాతో ముచ్చటించారు. 'దర్శకుడు డివై చౌదరి, నేను మంచి స్నేహితులం. ఒక లవ్ స్టోరీ చేద్దామని భావించాం. ఒకప్పుడు పిల్లల ప్రేమకు తల్లిదండ్రులు విలన్‌గా ఉండే వాళ్ళు. ప్రేమకు వాళ్ళు అంగీకారం తెలపకపోతేనే సమస్య. అయితే కాలం మారిపోయింది. ఇప్పుడు ప్రేమికుల మధ్య వచ్చిన గొడవలే ప్రేమకు విలన్స్‌గా మారుతున్నాయి అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశాం. ఒక అమ్మాయి చిన్నప్పటి నుంచి ఒకరిని ఇష్టపడుతుంది. అతనే ఆ అమ్మాయికి స్ఫూర్తిని ఇచ్చాడు. అలాంటి వ్యక్తి కాలగమనంలో వేరే క్యారెక్టర్ అయిపోయాడని తెలిస్తే ఆ అమ్మాయి పరిస్థితి ఏమిటి ? అనేది ఈ జనరేషన్‌కి నచ్చేలా ఉంటుంది. చాలా మంది జీవితాల్లో జరిగే కథ ఇది. సెకండ్ హాఫ్ బ్యూటీ ఏమిటంటే.. మూడు రోజుల్లో జరుగుతుంది. పెళ్లి నుంచి శోభనం మధ్యలో జరిగే లవ్ స్టోరీ రాశాం. ఇది చాలా కొత్తగా అనిపిస్తుంది. అందరికీ నచ్చుతుంది. రోహిత్, అపర్ణ లాంటి నటులు దొరకడం మా అదృష్టం. వేద చాలా మంచి ఆల్బమ్ ఇచ్చాడు. ఇందులో పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. ప్రస్తుతం ఒక ప్రాజెక్ట్ పై వర్క్ జరుగుతోంది. అలాగే ఒక వెబ్‌సిరిస్‌తోపాటు 'ఉస్తాద్ భగత్‌సింగ్'కి పని చేస్తున్నాను. నటుడిగా అవకాశాలు వస్తే చేస్తాను' అని అన్నారు.


దశరథ్

రొటీన్ సినిమా కాదు

విరాజ్ అశ్విన్, పాయల్ రాజ్‌పుత్, సిమ్రత్ కౌర్, రజత్ రాఘవ్ ప్రధాన పాత్రల్లో నటించిన స్మార్ట్ ఫోన్ థ్రిల్లర్ 'మాయా పేటిక'. రమేష్ రాపర్తి దర్శకత్వంలో జస్ట్ ఆర్డినరీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై మాగుంట శరత్ చంద్రా రెడ్డి, తారక్‌నాథ్ బొమ్మిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈనెల 30న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.

ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత శరత్ చంద్ర మాట్లాడుతూ, "థాంక్యూ బ్రదర్' సినిమాను అందరూ ఆదరించారు. ఇది మా రెండో సినిమా. ఇందులో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఎలిమెంట్స్ ఉంటాయి. రెగ్యులర్ రొటీన్ సినిమాలా ఉండదు' అని తెలిపారు. డైరెక్టర్ రమేష్ రాపర్తి మాట్లాడుతూ, 'ఇదొక సెల్ ఫోన్ కథ. మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ సినిమా. ఈ చిత్రంలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. పాటలు, కామెడీ ఇలా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. పాయల్ అందరి గుండెల్ని కొల్లగొడుతుంది' అని అన్నారు. 'నా మనసుకు నచ్చిన పాత్ర చేశా. ఆడియెన్స్‌కు నచ్చుతుందని ఆశిస్తున్నాను. గుణ బాలసుబ్రహ్మణ్యం సంగీతం ఈ సినిమాకు ప్రాణం పోసింది. సురేష్ కెమెరా వర్క్ బాగుంటుంది. శ్యామల, సునీల్ కాంబినేషన్ అందరినీ నవ్విస్తుంది. పాయల్ అందరినీ ఆకట్టుకుంటుంది' అని హీరో విరాజ్ అశ్విన్ చెప్పారు.


సిమ్రత్ కౌర్, విరాజ్ అశ్విన్

రంగు రంగుల చిలక..

తెలంగాణ పల్లె కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న మరో చిత్రం 'తురుమ్ ఖాన్‌లు'. స్టార్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్ పై శివకళ్యాణ్ దర్శకత్వంలో ఎండీ.ఆసిఫ్ జానీ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్‌ని శరవేగంగా జరుపుకుంటోంది. తాజాగా ఈ చిత్రం నుంచి తొలి సాంగ్ 'రంగు రంగుల చిలక..' పాటను దర్శకుడు త్రినాథరావు నక్కిన గ్రాండ్‌గా రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,"రంగు రంగుల చిలుక' పాటను సింగర్ మంగ్లీ అద్భుతంగా పాడారు. పాటతో పాటు సినిమా కూడా చాలా హిట్ కావాలని ఆశిస్తున్నా' అని తెలిపారు. 'పల్లెటూరు రివేంజ్ కామెడీ జోనర్‌తోపాటు మహబూబ్ నగర్ స్లాంగ్‌లో ఉన్న తొలి సినిమా ఇది. బలమైన కథ, సహజమైన పాత్రలతో చిత్రాన్ని క్వాలిటీగా మా దర్శకుడు శివకళ్యాణ్ తెరకెక్కించారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పారు.



ఉద్యమ కెరటాలు మొదలైంది



ఇంద్ర ఫిలిమ్స్ బ్యానర్‌పై పిడమర్తి రవీంద్ర దర్శకత్వం వహిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'ఉద్యమ కెరటాలు'. ఈ చిత్రంలో హీరోగా చందు రాగం, హీరోయిన్‌గా హాసిని, ప్రీతి సుందర్ నటిస్తున్నారు.ఈ చిత్ర పూజ కార్యక్రమం ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కాసర్ల శ్యామ్ యూనిట్ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'గోరేటి వెంకన్నతో కలిసి పాటలు రాయడం అదృష్టంగా భావిస్తున్నాను' అని చెప్పారు.

'తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన సినిమాకి పనిచేయడం గర్వంగా ఉంది. ఈ సినిమాకి మంచి పాటలు అందిస్తాను' అని సంగీత దర్శకుడు బోలె షావలి అన్నారు.

హీరో చందు రాగం మాట్లాడుతూ,'ఇలాంటి చారిత్రాత్మక సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాత పిడమర్తి రవీంద్రకి కృతజ్ఞతలు' అని తెలిపారు. 'ఈ జనరేషన్ యువతకి తెలంగాణ ఉద్యమ పోరాటాన్ని తెలియజేయడానికి ఈ సినిమాను నిర్మిస్తున్నాను. అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ సినిమా కచ్చితంగా మెప్పిస్తుంది' అని దర్శక, నిర్మాత పిడమర్తి రవీంద్ర అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భోలే షావలి, పాటలు: కాసర్ల శ్యామ్, గోరేటి వెంకన్న, డిఓపి : వెంకట్ హనుమ, గాయనీ గాయకులు: మధు ప్రియ, వరం, డాన్స్: గణేష్ మాస్టర్.

క్లిష్ట సమయంలో దేశాన్ని కాపాడిన మహానేత పీవీ

పీవీ జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

క్లిష్ట సమయంలో దేశాన్ని కాపాడిన మహానేత పీవీ నర్సింహారావు అని ముఖ్యమంత్రి కే చంద్రశేఖ రరావు కొనియాడారు. నాడు ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలాలే నేడు దేశ ప్రజల అనుభవంలోకి వచ్చాయని తెలిపారు. భారత మాజీ ప్రధాని పీవీ 102వ జయంతి సందర్భంగా బుధవారం ఆయన సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. స్థితప్రజ్ఞతతో భారతదేశాన్ని ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిపేందుకు పునాది వేసిన దార్శనికుడు అని గుర్తు చేశారు. 'దేశానికి మౌనంగా మేలు చేసిన భారత ప్రధాని పివి నర్సింహారావు' అని పేర్కొన్నారు. పలు సంస్కరణలతో భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడిన ఘనత తెలంగాణ బిడ్డ పీవీ నర్సింహారావుకే దక్కుతుందని తెలిపారు. వారి సేవలను సమున్నతంగా గౌరవించుకునే బాధ్యత మన మీద ఉన్నదని పేర్కొన్నారు. వారి గొప్పతనాన్ని గుర్తించుకునేందుకు వారి జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని వివరించారు. 'తెలంగాణ ఠీవి మన పీవీ' అని సీఎం పునరుద్ఘాటించారు. వారి స్ఫూర్తితో దేశాభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని సీఎం స్పష్టం చేశారు.

గాంధీభవన్‌లో...

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకుని బుధవారం గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, అనిల్‌కుమార్ యాదవ్, వినోద్‌కుమార్, కల్వసుజాత ఆయన సేవలను స్మరించుకున్నారు. పీవీ ఘాట్ వద్ద మాజీ ఎంపీ మల్లు రవి, నాయకులు హర్కర వేణుగోపాల్ నివాళులర్పించారు.

అసెంబ్లీలోనూ...

అసెంబ్లీలోని ఆయన నిలువెత్తు చిత్రపటానికి పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ దేశంలో అనేక సంస్కరణలు తెచ్చిన గొప్ప ప్రధాని పీవీ నరసింహారావు అని తెలిపారు. తన ఆలోచన విధానంతో దేశానికి మార్గాన్ని చూపారని చెప్పారు. ఆయన చూపిన ఆర్థిక సంస్కరణలు ఇప్పటికి దేశంలో అమలు అవుతున్నాయని కొనియాడారు. శాసనసభ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, పీవీ కూతురు ,ఎమ్మెల్సీ వాణి దేవి, ఎమ్మెల్సీ యల్.రమణ తదితరులు నివాళులర్పించారు.

నిర్వాసితులంతా ఐక్యంగా పోరాడాలి

- అదాని, అంబానీ సేవలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం: 'పోలవరం పోరుకేక'లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్

జీలుగుమిల్లి : పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి, ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి ప్రజల కోసం పని చేయాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదాని, అంబానీల సేవలో తరిస్తున్నదని, ఈ నేపథ్యంలో పరిహారం, ప్యాకేజీ, పునరావాసం వంటి సమస్యల పరిష్కారానికి పోలవరం నిర్వాసితులంతా ఐక్యంగా పోరాడాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్ పిలుపునిచ్చారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ(ఎం) చేపట్టిన పోలవరం పోరుకేక మహాపాదయాత్ర తొమ్మిదో రోజు బుధవారం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలోని కొత్త మామిడిగొంది నిర్వాసిత కాలనీ నుంచి ప్రారంభమైంది. బర్రింకలపాడు, వంకావారిగూడెం, మడకంవారిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం కాలనీల మీదుగా జీలుగుమిల్లి మండలంలోని కొరుటూరు కాలనీలకు చేరుకుని బస చేసింది. ఈ సందర్భంగా వంకావారిగూడెం, మడకంవారిగూడెం గ్రామాల్లో జరిగిన సభల్లో సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటించిందని గుర్తు చేశారు. నిధులు కేటాయించి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్య కేవలం ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న గిరిజనులు, గిరిజనేతరుల సమస్య మాత్రమే కాదనీ, ఇది జాతీయ సమస్య అని అన్నారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పన, నష్టపరిహారం అందజేతలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోందని, ప్రజలు సమస్యల కోసం పోరాడుతుంటే వారి మధ్య కులాలు, మతాల పేరుతో చీలికలు సష్టించి పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. కేవలం నిర్వాసితులకు పునరావాసం కల్పించడమే కాకుండా ఆ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కూడా కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు. ఇక్కడి ప్రజలకు పోరాటాలు చేసే స్ఫూర్తి, తమ హక్కులను కాపాడుకునే ధైర్యం ఉందని, వారికి ఎర్రజెండా సీపీఐ(ఎం) అండగా నిలుస్తుందని ప్రకటించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలాన్ని కేంద్రం ప్రయోగశాలగా మార్చాలని చూస్తోందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో మండలంలో గ్రామాలను ఖాళీ చేసి ఆయుధ ఫ్యాక్టరీని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అదాని ఆయుధ ఫ్యాక్టరీని మండల ప్రజలు తిప్పికొట్టాలన్నారు. జీలుగుమిల్లి మండలానికి గొప్ప పోరాట చరిత్ర ఉందన్నారు. అనేక భూపోరాటాల్లో రాటుదేలిన ప్రజలు మడకంవారిగూడెంలో ఉన్నారని అభినందించారు. పోరాట యోధులంతా తిరిగి ఎర్రజెండా పట్టుకోవడం అభినందనీయమన్నారు. భూపోరాటాల మాదిరిగానే ఆయుధ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడి తమ భూములు వదలబోమని తేల్చి చెప్పాలన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో మడకంవారిగూడెం, వంకావారిగూడెం తదితర ప్రాంతాలు నిర్వాసిత ప్రాంతాలుగా మారే అవకాశం ఉందన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల లక్షా ఐదు వేల కుటుంబాలు సర్వం కోల్పోతున్నాయని, అందుకే వారి హక్కుల కోసం ఈ నెల 20న నెల్లిపాక నుంచి ప్రారంభమైన మహాపాదయాత్ర దాదాపు 170 కిలోమీటర్లు పూర్తి చేసుకుని వంకావారిగూడెం చేరుకుందన్నారు. పోలవరం నిర్వాసితులకు అంతా సంఘీభావం ప్రకటించి అండగా నిలవాలని కోరారు.



పొలిటికల్ గేమ్!

- భారత క్రికెట్ కేంద్రంగా 'అహ్మదాబాద్'
- ప్రధాన మ్యాచులన్నీ మోడీ స్టేడియంలోనే..
- ప్రపంచకప్ వేదికలు, షెడ్యూల్‌పై విమర్శలు

అశ్రిత పక్షపాతంతో పరిశ్రమలు, పెట్టుబడులు, నిధుల కేటాయింపు.. ఇలా ఒకటేమిటి ప్రతిదీ గుజరాత్‌కు క్యూ కడుతోంది. తాజాగా ఈ జాబితాలోకి భారత క్రికెట్ సైతం చేరిపోయింది. ఐపీఎల్, జాతీయ జట్టు సిరీస్ సహా తాజాగా ప్రపంచకప్ మ్యాచులు సైతం అహ్మదాబాద్‌కు తరలిపోయాయి. ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో ప్రధాన మ్యాచులన్నీ అహ్మదాబాద్‌కే కేటాయించటం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నవతెలంగాణ క్రీడావిభాగం





ఐపీఎల్ 2022 ఫైనల్ వేదిక అహ్మదాబాద్. ఐపీఎల్ 2023 ఆరంభ మ్యాచ్ వేదిక అహ్మదాబాద్. ఐపీఎల్ 2023 టైటిల్ పోరుకు వేదిక అహ్మదాబాద్. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ఆరంభ వేడుకలు, ఆరంభ మ్యాచ్‌కు వేదిక అహ్మదాబాద్. వన్డే వరల్డ్‌కప్‌లో అత్యంత మెగా మ్యాచ్ భారత్, పాకిస్థాన్ పోరుకు వేదిక అహ్మదాబాద్. ఇక ప్రపంచ క్రికెట్ ఎదురుచూసే ప్రపంచకప్ ఫైనల్ పోరుకు వేదిక అహ్మదాబాద్. ఇలా చెప్పుకుంటూ పోతే.. ఇటీవల భారత క్రికెట్‌లో ప్రధాన మ్యాచులన్నీ పూర్తిగా అహ్మదాబాద్‌లోనే జరిగాయి. తాజాగా ఐసీసీ వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల కావటంతో.. అహ్మదాబాద్‌కు అప్పనంగా ప్రధాన మ్యాచులను కేటాయించటం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

అంతా అక్కడే..!

భారత క్రికెట్‌లో అత్యంత కీలక, ప్రధాన మ్యాచులకు ముంబయి, కోల్‌కత, చెన్నై, బెంగళూర్ సహా మొహాలి స్టేడియాలు వేదికలుగా నిలిచేవి. సంప్రదాయ క్రికెట్ అభిమానులకు ఆ నగరాలు కేంద్రాలు కావటం అందుకు ఓ కారణం. కానీ ఇటీవల కాలంలో భారత క్రికెట్‌కు ఏకైక చిరునామాగా నిలిస్తోంది అహ్మదాబాద్‌లోని మొతెరా (నరేంద్ర మోడి స్టేడియం) గ్రౌండ్. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్‌కు ఐపీఎల్ ఫ్రాంచైజీ వచ్చి రెండేండ్లు మాత్రమే కావస్తుంది. కానీ, అహ్మదాబాద్ అంతకుముందే ఐపీఎల్ ఫైనల్స్‌కు ఆతిథ్యం ఇచ్చింది. ఐపీఎల్‌లో వరుసగా మూడుసార్లు టైటిల్ పోరుకు వేదికగా నిలిచిన స్టేడియంగా రికార్డు సృష్టించింది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం డిఫెండింగ్ చాంపియన్ సొంత స్టేడియంలో ఆరంభ, తుది మ్యాచులు నిర్వహిస్తారు. రూల్స్ ప్రకారం 2023 ఐపీఎల్ ఆరంభ, ఫైనల్ మ్యాచులకు మాత్రమే అహ్మదాబాద్ ఆతిథ్యం అందించే హక్కులు ఉన్నాయి. కానీ 2022 ఐపీఎల్‌కు సైతం అహ్మదాబాదే వేదికగా నిలిచింది. అయినా, భారత క్రికెట్‌లో దీనిపై గళమెత్తేవారే కరువయ్యారు.

2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు భారత్ ఆతిథ్యం ఇస్తోండగా.. మంగళవారమే 100 రోజుల కౌంట్ డౌన్‌తో షెడ్యూల్ ప్రకటించారు. అహ్మదాబాద్‌లో ఐదు మ్యాచులు జరుగనుండగా.. అవి అన్ని ప్రధాన మ్యాచులే కావటం గమనార్హం. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు కోసం వందల కోట్ల అభిమానులు ఎదురు చూస్తారు. ఇక ప్రపంచకప్ ఆరంభ వేడుకలు, ముగింపు వేడుకలు సహా ఆరంభ, తుది మ్యాచ్‌ను సైతం ప్రపంచవ్యాప్తంగా క్రికెట్, క్రికెటే తర అభిమానులు ఆసక్తిగా చూస్తారు. అటువంటి కీలక మూడు మ్యాచులను అహ్మదాబాద్‌కే కేటాయించారు.

> 2023 ఐసీసీ ప్రపంచకప్ వేదికల నుంచి మొహాలిని తప్పించటం వెనుక రాజకీయ జోక్యం కనిపిస్తుంది. పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని బీసీసీఐలో ప్రశ్నించనుంది. అహ్మదాబాద్‌లోని మోడి స్టేడియంలో ఐదు మ్యాచులు, పక్కన ఉన్న ధర్మశాలలో ఐదు మ్యాచులు, ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలోనూ ఐదు మ్యాచులు షెడ్యూల్ చేశారు. కానీ మొహాలికి ఒక్క మ్యాచ్ దక్కలేదు. ఇందులో స్పష్టమైన రాజకీయ ఉద్దేశాలు కనిపిస్తున్నాయి'
>
> - గుర్మీత్ సింగ్, పంజాబ్ క్రీడాశాఖ మంత్రి

మొహాలికి మొండిచేయి

భారత క్రికెట్‌లో మొహాలి (పీసీఏ) స్టేడియానికి ఓ చరిత్ర ఉంది. 1996 ప్రపంచకప్, 2011 ప్రపంచకప్ సెమీఫైనల్స్‌కు మొహాలి వేదికగా నిలిచింది. 2016 టీ20 ప్రపంచకప్ భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్‌కు సైతం మొహాలి ఆతిథ్యం అందించింది. అయినా, మొహాలికి ఈసారి ప్రపంచకప్ వేదికల్లో చోటు దక్కలేదు. అందుకు రాజకీయ కారణాలే కారణమని పంజాబ్ క్రీడాశాఖ మంత్రి గుర్మీత్ సింగ్ ఆరోపించారు. గుర్మీత్ సింగ్ వ్యాఖ్యలపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్‌శుక్లా స్పందించారు. ఐసీసీ ప్రమాణాలకు అనుగుణంగా మొహాలి స్టేడియం లేనందునే ప్రపంచకప్ మ్యాచుల కేటాయింపు చేయలేదని వివరణ ఇచ్చాడు. నిర్మాణంలో ఉన్న నూతన స్టేడియం అందుబాటులోకి వస్తే కచ్చితంగా ప్రపంచకప్ మ్యాచుల కేటాయింపు దక్కేదని అన్నారు.

జై షా 'చక్రం'

భారతీయ జనతా పార్టీ అగ్రనేత, కేంద్ర మంత్రి అమిత్ షా కుమారుడు జై షా వరుసగా రెండోసారి బీసీసీఐ కార్యదర్శి పదవిలో కొనసాగుతున్నారు. జై షా వరుసగా రెండోసారి పదవిలో కొనసాగేందుకు జస్టిస్ లోధా కమిటీ సిఫారసులను సైతం సవరించారు. జై షా కనుసన్నల్లో బీసీసీఐ పని చేస్తున్నప్పటి నుంచీ మ్యాచుల కేటాయింపులో గుజరాత్‌కు అగ్ర తాంబూలం దక్కుతుందనే విమర్శ బలంగా వినిపిస్తోంది. ఐపీఎల్, ద్వైపాక్షిక సిరీస్‌లు సహా తాజాగా ప్రపంచకప్ షెడ్యూల్‌లోనూ అహ్మదాబాద్‌కు లభించిన ప్రాధాన్యత కనిపిస్తూనే ఉంది. గతంలో ప్రధాన మ్యాచులను ముంబయి, కోల్‌కత, చెన్నై, మొహాలి నగరాల్లో సమ ప్రాధాన్యంగా నిర్వహించగా.. ఇప్పుడు ఏకమొత్తంగా అన్ని మ్యాచులను అహ్మదాబాద్‌లోనే నిర్వహిస్తున్నారు.

2 నుంచి జాతీయ స్విమ్మింగ్ పోటీలు

- ప్రారంభించనున్న క్రీడా మంత్రి, శాట్స్ చైర్మెన్

నవతెలంగాణ, హైదరాబాద్

హైదరాబాద్ మరో జాతీయ స్థాయి స్పోర్ట్ ఈవెంట్‌కు వేదికగా నిలువనుంది. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియం ఆవరణలోని ఈత కొలనులో జులై 2 నుంచి జాతీయ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్స్ జరుగనున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు బుధవారం వెల్లడించారు. 76వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. 'ఈతకొలనులో తెలంగాణ స్విమ్మర్లు ఇటీవల వరుసగా పతకాలు సాధిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నది. వయసుతో నిమిత్తం లేకుండా స్విమ్మింగ్‌ను అందరూ నేర్చుకోవాలని' శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు.

నాలుగు రోజుల పాటు సాగే జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో..42 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. జాతీయ స్థాయిలో 500 మంది స్విమ్మర్లు, 100 మంది అధికారులు పాల్గొననుండగా.. తెలంగాణ రాష్ట్రం నుంచి 22 మంది స్విమ్మర్లు (11 మెన్, 11 ఉమెన్) పోటీపడనున్నారు. జులై 2న పోటీలను షురూ కానుండగా.. క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్‌లతో కలిసి తెలంగాణ స్విమ్మింగ్ సంఘం ఆఫీస్ బేరర్లు జాతీయ స్థాయి చాంపియన్‌షిప్స్‌ను ఆరంభించనున్నారు.



డిసిల్టింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



డిసిల్టింగ్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం గోల్నాక డివిజన్ పరిధిలోని లక్ష్మీ థియేటర్ లైన్‌లో డిసిల్టింగ్ పనులను పరిశీలించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాళాలు నిండిపోకుండా నాళాలు క్లీన్‌గా ఉండాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో జులై 21, 22 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సెమినార్ బ్రోచర్‌ను ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బుధవారం ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.లింబాద్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్, నేషనల్ సెమినార్ కన్వీనర్ ప్రొ.అరుణజ్యోతి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగధిపతి, సెమినార్ కో - కన్వీనర్ ప్రొ.బాలబ్రహ్మ చారి, పరిశోధక విద్యార్థులు కిరణ్‌కుమార్, హర్షవర్ధన్ రాజు, పాల్గొన్నారు. పూర్తిస్థాయి ఉన్నత విద్యమండలి చైర్మన్‌గా నియామకం అయినందుకు మర్యాదపూర్వకంగా ప్రొ.లింబాద్రిని కలసి శుభాకాంక్షలు తెలిపిన పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్స్.

వార్డు కార్యాలయాలపై అవగాహన కల్పించాలి

- **జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలు అంశాలకు ఆమోదం**

నవతెలంగాణ-సిటీబ్యూరో



జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో 18 అంశాలకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బక్రీద్‌ను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. బక్రీద్ సందర్భంగా నగరంలో రోడ్లు, మజీద్‌లను శుభ్రం చేయాలనీ, రోడ్లపై పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్‌లను ఆదేశించారు. కొత్తగా ఏర్పాటైన వార్డు ఆఫీస్ కార్యాలయాల అధికారులు పబ్లిక్ గ్రీవెన్స్‌ను స్వీకరించి నిర్ణీత కాలంలో పరిష్కరించేలా జోనల్ కమిషనర్లు పర్యవేక్షించాలని తెలిపారు. వార్డు కార్యాలయాలపై కార్పొరేటర్లు స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ డి.ఎస్.లోకేష్ కుమార్, ఇ.వీ.డీ.ఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు సరోజ, విజయలక్ష్మి, జయరాజ్ కెనడి, సీసీపీ దేవేందర్ రెడ్డి, జోనల్ కమిషనర్లు పంకజ, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, మమత, సామ్రాట్ అశోక్, శంకరయ్య పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందిన అంశాలు

1.సనత్‌నగర్ సర్కిల్ దాసారం బస్తీ వార్డు నెంబర్ 100లో రూ.600 లక్షలతో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ (కన్వెన్షన్ హాల్) నిర్మాణానికి గతంలో స్టాండింగ్ కమిటీలో చేసిన తీర్మానం నేపథ్యంలో పాన్ బజార్ బేగంపేట్ సర్కిల్, రామ్ గోపాల్ పేట్‌లో గల జీహెచ్ఎంసీకి చెందిన ఓపెన్ ప్లేస్‌లో స్థలం మార్పు చేసి 450 గజాల్లో రూ.490 లక్షల రివైజ్డ్ అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టేందుకు కమిటీ ఆమోదం తెలిపింది.

2.కల్పతరువు రెసిడెన్సీ నుంచి తిరుమల కాన్వెంట్ స్కూల్ వరకు (కారిడార్ 2 మిస్సింగ్ లింక్ రోడ్డు నుంచి భరత్ నగర్ ఆర్ ఓ.బీ నుంచి హైటెక్స్ రోడ్డు నుంచి వయా మోతినగర్ బోరబండ, మల్లాపూర్) వరకు 30 ఫీట్ల రోడ్డు వెడల్పు కోసం 306 ఆస్తుల సేకరణ కోసం కమిటీ ఆమోదం లభించింది.

3.ఎయిర్ పోర్ట్ రోడ్డు నుంచి వయా సిటడెల్ హోటల్, కన్వెన్షన్ మీదుగా దివ్యశక్తి ప్రయివేట్ లిమిటెడ్ రోడ్డు వెడల్పు, రాజేంద్రనగర్ మండలం గగన్ పహాడ్ గ్రామంలో 15 ఆస్తుల సేకరణకు ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు కమిటీ ఆమోదం లభించింది.

4.రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా బొల్లారం వద్ద ఆర్.ఓ.బీ నిర్మాణంతో పాటు కొంపల్లి నుంచి స్టీవర్ట్ రోడ్డు వరకు వయా బొల్లారం నుంచి కలవరి స్టేషన్ రోడ్డు విస్తరణ, బొల్లారం కలవరి స్టేషన్ నుంచి స్టీవర్ట్ రోడ్డు వరకు చేపట్టే రోడ్డు స్ట్రెచ్‌కు 106 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం లభించింది.

5.బల్కంపేట్ నుంచి వయా నేచర్‌క్యూర్ హాస్పిటల్ మీదుగా అమీర్‌పేట్ లాల్ హౌస్ బంగ్లా, శ్యామ్ కరణ్ వరకు 18 మీటర్ల రోడ్డు విస్తరణకు 136 ఆస్తుల సేకరణ కోసం స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

6.గాజుల రామారం సర్కిల్ చింతల్ ఐడీపీఎల్ క్రాస్ రోడ్డు వద్ద పురపాలక పట్టణ అభివృద్ధి సంస్థ గతంలో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారంగా నిర్వహణ ఇతర స్పెసిఫికేషన్‌కు సంబంధిన మార్గదర్శకాలకు అనుగుణంగా అర్బన్-లూ సంస్థ సీఎస్ఆర్ పద్ధతి ద్వారా మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టి 14 ఏండ్లు నిర్వహణ కోసం, సులబ్ ఇంటర్నేషనల్ సోషల్ ఆర్గనైజేషన్ అనుసరించిన యూజర్ చార్జెస్ వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు జీహెచ్ఎంసీ తరపున జోనల్ కమిషనర్ కూకట్‌పల్లికి ఒప్పందం చేసుకొనుటకు కమిటీ ఆమోదం.

7.సికింద్రాబాద్ జోన్‌లో 4 ప్రదేశాల్లో, బషీర్‌బాగ్ విజయ జ్యువలరీస్ ఎదురుగా, 2. వైఎంసీఏ, నారాయణగూడ, చే నంబర్ జంక్షన్, మోండా మార్కెట్ వద్ద ఓల్డ్ జైల్ పార్కింగ్ ఎదురుగా మల్టీ పర్పస్ పబ్లిక్ ఫ్రెష్ రూమ్‌ల నిర్మాణం, ఆపరేషన్, మెయింటేన్‌ను సీఎస్ఆర్ పద్ధతి ద్వారా చేపట్టి వాటిని 14 ఏండ్ల పాటు నిర్వహణ కోసం కమిటీ ఆమోదం తెలిపింది.

8.శేరిలింగంపల్లి జోన్‌లో కొండాపూర్, మియాపూర్ సీ.ఎస్.ఆర్ పద్ధతిలో 14 ఏండ్ల నిర్వహణ మల్టీ పర్పస్ పబ్లిక్ ఫ్రెష్ రూం నిర్మాణానికి అర్బన్-లూ సంస్థతో ఒప్పందం చేసుకునేందుకు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు అధికారం ఇస్తూ కమిటీ ఆమోదం తెలిపింది.

9.ఎల్బీనగర్ జోన్‌లో ఉప్పల్ సర్కిల్, సరూర్‌నగర్ సర్కిల్, కొత్తపేట్, వనస్థలిపురంతోపాటు తదితర సర్కిల్స్‌లో అభివృద్ధి పనులకు, సిగ్నల్స్ మరుగు దొడ్ల నిర్మాణం, నిర్వహణ కోసం కమిటీ ఆమోదం తెలిపింది.

10.చార్మినార్ జోన్‌లో నల్గొండ ఎక్స్ రోడ్డు, కంచన్ బాగ్, చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ దగ్గర 3 ప్రదేశాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి సీఎస్ఆర్ పద్ధతి ద్వారా నిర్మాణాలతోపాటు నిర్వహణకు అనుమతించారు.

11.చార్మినార్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, మదీనగూడతోపాటు అన్ని జోన్లలో శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి మోడల్ వార్డు కార్యాలయాలు, రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు చేసుకునే విధంగా కమిటీ ఆమోదం తెలిపింది.

12.హబీబ్ నగర్ నుంచి రియ సాత్ నగర్ వరకు జంక్షన్ వరకు ప్రతిపాదిత 40 ఫీట్ల రహదారి వెడల్పు కోసం రూ.270 లక్షలతో పరిపాలన అనుమతికి కమిటీ ఆమోదం తెలిపింది.

13.లిటిల్ బర్డ్ స్కూల్ ఎదురుగా ఉన్న రోడ్డు బండ్లగూడ నుంచి ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ శ్రీశైలం హైవే మెయిన్ రోడ్డు వరకు 12 - 18 మీటర్ల రోడ్డు వెడల్పు పని కోసం 137 ఆస్తుల సేకరణ కోసం కమిటీ ఆమోదం లభించింది.

రాష్ట్ర విద్యా రంగంలో అనూహ్య మార్పులు

- **ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.లింబాద్రి**



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర విద్యా రంగంలో అనూహ్య మార్పులు వచ్చాయని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.లింబాద్రి అన్నారు. గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ-2023 మూడు రోజుల నుంచి మధ్య "భారతదేశంలో సామాజిక సమూహాల అభివృద్ధి అండ్ సాధికారత: తెలంగాణ రాష్ట్రం నుంచి పాఠాలు" అనే అంశంపై మూడు రోజుల జాతీయ సెమినార్ బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.ఆర్.లింబాద్రి, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ఓయూ సీనియర్ ప్రొ.పి.లక్ష్మీనారాయణ, ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ గౌరవ సంచాలకులు ప్రొ.బి.సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ రాష్ట్ర విద్యారంగంలో పదేండ్లలో అనూహ్య మార్పులు జరిగాయన్నారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. జాతీయ సగటుతో పోల్చితే విద్యారంగంలో తెలంగాణ మెరుగైన స్థానాన్ని సాధించిందని స్పష్టం చేశారు. ఆడపిల్లలకు విద్యనందించేందుకు 85 రెసిడెన్షియల్ కాలేజీలు ఉన్నాయని గొప్పగా చెప్పుకునే ఏకైక రాష్ట్రం మనదే అన్నారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లోని పీజీ కోర్సుల్లో 70 శాతానికి పైగా బాలికలే ఉన్నారని వివరించారు. దోస్త్ ద్వారా ఆన్‌లైన్ డిగ్రీ అడ్మిషన్‌ను ఒకసారి నమోదు చేయడం ద్వారా 1040 కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులకు ప్రవేశం కల్పించే ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. విద్యలో యాక్సెస్, ఈక్విటీ, నాణ్యత, అనేక ఇతర పారామితులు ఇటీవలి సంవత్సరాల్లో బలోపేతం అయ్యాయని గుర్తు చేశారు. సామాజిక శాస్త్రాల అధ్యయన కేంద్రం ఐసీఎస్ఎస్ఆర్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో సామాజిక అంశాల అధ్యయనానికి అందించిన సహకారాన్ని రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీనారాయణ ప్రశంసించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎంఇ) విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ ఇండియాస్ ఎన్విరాన్‌మెంట్ 2023' నివేదికను ఉటంకిస్తూ, అటవీ విస్తీర్ణంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. తెలంగాణ వివిధ సామాజిక-ఆర్థిక పారామితులపై అద్భుతంగా పని చేస్తోందని సంతోషం వ్యక్తం చేసిన ఆయన సామాజిక సమస్యల పరిష్కారానికి నాణ్యమైన పరిశోధనలు అందించాలని పరిశోధకులను కోరారు. ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగస్వామ్యమైన వారందరికీ ప్రొ.బి.సుధాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. మధ్యప్రదేశ్, కర్నాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, హర్యానా, న్యూఢిల్లీ నుంచి 25 మంది పేపర్ ప్రజెంటేషన్స్ తమ పరిశోధన పత్రాలను సదస్సులో సమర్పించారు.

జంతు వ్యర్థాలను వీధుల్లో పారవేయొద్దు

- **నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత**

నవతెలంగాణ-ఓయూ



జంతు వ్యర్థాలను బయట పారవేయొద్దని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత సూచించారు. బక్రీద్ సందర్భంగా తార్నాకలోని తమ క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి ముస్లిం సోదరీ సోదరులకు కవర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో సామరస్యంగా జరుపుకోవాలన్నారు. జంతువుల వ్యర్థాలను కవర్లలో వేసి చెత్త సేకరణ కోసం వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు. ఎలాంటి వ్యర్థాలనూ డ్రయినేజీలు, వీధుల్లో పారవేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కామ్రేడ్ గోవింద్ సేవలు మరువలేనివి : నాగేశ్వర్

నవతెలంగాణ-ధూల్‌పేట్



కామ్రేడ్ గోవింద్ సేవలు మరువలేనివని సీపీఐ(ఎం) గోషామహల్ నాయకులు పి.నాగేశ్వర్ అన్నారు. గోషామహల్ జోన్ రిక్షా కార్మిక (సీఐటీయూ) నాయకుడు కామ్రేడ్ కే.గోవింద్ బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు అనారోగ్యంతో చనిపోయాడు. విషయం తెల్సుకున్న సీపీఐ(ఎం) హైదరబాద్ సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.నాగేశ్వర్, కార్మిక నాయకులు ఎస్.వెంకటేష్ అక్కడికి చేరుకున్నారు. అంబులెన్స్ దేవినగర్, జుమ్మెరాత్ బజార్‌కి చేరుకోగానే అమర్ హై ! కామ్రేడ్ కే.గోవింద్ అమర్ హై!! అమర్ హై!!! అనే నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఆయన అకాల మరణంతో ఆ బస్తీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి వారు గోవింద్ పార్థివ దేహంపై ఎర్ర జెండా కప్పి పూలమాల వేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన స్థానిక బస్తీవాసుల సమక్షంలో ఘనంగా జోహార్లర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా దేవి నగర్ పార్టీ శాఖా కార్యదర్శి కె.రాజు అధ్యక్షతన స్థానిక రవి హోటల్ చౌరస్తా లో జరిగిన సంతాప సభలో నాగేశ్వర్ మాట్లాడారు. కామ్రేడ్ గోవింద్ బస్తీలో నీటి సమస్య పరిష్కారానికి ఎనలేని కృషి చేశారన్నారు. గోషామహల్ జోన్ ఆఫీస్ కార్యదర్శిగా సేవలందించారాన్నారు. ఆయన మృదు స్వభావిగా ఉంటూ ప్రజా సమస్యలపై వెంటనే స్పందించే వ్యక్తి అన్నారు. గోవింద్ అంటే ఎందరికో అభిమానమని గుర్తు చేశారు. 54 ఏండ్లకే ఆయన పక్షవాతానికి గురై, కిడ్నీ సంబంధ సమస్యలతో ప్రాణం కోల్పోవటం చాలా విచారకరంగా ఉన్నదన్నారు. ఆయన ఆశయ సాధన కోసం మరింత పట్టుదలగా ప్రజలకు సేవలందించడమే ఆయనకు మనం అర్పించే నివాళి అని పేర్కొన్నారు. ఈ సంతప సభాలో ఆయన కుమారుడు కే.సంజీవ, స్థానిక కార్యకర్తలు కే.చిన్నరాజు, జి.జహంగీర్, జి.భాగ్య, కృష్ణ,, రవి, చంద్రకళ, గోపాల్, రాజయ్య, కే.ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఎండీ అబ్దుల్ ఫరీద్‌కు ఓయూ డాక్టరేట్

నవతెలంగాణ-ఓయూ



సిద్దిపేట జిల్లా, లద్నూర్ వాసి ఎండీ.అబ్దుల్ ఫరీద్‌కు ప్రతిష్టాత్మక ఓయూ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఫిలాసఫీ విభాగంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ఉన్నత విద్యామండలి మాజీ వైస్ చైర్మన్ ప్రొ.మల్లేశం సంకసాల పర్యవేక్షణలో "ఫిలసాఫికల్ ఇంప్లికేషన్స్ ఆఫ్ ప్రొఫెషనల్ ఎథిక్స్ : ఎ క్రిటికల్ స్టడీ" అనే అంశం పైన పరిశోధన పూర్తి చేసినందుకుగాను ఓయూ ఈ డాక్టరేటును ప్రకటించింది. ఉపాధ్యాయ వృత్తి పరమైన నీతి, న్యాయ పరమైన నీతి, వైద్య సంబంధ నీతి, వాణిజ్య నీతి, పాత్రికేయ నీతి అనే అంశాలపై విమర్శనాత్మక ఉత్తమ పరిశోధన చేశారు. పరిశోధకుడు అబ్దుల్ ఫరీద్ వివిధ విభాగాల్లో మొత్తం ఐదు పీజీలు చేసిన విద్యాధికుడు. బీఈడీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన అనుభవం ఉన్నది. తెలంగాణ బీఈడీ లెక్చరర్ అసోసియేషన్ అధ్యక్షులుగా పని చేస్తున్నారు. అల్ప సంఖ్యాక కుటుంబం నుంచి వచ్చి ఎన్నో అవరోధాలను అధిగమించి, నిరంతరం శ్రమించి డాక్టరేట్ పట్టా పొందిన ఫరీద్‌కు ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థి మిత్రులు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పరిద్ మాట్లాడుతూ సాధారణ ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రారంభమైన తన విద్యా ప్రస్తానంలో తనను అనునిత్యం ప్రోత్సహించిన గురువులు, ప్రొఫెసర్లు, వెన్నంటే ఉండి సహకరించిన కుటుంబ సభ్యులు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మాణంలో ఉన్న నాలా పనులను వెంటనే పూర్తి చేయాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీ బాబానగర్‌లో నిర్మాణంలో ఉన్న నాలా పనులను వెంటనే పూర్తి చేయాలని చాంద్రాయణగుట్ట గుట్ట సీఐటీయూ కార్యదర్శి ఎస్.కిషన్ డిమాండ్ చేశారు. సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నాలాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలా పనులను పూర్తి చేయడంలో ఆలస్యం చేయడంతో ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందనీ, రహదారిపై ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్‌లకు రక్షణ రంగ సంస్థలు ఆ ప్రాంతంలో ఉండటం వల్ల అటు ఉద్యోగులు, ప్రజలు, అనునిత్యం ట్రాఫిక్ జామ్ వల్ల ఇబ్బందులు, నష్టం వాటిల్లిందన్నారు. ఉద్యోగులు సరైన సమయంలో పంచ్ చేయని పరిస్థితులు ఏర్పడినట్టు ఉద్యోగులు వాపోతున్నరని తెలిపారు. ఇప్పటికే 11 నెలలు గడుస్తున్నా నాలా పనులు పూర్తికాకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇది ముమ్మాటికీ జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యమే అన్నారు. ఇప్పటికైనా ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని నాలా పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



బీసీ వసతి గృహాల్లో ఆన్‌లైన్ అడ్మిషన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి

నవతెలంగాణ-అడిక్‌మెట్

రాష్ట్రవ్యాప్తంగా బీసీ ప్రీ మెట్రిక్ పోస్టు, మెట్రిక్ 703 హాస్టళ్లకు ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని సత్యనగర్ కమిటీ హాల్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న బీసీ సంక్షేమ హాస్టల్లో ప్రత్యేకంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ అడ్మిషన్ ద్వారా విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కుల్లో భాగంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఉద్యమ పోరాటాల ఫలితంగా బీసీ సంక్షేమ హాస్టళ్లను గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాంటి సంక్షేమ హాస్టల్‌ళ్లను ఇప్పుడున్న ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తూ నిర్వీర్యం చేసే విధంగా ఈ ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ ఆన్‌లైన్ దరఖాస్తులు చేసేందుకు ఇంటర్నెట్ మీసేవా, మండల కార్యాలయాల చుట్టూ దరఖాస్తులు చేసుకునేందుకు తిరుగుతున్నారన్నారు. నెట్ సెంటర్లలో సర్వర్లు డౌన్ అయ్యి సహకరించక వారికి సర్టిఫికెట్లు అందక విద్యార్థులు వారి తల్లిదండ్రులు అల్లాడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు లేని ఆన్‌లైన్ విధానాన్ని ఒక్క బీసీ విద్యార్థులకు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. పాత పద్ధతి ద్వారానే అడ్మిషన్లు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, గ్రేట్ హైదరాబాద్ అధ్యక్షులు భూపేష్ సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల సుధాకర్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌ను రెగ్యులర్ చేయాలని ఓయూలో బతుకమ్మ

నవతెలంగాణ-ఓయూ



తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాటలు పాడారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఓయూ జేఏసీ చైర్మెన్ డాక్టర్ ఎ.పరుశరాం మాట్లాడుతూ కాంట్రాక్టు జేఎల్‌డీఎల్‌లను రెగ్యులరైజ్ చేసిన విధంగానే రాష్ట్రవ్యాప్తంగా 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని పలు యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేశారని గుర్తు చేశారు. డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని బతుకమ్మ పండుగను నిర్వహిస్తారన్నారు. కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయడం ద్వారానే తమకు సుఖ సంతోషాలు వస్తాయని తెలిపారు. డాక్టర్ శైలజా రెడ్డి మాట్లాడుతూ ఏండ్లుగా యూనివర్సిటీల్లో బోధన పరిశోధన రంగాల్లో పనిచేస్తూ సేవలందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ చొరవ చూపి తమ సర్వీసులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. లేనిపక్షంలో తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జేఏసీ కన్వీనర్ బి.ధర్మతేజ పాల్గొన్నారు.

అర్హులందరూ రేషన్, హెల్త్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

అర్హులందరా రేషన్ కార్డు, హెల్త్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ కార్యాలయంలో నూతన రేషన్ కార్డు, హెల్త్ కార్డుల ఉచిత దరఖాస్తు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి సందర్భంగా వారు మాట్లాడారు. అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకులు రామారావు యాదవ్, రాగుల ప్రవీణ్ పటేల్, రంగు సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

లంబాడీల చారిత్రక నవల 'మలాణ్' పుస్తకం ఆవిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్‌లో మాజీ ఎంపీ ప్రొ.సీతారాం చేతుల మీదుగా మలాణ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కన్నడంలో డాక్టర్ శాంతా నాయక్ రచించిన 'మలాణ్' పుస్తకాన్ని తెలుగులో రంగనాథ రామచంద్రరావు అనువదించారు. విస్లావత్ లాలునాయక్ మెమోరియల్ నాలెడ్జ్ సెంటర్ ద్వారా ప్రచురించబడిన ఈ పుస్తకాన్ని సీతారాం నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కన్నడంలో ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ నవల తెలుగులో అనువదించబడటం చాలా గొప్ప విషయమన్నారు. ఈ నవల బంజారాల సంస్కృతి సాంప్రదాయాలను, బంజారాల బతుకును అత్యద్భుతంగా చిత్రించిన నవల అనీ, తెలుగులో కూడా ఈ నవల మంచి ఆదరణ పొందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఏబీఎస్ జాతీయ అధ్యక్షులు మాజీ మంత్రి అమర్సింగ్ తిలవత్ మాట్లాడుతూ బంజరా సంస్కృతిని తెలియజేసే పుస్తకాలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ బట్టు రమేష్ భాషా సంస్కృతి నాలుగు కాలాలపాటు నిలబడాలంటే ఇలాంటి నవలలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఓయూ తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ప్రొ.సూర్య ధనంజయ్ మాట్లాడుతూ బంజరా భాషలో వచ్చిన తండా నవల తర్వాత అంత గొప్పగా రాయబడిన నవల ఈ మలాణ్ అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొ.గోనా నాయక్ ఈ పుస్తకాన్ని సమూలంగా విశ్లేషించారు. ఓయూ పొలిటికల్ సైన్స్ శాఖ అధ్యక్షులు ప్రొ.ఆర్.చంద్రు నాయక్, విశ్రాంత కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ధనుంజయ నాయక్ పుస్తకంలో ఉన్న లోటుపాట్లను కూలంకషంగా వివరించారు. విస్లావత్ లాలు నాయక్ మెమోరియల్ నాలెడ్జ్ సెంటర్ చైర్మన్, ఇఫ్లూ ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ రాజునాయక్, ఈ పుస్తక మూల రచయిత డాక్టర్ శాంతా నాయక్, నిజాం కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ భూక్యా రాజారాం నాయక్, యువ రచయిత రమేష్ కార్తీక్ నాయక్, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఐమాక్స్ థియేటర్ ఎదురుగా నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లకు మున్సిపల్ నెంబర్లను కేటాయించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్‌ను ఆయన కార్యాలయంలో ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. నవతెలంగాణ-బంజారాహిల్స్

ముస్లింలు ఇబ్రాహీం ప్రవక్త త్యాగ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

నవతెలంగాణ-ధూల్‌పేట్



ముస్లింలు ఇబ్రాహీం ప్రవక్త త్యాగ స్ఫూర్తిని అలవర్చుకోవాలని జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ ముహమ్మద్ ఖాలిద్ ముబష్షిర్ జఫర్ అన్నారు. పండగ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త ఇబ్రాహీం జ్ఞాపకార్థం జరుపుకునే బక్రీదు పండుగ త్యాగ స్ఫూర్తిని ప్రతి ముస్లిం అలవర్చుకోవాలని తెలిపారు. ఖుర్బానీ అంటే కేవలం జంతువును వధించడమే కాదనీ, మన మనోవాంఛలన్నింటినీ వధించడమే అసలైన ఖుర్బానీ అని ఆయన పేర్కొన్నారు. త్యాగస్ఫూర్తిని అలవర్చుకున్నప్పుడే ముస్లిములు ఎదుర్కొంటున్న అభద్రతాభావం, అన్ని రకాల భయాందోళనల్ని జయించవచ్చని ఆయన చెప్పారు. వేల ఏండ్ల క్రితం ప్రవక్త ఇబ్రాహీం, ఇస్మాయిల్ (అలైహి)లు అల్లాహ్ పట్ల చూపిన విధేయత, త్యాగాలను అల్లాహ్ చిరస్మరణీయంగా మార్చారని డాక్టర్ ఖాలిద్ జఫర్ గుర్తు చేశారు.



ప్రజాఏక్తా పార్టీకి హాలీవుడ్ నటుడు చరణ్ మద్దతు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రతిభావంతులైన కళాకారులు, నటులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. తెలుగు, తమిళ, కన్నడ సినిమాలతో పాటు తాజాగా హాలీహుడ్ చిత్రంలో నటిస్తున్న నటుడు చరణ్ బోనాల శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు. బుధవారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బోనాల శ్రీనివాస్ చరణ్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా ఏక్తా పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మణికంఠ శర్మ, రేసుకుంట్ల ముకేష్ మేరు, మిద్దెల నరేష్ గౌడ్, శ్రీను దాసరి, తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి బొంతు రామ్మోహన్ పరామర్శ



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గ డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యుడు సందీప్ సుభాష్ గాడే అనారోగ్యంతో సోమాజిగడలోని అశ్విన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ వెంటనే హాస్పిటల్ వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్యం గురించి డాక్టర్‌తో మాట్లాడి మంచి వైద్యం అందించాలని కోరారు. సుభాష్ గాడేను అన్ని విధాలుగా ఆదుకుంటామని బొంతు రామ్మోహన్ అన్నారు. వారితోపాటు మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

'సనతనగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం'



నవతెలంగాణ-బేగంపేట్

సనత్‌నగర్ నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, స్టీల్ కన్జ్యూమర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ మెంబర్ కల్లూరి విజయవర్ధన్ నాయుడు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత 3 దశబ్దాలుగా ప్రజలకు సేవ చేయాలనే ధ్యేయంతో రాజకీయాలలోకి వచ్చామనిచెప్పారు.ఎ ార్టీ ఆదేశిస్తే సనతనగర్ నియోజవర్గం నుంచి బరిలో ఉంటానన్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి,కెవిపి రామచందర్ రావులు తనకు అండగా ఉన్నారని చెప్పారు. నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను సమన్వయం చేసుకొని పార్టీ బలోపేతానికి తాను కృషి చేస్తానని వెల్లడించారు.

రాష్ట్రపతి రాక నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జులై 4వ తేదీన హైదరాబాద్ పర్యటన సందర్భంగా ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఈ విషయంలో చేపట్టాల్సిన చర్యలపై ముందస్తుగానే ప్రణాళికబద్ధంగా అన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఎలాంటి అశ్రద్ధ వహించకుండా పర్యటన విజయవంతంగా జరిగేలా కృషి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులతో మందస్తు సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జులై 4న హకీంపేట విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకుంటారని తెలిపారు. రాష్ట్రపతి రాక నేపథ్యంలో రోడ్ల మరమ్మతులు, బారికేడింగ్ చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసమూర్తిని కలెక్టర్ ఆదేశించారు. పటిష్ట బందోబస్తు చేపట్టాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు. అలాగే విద్యుత్తు సరఫరా నిరంతరం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని, వైద్య అధికారులను అందుబాటులో ఉంచడంతో పాటు మెడిసిన్స్ కూడా ఉంచాల్సిందిగా కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్ కు సూచించారు. పారిశుధ్యం విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకొని ఎక్కడ కూడా పారిశుధ్యానికి సంబంధించిన సమస్యలు రాకుండా ముందస్తుగానే అవసరమైన చర్యలను తీసుకొని మంచి వాతావరణం ఉండేలా చూడాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్‌కు తెలిపారు. అలాగే రాష్ట్రపతికి సంబంధించి ప్రొటోకాల్ అనుసరించి ఏవిధమైన లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రపతి వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్ళే వరకు హకీంపేట ఎయిర్‌పోర్టులో అన్ని రకాల ఏర్పాట్లు, జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీనివాసమూర్తి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్, కీసర ఆర్డీవో రవి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు రహిత నగరంగా తీర్చిదిద్దుతాం



- మేయర్ మేకల కావ్య
- భూగర్భ డ్రయినేజీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్‌నగర్‌ను మురుగు రహిత నగరంగా తీర్చిదిద్దుతామని మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కార్పొరేషన్ లోని 3వ డివిజన్ కార్పొరేటర్ బల్లి రోజా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 10లక్షలతో కేఎస్ఆరాకాలనీలో భూగర్భ డ్రయినేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లో ప్రగతి పనులు ఉరకలెత్తుతున్నాయని, గత ప్రభుత్వాల హయంలో అభివద్ధి నోచుకోలేదని, తెలంగాణ ప్రభుత్వంలోనే జవహర్ నగర్ అభివృద్ధి మారుపేరుగా మారుతుందని అన్నారు. కులవత్తులను కాపాడి ఉపాధి కల్పించిన మహానుభావుడు సీఎం కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నంగునూరి అశోక్, సిద్దులుయాదవ్, బండకింది ప్రసాద్ గౌడ్, సోమయ్య, వెంకటేష్, శ్రీనివాస్, ప్రభాకర్, కిరణ్, జనార్ధన్, శ్యామల, అనిత, అరుణ, రాజియబేగం, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500 లకే గ్యాస్ సిలిండర్

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంకా రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని ఆ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. బుధవారం మౌలాలి డివిజన్ పరిధిలోని ఎంజే కాలనీలో కాలనీలో 'కాలనీ నేస్తం - కాంగ్రెస్ హస్తం' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇంట్లో అర్హులైన ఇద్దరికి కలిపి రూ. 5000 ఫించన్ అందిస్తామన్నారు. అర్హులైన పేదల ఇంటి నిర్మాణానికి రూ 5 లక్షలు అందించడంతో పాటు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగులకు రూ. 4000 ల నిరుద్యోగభతి అందిస్తామని చెప్పారు. కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ ఉమామహేశ్వరి యాదవ్, డివిజన్ అధ్యక్షుడు వంశీ ముదిరాజ్, వినోద్ యాదవ్, కిరణ్, నాగేష్, బాలరాజ్ గౌడ్, హమీద్, హైదర్ భాయ్, ఎల్లం నరసింహ, నాగరాజ్ గౌడ్, చంద్రకళ, భాగ్యరాణి యశోదమ్మ, నిర్మల, ఆశ, మాధవి, వీ శ్రీనివాస్ గౌడ్, సానాది శంకర్, బీ కే శ్రీనివాస్, సూర్య ప్రకాష్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని క్లిష్ట పరిస్థితుల్లో గట్టెక్కిచిన గొప్పనాయకుడు పీవీ



- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో పలు సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కిచ్చిన గొప్ప నాయకుడు మాజీ ప్రధానమంత్రి పీవీ. నరసింహారావు అని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం పీవీ 102వ జయంతి సందర్భంగా పీవీ మార్గ్‌లోని పీవీఘాట్‌లో ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి పీవీ నరసింహారావు అని కొనియాడారు. బహుబాషా కోవిదుడు, గొప్ప రాజనీతిజ్ఞుడుగా పేరుగాంచారన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పీవీ సేవలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ తగినరీతిలో గౌరవిస్తుందని చెప్పారు. పీవీ శతజయంతిని ఎంతో ఘనంగా నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అంతేకాకుండా నెక్లెస్ రోడ్డుకు పీవీ మార్గ్‌గా నామకరణం చేయడమే కాకుండా భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రపంచ దేశాలలో భారతదేశ ఖ్యాతిని చాటిచెప్పిన పీవీకి భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో పీవీ కుమార్తె ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ ఆర్డీవో వసంత తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిలో అక్రమ గుడిసెల తొలగింపు

నవతెలంగాణ-జవహర్ నగర్

ప్రభుత్వ భూమిలో ఎలాంటి గుడిసెలు వేయరాదని, అక్రమ నిర్మాణాలకు పాల్పడేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ హెచ్చరించారు. బుధవారం కార్పొరేషన్ లోని అరుంధతినగర్ సర్వే నెం. 770,771,767, 706/ పార్ట్ ప్రభుత్వ భూములో అక్రమంగా వేసిన గుడిసెలను తహశీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ కార్పొరేషన్ లో సర్కారు భూములే ఉన్నాయని, ప్రొసిడింగ్స్ వచ్చిన భూము లల్లో కూడా అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిని వదలబోమని అన్నారు. అక్రమంగా వేసిన గుడిసెలను జవహర్ నగర్ పోలీస్ సిబ్బంది సహాయంతో పూర్తిగా తొలగించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సహాయకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సంరక్షణ చూసుకునేవారు కరవయ్యారు..

- పక్షవాతం బారిన పడి, వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం సీపీకి ఫిర్యాదు
- బాధితుడి ఫిర్యాదును స్వయంగా స్వీకరించిన కమిషనర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

గతంలో ఆటో డ్రైవర్‌గా పని చేసి, నాలుగేండ్ల క్రితం వచ్చిన పక్షవాతం వల్ల ఇంటికే పరిమితమయి ఇబ్బందులు పడుతున్న సంస్థాన్ నారాయణపురంకు చెందిన కిషన్ అనే బాధితుడిని చూసుకునేవారు కరువయ్యారు. దాంతో బాధితుడు తన వ్యక్తిగత సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌కు వచ్చాడు. విషయం తెలుసుకున్న కమిషనర్ డీఎస్ చౌహాన్ తన ఛాంబర్ నుంచి బయటికు వచ్చి పిటిషన్ స్వీకరించారు. అనంతరం బాధితుడితో సాదరంగా మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. పక్షవాతం వల్ల ఇంటికే పరిమితమయిన తనను భార్య వదిలేసిందని, తన సంరక్షణ చూసుకునే వారు ఎవరూ లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతు న్నానని సీపీ దృష్టికి తీసుకెళ్లాడు. ఫిర్యాదు దారుడి భార్య, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడి వీలయినంత త్వరగా సమస్య పరిష్కారించాలని సంబంధిత అధికారులకు సీపీ సూచించారు. స్వయంగా సీపీ ఫిర్యాదు తీసుకోవడం, తన తో మాట్లాడడంతో బాధితుడు సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు

- డాక్టర్ ముజీబ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకొని తెలంగాణ ఉద్యోగులకు, ప్రజలకు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్) శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్రహీం ప్రవక్త సిద్ధపడ్డ త్యాగాని గుర్తుచేసుకుంటూ బక్రీద్ పండుగ జరుపుకుంటారని, భక్తి పారాయణత హృదయంలో జనించే త్యాగభావం భగవంతుని చేరుతాయని అన్నారు. ఈ శుభ సందర్భంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్ర శేఖర్ రావుకి.. రాష్ట్ర ప్రజలకు భగవంతుని ఆశీర్వాదం అందాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండేందుకు అందరూ పాటుపడాలని ముజీబ్ ఆకాంక్షించారు.

క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి

- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

జీవితంలో క్రీడలు శారీరక దఢత్వంతో పాటు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.కీసర మండలం గోధుమ కుంట గ్రామంలో దమ్మాయిగూడ కౌన్సిలర్ గోగుల సరితా వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణతో క్రీడాకారుల్లో ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పోచయ్య, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కుర్రి మహేష్, మూడు చింతలపల్లి, నాగారం,కీసర, ఘట్కేసర్,పీర్జాదిగూడ,గుండ్ల పోచంపల్లి, ఘట్కేసర్, జవహర్ నగర్ కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, ముప్పు శ్రీనివాస్ రెడ్డి,కోల కష్ణ యాదవ్,తుంగతుర్తి రవి,కర్రె రాజేష్,సాయి పేట శ్రీనివాస్,శ్రీకాంత్ యాదవ్, మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యేను కలిసిన అసోసియేషన్ సభ్యులు



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే నివాసంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని ఏఎస్ రావు నగర్ డివిజన్ భవాని నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు బుధవారం కలిశారు. వారి కాలనీ కమ్యూనిటీ హాల్ ఎక్స్‌టెన్షన్, మహిళా భవన్ నిర్మించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీరాములు ,చిరంజీవి ,రుక్కయ్య, పుల్లారావు, పెద్ది శ్రీనివాస్ గుప్తా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, పల్ల కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సు

నవతెలంగాణ-కాప్రా

మాదక ద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో వసుందర జూనియర్ కళాశాల, ఇ.సి.ఐ.ఎల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కమ్ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కిరణ్ కుమార్ అధ్యక్షత వహించి మాదక ద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయ సేవాధికార సంస్థల చట్టాల గురించి, ఉచిత న్యాయ సహాయం గురించి ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. సుమారుగా 105 విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సహకారం అందిస్తా

- అడ్వకేట్ బోడ శ్రీనివాస్ రావు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తానని అడ్వకేట్ బోడ శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం చీర్యాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి అడ్వకేట్ బోడ శ్రీనివాస్ తన వంతు సహాయంగా మంచినీరు వధా కాకుండా నల్లాలు, మొక్కలకు నీళ్ల పెట్టడానికి వాటర్ పైప్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్లవేళలా పాఠశాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకష్ణ పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాల చీర్యాల విద్యార్థినీ విద్యార్థులందరికీ శ్రీ సత్య సాయి ఫౌండేషన్ ఏఎస్ రావు నగర్, ఒక్కొక్కరికి ఆరు నోటు పుస్తకాల చొప్పున పాఠశాల మొత్తానికి అందించారు. పాఠశాల అభివద్ధికి సహాయ సహకారాలు అందిస్తూ ప్రతి సంవత్సరం కూడా ఇలాగే నోటు పుస్తకాలు అందిస్తామని తెలియజేశారు.



నిర్మాణ పనులు పరిశీలించిన మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-కంటోన్మెంట్

బీఆర్ఎస్ కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి కంటోన్మెంట్ 2 వార్డులో నారాయణ జోపిడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను బుధవారం పరిశీలించారు. సంబంధిత ప్రభుత్వ అధికారులతో కలిసి నారాయణ జోపిడి, సిల్వర్ కాంపౌండ్ తదితర ప్రాంతాలలో నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిచేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా వార్డు 2 పరిధిలోని నాలాలకు అవసరమైన చోట మరమ్మతులు వెంటనే చేపట్టి వేగంగా పూర్తి చెయ్యాలని కంటోన్మెంట్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీ ముప్పిడి మధుకర్, బోయినపల్లి మార్కెట్ డైరక్టర్ నయీమ్, నరేష్ , బాలరాజ్ , రఫీక్ , అజీమ్ , తౌఫిక్ , పరశురాం ,ప్రవీణ్ యాదవ్ పాల్గొన్నారు.



మహా జన సంపత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని వాజ్ పే య్ నగర్ బూత్ నంబరు 134 లో బూత్ అధ్యక్షులు వి. కష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో గడప గడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భాను ప్రకాష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ తిరుమల దేవి, డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ తిరుమల దేవి, బూత్ జనరల్ సెక్రెటరీ భాగ్యలక్ష్మి, సీనియర్ నాయకులు గడప నర్సింగ్ రావు, డీ సంతోష్, పంజా శ్రీనివాస్, జనిగ వెంకటేష్, అంజన, లతా, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నేరేడ్ మెట్

కార్మికులు, ఉద్యోగుల వేతనాల పెంపునకు మంత్రి హామీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలోని పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల వేతనాలు పెంచేందుకు మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చినట్టు బీఆర్‌టీయూ నాయకులకు తెలిపారు. బుధవారం బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మెన్ పులిమామిడి నారాయణ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల వేతనాలను జీవో 14,60 ప్రకారం పెంచాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే ఫైల్‌ను ప్రాసెస్ చేయాలంటూ ఓఎస్డీకి ఆదేశాలు జారీ చేశారు. దాంతో మంత్రికి రాంబాబు యాదవ్, నారాయణలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ కిరణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ సంతోష్, రాజ రత్నంతోపాటు నాయకులు కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో డ్రయినేజీ, సమస్య విషయమైకార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పర్యటించారు. ఈ కార్యక్రమంలో సివరేజ్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

బస్ స్టాప్‌ను ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ -వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్‌లోని ప్రశాంతి నగర్ కాలనీ, వనస్థలి హిల్స్ కాలనీలో బుధవారం రిక్వెస్ట్ బస్‌స్టాప్‌ను ప్రశాంతి నగర్ కాలనీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి నగర్ కాలనీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, వనస్థలి హిల్స్ అధ్యక్షులు మల్‌రెడ్డి యాదిరెడ్డి, బాలాజీ, ప్రసాద్, బుజంగా రెడ్డి, యుగేందర్ రెడ్డి, కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే మంచి గుర్తింపు



నవతెలంగాణ- చైతన్యపురి

చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఐఆర్ ఎస్ (డిప్యూటీ కమిషనర్ ఆర్. భరత్ అన్నారు. సూర్యాపేట జిల్లా చివెంల మండలం యంజనగర్ గ్రామ పంచాయతీ పాఠశాలలో విద్యార్థులకు సీటింగ్ డెస్కులు, టేబుల్, అధ్యాపకులకు కుర్చీలను బుధవారం భరత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ పాఠశాల దశలోనే ముడిపడి ఉందన్నారు. చదువుతోనే దేశ అభివృద్ధి కూడా మిళితమై ఉందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి మరిన్ని మంచి కార్యక్రమాలు కొనసాగిస్తానని భరత్ తెలిపారు.

నాలా పనులు పూర్తి చేయాలి



- సీఐటీయూ చాంద్రాయణగుట్ట కార్యదర్శి కిషన్

నవతెలంగాణ-సంతోష్‌నగర్

బాబా నగర్‌లో నిర్మాణంలో ఉన్న నాలా పనులను వెంటనే పూర్తి చేయాలని చాంద్రాయణగుట్ట గుట్ట సీఐటీయూ కార్యదర్శి ఎస్.కిషన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ రక్షణ రంగ సంస్థలు ఆ ప్రాంతంలో ఉండడం వలన అటు ఉద్యోగులకు, ప్రజలకు, అనునిత్యం ట్రాఫిక్ జామ్ వలన అనేక ఇబ్బందులు, నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలా పనులు చేపట్టి ఇప్పటికే 11నెలలు గడుస్తున్నా ఆ పనులు పూర్తికాకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇది ముమ్మాటికీ జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యమే అని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నాలా పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు.

కేసులు ఎత్తేయాలని డీజీపీకి వినతి

- డీజీపీని కలిసిన సీపీఐ రాష్ట్ర నాయకులు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

తమపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర నాయకులు బుధవారం రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, కుంట్లూర్ రెవెన్యూ సర్వే నెం.215 నుంచి 224 లో ఉన్న భూదాన్ భూమిలో సుమారుగా పదివేల మంది ఇండ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. వారికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ అందుకు విరుద్ధంగా అధికారులు గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నం చేస్తుండగా..గుడిసె వాసులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అండగా నిలిచారని గుర్తుచేశారు. కానీ పోలీసులు కూనంనేని సాంబశివరావుతో పాటు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, పానుగంటి పర్వతాలు, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్ రెడ్డి, కౌన్సిలర్ లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్‌తో సహా 21మందిపై కేసు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డీజీపీ కోరారు.

ఇండ్లు లేని పేదలు భూదాన్ భూమిలో గుడిసెలు వేసుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. వందల ఎకరాల భూదాన్, ప్రభుత్వ అసైన్, సీలింగ్, భూములు బడా బాబులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమాలకు పాల్పడి అమ్ముకుంటుంటే పాలకులకు, ఉన్నతాధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నివాసం కోసం వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి, ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం ప్రభుత్వం అందించాలని కోరారు. లేనియెడల భూ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఈ.టి. నరసింహ, సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, పానుగంటి పర్వతాలు తదితరులు ఉన్నారు.

'ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి'



నవతెలంగాణ- సంతోష్ నగర్

బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి ముస్లిం సోదరులను కోరారు. తర్వాత వారికి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సైదాబాద్ డివిజన్ శంకేశ్వర్ బజార్‌లోని పలు బస్తీల్లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. బక్రీద్ పండుగ సందర్భంగా పరిశుభ్రత పరిరక్షణ కాపాడాలని, బక్రీదు పండుగను పురస్కరించుకుని ప్రత్యేక మాంసం వ్యర్థాలను వేయడానికి జీహెచ్ఎంసీ తరపున ప్రతి ఇంటికీ ప్రత్యేకంగా పాలిథిన్ కవర్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కవర్లలో మాంసం వ్యర్థాలను వేసి చెత్త కుండీల్లో, చెత్త ఆటో ట్రాలీల్లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, కాలనీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, మసీద్ - ఈ- హనఫియా, ముస్లిం సోదరులు, కమిటీ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి

- చైర్ పర్సన్ ముల్లి పావని



నవతెలంగాణ-ఘట్కేసర్

మున్సిపాలిటీలోని ప్రతి వార్డుల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఘట్కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ 3వ వార్డులో కౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్ రెడ్డి బుధవారం తమ సొంత ఖర్చులతో విద్యుత్ తీగలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ కౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఆ విద్యుత్ తీగలకు వెంటనే విద్యుత్ బల్బ్ లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పలుకుల మాధవరెడ్డి, కమిషనర్ వేమన రెడ్డి, కౌన్సిలర్ బండారు ఆంజనేయులు గౌడ్, మాజీ వార్డు సభ్యులు బొక్క జంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్ రెడ్డి, నర్సింగ్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను జరుపుకునేందుకు తగిన ఏర్పాట్లు



నవతెలంగాణ-ఘట్కేసర్

ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకునేందుకు ఈద్గాల వద్ద తగిన ఏర్పాటు చేస్తున్నట్లు ఘట్కేసర్ మున్సిపల్ వైస్ చైర్మన్ పలువుల మాధవరెడ్డి తెలిపారు. బుధవారం ఘట్కేసర్ జమ్మ మజీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీజ్ (అన్ను భాయ్)తో కలిసి ఆయన ఈద్గా దగ్గర తగిన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. ఈద్గా దగ్గర, బాలాజీ నగర్‌లోని మహమ్మదీయ మజీద్ దగ్గర ప్రార్థన సమయంలో అవాంఛనీయ ఘటన జరగకుండా పోలీస్ బందోబస్తును ఘట్కేసర్ ఎస్‌హెచ్ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి, ఎస్ఐ అశోక్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి ఆంజనేయులు గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బర్ల హరి శంకర్ ముదిరాజ్, పల్లె విజయ్ గౌడ్, మైనార్టీ నాయకులు షకీల్, ఘట్కేసర్ మున్సి పాలిటీ బ్రాండ్ అంబాసిడర్ సిరాజ్ అయ్యూబ్ , మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా సభ్యులు ఎండి. సిరాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ పరిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

దర్గా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

పహాడి షరీఫ్ దర్గా ర్యాంపు రోడ్డు నిర్మాణ పనులకు రెండు దఫాలుగా రూ.14కోట్ల 25 లక్షల నిధులను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి మంజూరు చేయటం పట్ల మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం మంత్రి దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న పహాడి షరీఫ్ దర్గా పైకి వెళ్లడానికి భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఇప్పటికే 9 కోట్ల 60 లక్షలు మంజూరు చేయించగా.. పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఇప్పుడు మొత్తం 14 కోట్ల 25 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయని.. దర్గా రోడ్డు, గుట్టపై పార్కింగ్ తదితర సౌకర్యాల కల్పనకు ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు.

'డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం'



నవతెలంగాణ -ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలుపుతామని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ అన్నారు. డివిజన్ లోని బీరప్పగడ్డ న్యూ ప్రశాంత్ నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు న్యూ ప్రశాంత్ నగర్ బస్తీలో ఒకేసారి స్ట్రామ్ వాటర్ పైప్ లైన్, మంచినీటి పైపులైను, నూతన సీసీ రోడ్లు వేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కొక్కొండ జగన్, బింగి శ్రీనివాస్, రవీందర్ గౌడ్, స్థానిక బస్తీ వాసులు, మైసల్, సత్తయ్య, రవి, బషీర్, గౌస్, జాంగిర్, అర్జున్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

డైరెక్టర్ ఎస్. విజయలక్ష్మి



నవతెలంగాణ -సంతోష్ నగర్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్ అని సంతోష్ నగర్ డివిజన్ ఈదీ బజార్ వికాస్ హై స్కూల్ డైరెక్టర్ ఎస్. విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు బుధవారం బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బక్రీద్ పండుగ పవిత్రతకు, త్యాగానికి, ఐక్యతకు నిదర్శనమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్న శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థులందరికీ తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. నాణ్యమైన విద్యను అందించినప్పుడే విద్యార్థులు చదువులో రాణించి.. సమాజ అభివృద్ధికి సహకరిస్తారని అన్నారు. ఏ కార్పొరేటర్ పాఠశాలలో లేని విధంగా చదువును పిల్లలకు అందిస్తున్నామన్నారు. వికాస్ హై స్కూల్‌లో అడ్మిషన్స్ తీసుకోవాలని పలువురు విద్యార్థులను డైరెక్టర్ ఎస్ విజయలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగకు

పటిష్ట బందోబస్తు

సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్



నవతెలంగాణ-సంతోష్ నగర్

బక్రీద్ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సిహెచ్ రూపేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ మత సామరస్యాన్ని కాపాడడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బక్రీద్ పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులతో ప్రజలు సహకరించాలని కోరారు. డ్రోన్ కెమెరాల సహాయంతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల పరి రక్షణకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి



నవతెలంగాణ-హయత్ నగర్

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని..లేకపోతే రాబోయే రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు ఎదురవ్వడం ఖాయమని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. డివిజన్ పరిధిలోని సీతారామ్‌పురం కాలనీలో చేపట్టిన తాగు నీటి పైప్ లైన్ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు హయత్‌నగర్ డివిజన్‌లోని ప్రతి కాలనీలో తాగు నీటి సౌకర్యం లేని ప్రాంతాలను గుర్తించి.. నీటి పైప్ లైన్ల సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో పాశం జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాశం రాజు యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం కార్యకర్తలు, నాయకుల మధ్య ఘనంగా జరిగాయి. తర్వాత పాశం రాజు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, మంత్రి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి రాజుకు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, పిర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, నాయకులు పాశం బుచ్చి యాదవ్, చింతల శ్రీనివాస్ రెడ్డి, కాటపాక కుమార్ బొట్టు మంచి సునీల్, కాటపాక భరత్ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలి

కార్పొరేటర్ లచ్చిరెడ్డి



నవతెలంగాణ- వనస్థలిపురం

ఆఫీసర్ కాలనీలో చేపట్టిన రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను బుధవారం జీహెచ్ఎంసీ డీఈ దామోదర్ రావుతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వీలైనంత తర్వగా రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. కాలనీలో ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి

ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



నవతెలంగాణ-బోడుప్పల్

వైద్యుల నిర్లక్ష్యంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరి గుట్ట మండలం దాతర్‌పల్లి గ్రామానికి చెందిన కొమరాజు కళ్యాణి (23) మంగళవారం ఉదయం తలనొప్పి తీవ్రం కావడంతో పీర్జాదిగూడలోని అపెక్స్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన అనంతరం బుధవారం ఉదయం 7 గంటల సమయంలో ఆపరేషన్ చేస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. దీంతో బంధువులు అప్పుడు అడిగితే బాగానే ఉందని చెప్పి..ఇప్పుడు ఎలా మృతి చెందిందని డాక్టర్లను నిలదీశారు. తలలో సమస్య వచ్చిందని ఆపరేషన్ అవసరమై చేస్తుండగా...గుండెపోటుకు గురైందని వైద్యులు పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో తన భార్య మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేపట్టి మేడిపల్లి పీఎస్ లో ఫిర్యాదు చేశారు. కాగా మృతురాలికి 2 సంవత్సరాల అమ్మాయి, 6 నెలల బాబు ఉన్నారు.

బక్రీద్ పండుగ శుభాకాంక్షలు



మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్ పేట్

దైవ భక్తికి, త్యాగానికి బక్రీద్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ముస్లిం, మైనార్టీలకు బక్రీద్ (ఈదుల్ అజ్ హా) మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బక్రీద్ పండుగ భక్తి, త్యాగం, కరుణ, విశ్వాసం,సేవ అనే గొప్ప గుణాలను ప్రజల్లో పెంపొందిస్తుందని అన్నారు. సీఎం కేసీఆర్ అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ముస్లిం, మైనారిటీల అభివృద్ధి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. బక్రీద్‌ను కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మంత్రిపై విమర్శలు'



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే మంత్రి సబితాపై బీజేపీ నాయకులు అందెల శ్రీరాములు అసత్య ఆరోపణలు చేస్తున్నారని.. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్లు సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డిలు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ప్రతి నిత్యం ప్రజల సంక్షేమానికి పాటు పడుతున్న మంత్రిని విమర్శించే స్థాయి బీజేపీ నాయకులకు లేదని విమర్శించారు. రాజకీయ అవగాహన లేకుండా తన అనుచరులతో కలిసి అందెల శ్రీరాములు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామిడి తుపాన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలిమ హాస్పిటల్‌లో పేదలకు మెరుగైన వైద్యం

- హాస్పిటల్ సీఈవో నీలిమ



నవతెలంగాణ-ఘట్కేసర్

నీలిమ హాస్పిటల్‌లో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని ఆ హాస్పిటల్ సీఈవో నీలిమ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో నీలిమ హాస్పిటల్‌లో చేస్తున్న సేవలు గురించి బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం నీలిమ హాస్పిటల్ పనిచేస్తుందని చెప్పారు. మండలంలోని 11 గ్రామాల్లో నీలిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దీంట్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నీలిమ హాస్పిటల్ లో 50% మినహాయింపు ఉంటుందన్నారు. అందుకు కార్డులు కూడా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా గ్రామాలలో కాకుండా మున్సిపల్‌లో కూడా సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నీలిమ హాస్పిటల్ చేస్తున్న సేవలను సద్వినియోగించుకోవాలని కోరారు.

నేడే ఎస్ఎస్ అండర్ వాటర్ ట్రన్నల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



నవతెలంగాణ- వనస్థలిపురం

వనస్థలిపురం ఆటోనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ అండర్ వాటర్ టర్నల్ ఎగ్జిబిషన్ ను గురువారం ఉదయం 10 గంటలకు ఎల్బీనగర్‌ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకుడు నూర్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్లో వేల రకాల చేపలు, ఆరుపాకు 200 కేజీల చేప, వేల రకాల సముద్ర చేపలు కనువిందు చేస్తాయని వివరించారు. ఇలాంటివి చూడటానికి విదేశాల్లో ఎంతో ఖర్చుతో కూడుకున్న పని కానీ...ఇక్కడ మాత్రం ఒకరికి వంద రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. ఈ ఎగ్జిబిషన్ సాయంత్రం మూడు గంటల నుంచి పది గంటల వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీంతోపాటు చిన్నారులు ఆనందించడానికి ఎగ్జిబిషన్లో ఆట వస్తువులు, పలు షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట శ్రీహరి, శీను తదితరులు ఉన్నారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-హయత్ నగర్

రోడ్ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ ఐ దయాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...ఉత్తరప్రదేశ్ కు చెందిన షా హిన్ షా(22), మోహద్ ఖలీమ్(20)లు ఎల్బీనగర్‌లోని పాల్ సీలింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 27న తుర్కయాంజల్ నుండి హస్తినాపురం మాక్స్ షాపింగ్ మాల్ వద్దకు రాగానే ఓ వాహనం ఢీ కొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి గాయాల పాలై ఆసుపత్రిలో చేరాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాలి

- కాంగ్రెస్ కార్పొరేటర్ల డిమాండ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్షాకాలం సమస్యలపై ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలంటూ కాంగ్రెస్ కార్పొరేటర్లు మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి, విజయారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశారు. నగరంలో వర్షాలు పడితే నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారని, ఎక్కడ నాలాలు పొంగిపొ ర్లుతాయో, ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నాలాల అభివద్ధి కోసం వెయ్యి కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామని లెక్కలు చూపిస్తున్నా అవి ఎక్కడ పనులు జరుగుతున్నాయి చెప్పాలన్నారు. నగరంలో ప్రతిసారి వరద ముప్పు ఉండదని అధికారులు, మంత్రులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. నగరవాసుల నుంచి కోట్లాది రూపాయల ట్యాక్స్‌లను వసూలు చేస్తున్నారే గానీ ప్రజల మౌలివసతులు కల్పించడంలో విఫలమవుతున్నారని, కనీసం ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించలేక పోతున్నారని మండిపడ్డారు. ప్రజలకు నమ్మకం కలిగే విధంగా క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికైనా వరద పరిస్థితులపై ప్రత్యేకంగా జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం కార్పొరేటర్లు మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి, విజయారెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలు మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

నవచిత్రం

హాయిగా నవ్వుకునే చిత్రం

సుధాకర్ కోమాకుల హీరోగా నటించిన హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నారాయణ అండ్ కో'. చిన్నా పాపిశెట్టి దర్శకత్వంలో పాపిశెట్టి ఫిల్మ్ ప్రొడక్షన్స్, సుఖ మీడియా బ్యానర్‌ల పై పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 30న విడుదల కానున్న నేపథ్యంలో హీరో సుధాకర్ కొమాకుల విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలను పంచుకున్నారు. 'నాకు నిర్మాణంపై ఎప్పటి నుంచో ఆసక్తి ఉంది. మొదటి నుంచి వీడియోస్, కవర్ సాంగ్స్ చేస్తూనే ఉన్నాను. ఈ సినిమా కంటే ముందు 'రీసెట్' అనే సినిమా మొదలుపెట్టాం. అది ఇంకా టేకాఫ్ కాలేదు. దర్శకుడు చిన్నా ఈ కథ చెబుతున్నపుడు చాలా గమ్మత్తుగా అనిపించింది. ఏం చేసిన ఫ్యామిలీ అంతా చేస్తారని చెప్పడం చాలా కొత్తగా, హిలేరియస్‌గా ఫీల్ అయ్యాను. ఇది ఫ్యామిలీ మూవీ. ఇలాంటి సినిమాతో నిర్మాణంలోకి రావడం చాలా ఆనందంగా అనిపించింది. సినిమా అంతా చాలా ఫన్‌గా ఉంటుంది. ఫ్యామిలీ అండ్ క్రైమ్ కామెడీ రెండూ అందర్నీ అలరిస్తాయి. ఇందులో తండ్రి పాత్రకు ఎవరిని తీసుకోవాలని ఆలోచిస్తున్నప్పుడు దేవి ప్రసాద్ పేరు చెప్పాను. ఆయన సీరియస్ రోల్స్ చేసినా మంచి కామెడీ సినిమాలు తీశారు. అలాగే బయట ఆయన చాలా సరదాగా ఉంటారు. ఈ పాత్రకు ఆయనైతే పర్ఫెక్ట్ అనిపించింది. ఇందులో నారాయణ గారి అబ్బాయి పాత్రలో కనిపిస్తా. నా పాత్ర చాలా సహజంగా, సెటిల్డ్‌గా ఉంటుంది . నాకు కామెడీ చాలా ఇష్టం. ఇందులో ఫుల్ లెంత్ వినోదం చేసే అవకాశం దక్కింది. ముఖ్యంగా అమాయకత్వం నుంచే పుట్టే కామెడీ కడుపుబ్బా నవ్విస్తుంది. ఇందులో నలుగురు మ్యూజిక్ డైరెక్టర్స్ చేశారు. అలాగే ఈ చిత్రానికి మహిళా ఎడిటర్ సృజన అడుసుమల్లి అద్భుతమైన వర్క్ ఇచ్చారు.




సుధాకర్ కోమాకుల

నాకు బాక్సింగ్ యాక్షన్, డ్యాన్స్, ఎమోషనల్‌గా ఉండే సినిమా లంటే ఇష్టం. త్వరలో ఒక ఎమోషనల్ రోల్ ఉన్న సినిమా చేస్తున్నాను. దీంతోపాటు 'గుండెల్లో దమ్ము', 1980 నేపథ్యంలో ఉండే ఒక లవ్ స్టోరీ చిత్రంలో నటిస్తున్నాను.

గండ రిలీజ్‌కి రెడీ

జీరో బడ్జెట్‌తో వారణాశి సూర్య ఓ వినూత్న ప్రయోగానికి తెరతీస్తూ ఈజీ మూవీస్ బేనర్ పై 'గండ' చిత్రాన్ని డైరెక్ట్ చేస్తూ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 30న విడుదలకు సిద్ధమైంది.

ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ వేడుకలో వారణాశి సూర్య మాట్లాడుతూ, 'ఈ సినిమాతో ఎంతో మంది టాలెంటెడ్ ఆర్టిస్ట్స్, టెక్నీషియన్స్ ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. ఈ చిత్రాన్ని 22 థియేటర్స్‌లో రిలీజ్ చేయబోతున్నా. మా ఈజీ మూవీస్ సంస్థ త్వరలో ఓ పెద్ద సంస్థతో కలిసి పెద్ద ప్రాజెక్ట్ చేయబోతుంది. అలాగే విజయ్ జెడ అనే దర్శకుణ్ని పరిచయం చేస్తూ మా సంస్థలో మరో జీరో బడ్జెట్ సినిమా చేయబోతున్నాం. చిన్న సినిమాలు పలు కారణాల వల్ల విడుదలకు నోచుకోక ల్యాబ్‌ల్లోనే ఉండ పోయాయి. అలాంటి సినిమా లను టేకప్ చేసి, వాటికున్న సమస్యలను సాల్వ్ చేసి, కంటెంట్ ఉన్న సినిమాలను రిలీజ్ చేయాలన్న ఆలోచనలో కూడా ఉన్నాం. దానికి సంబంధించిన పనులు కూడా జరుగుతున్నాయి. అలాగే కోట్లు పెట్టి పోగొట్టుకున్న చిన్న నిర్మాతలు కేవలం పింఛన్ మీద ఆధారపడి బతుకు తున్న వారున్నారు. అలాంటి వారికి మా సంస్థలో వచ్చే మనీతో కొంత సాయం చేయాలని సంకల్పించాం. మా 'గండ' సినిమా తప్పక అలరిస్తుంది' అని తెలిపారు.



వారణాశి సూర్య

సౌండ్ పార్టీ షూటింగ్ పూర్తి

ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై వి.జె.సన్నీ హీరోగా, హ్రితిక శ్రీనివాస్ హీరోయిన్‌గా తొలి ప్రయత్నంగా నిర్మిస్తున్న చిత్రం 'సౌండ్ పార్టీ'. దర్శకుడు జయశంకర్ సమర్పణలో సంజయ్ శేరి ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. బుధవారంతో ఈ సినిమా షూటింగ్ విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సారథి స్టూడియోలో ఈ చిత్ర టైటిల్ లోగో పోస్టర్‌ను జర్నలిస్ట్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. చిత్ర సమర్పకుడు వి.జయశంకర్ మాట్లాడుతూ, 'నిర్మాత రవి, నేను మంచి ఫ్రెండ్స్. నా చిరకాల మిత్రుడైన సంజయ్‌తో ఆయన ఈ సినిమా చేస్తున్నారు. పక్కా ప్లానింగ్‌తో దర్శకుడు సంజయ్ సినిమాని పూర్తి చేశాడు. అనుకున్న విధంగానే ఆగస్ట్‌లో సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. '25 కంటే ఎక్కువ స్క్రిప్ట్‌లను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, ప్రతిభావంతుడైన సంజయ్ శేరీతో ఈ సినిమా చేశాం. ఈ అద్భుతమైన ప్రయాణంలో నా ప్రియ మిత్రుడు జయశంకర్ మార్గదర్శకత్వం, సపోర్ట్ లభించడం నా అదృష్టం. ఈ సినిమా షూటింగ్‌ని కేవలం 25 రోజుల్లోనే పూర్తి చేశాం' అని ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ అధినేత, నిర్మాత రవి పోలిశెట్టి చెప్పారు. దర్శకుడు సంజయ్ శేరి మాట్లాడుతూ, 'ఇదొక ఫుల్ ఫన్ రైడ్ చిత్రం. అందరి సహకారంతో సినిమా చాలా బాగా వచ్చింది' అని తెలిపారు. 'నేను పార్టీ పెట్టబోతున్నా అంటూ చేసిన వీడియోకు చాలా మంది నుంచి ఫోన్స్ వచ్చాయి. 'సౌండ్ పార్టీ' టైటిల్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. మా నిర్మాత యుఎస్‌లో ఉంటూ కూడా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా పూర్తి చేయడానికి సహకరించారు. మా దర్శకుడు సంజయ్ అద్భుతంగా తీశాడు. జయశంకర్ అన్నీ తానై సినిమాను నడిపించాడు. కచ్చితంగా థియేటర్‌లో ఈ సినిమా గట్టిగా సౌండ్ చేస్తుందని నమ్ముతున్నా. నా కెరీర్‌కి బాగా ఉపయోగపడే చిత్రమిది' అని అన్నారు.



వి.జె.సన్నీ హ్రితిక శ్రీనివాస్

మెప్పించే యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ

దర్శకుడు కె దశరథ్ నిర్మాతగా వ్యవహరిస్తూ కథ అందించిన చిత్రం 'లవ్ యు రామ్'. ఈ చిత్రానికి డివై చౌదరి దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాత కూడా. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా ఈనెల 30న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో రచయిత, నిర్మాత దశరథ్ మీడియాతో ముచ్చటించారు. 'దర్శకుడు డివై చౌదరి, నేను మంచి స్నేహితులం. ఒక లవ్ స్టోరీ చేద్దామని భావించాం. ఒకప్పుడు పిల్లల ప్రేమకు తల్లిదండ్రులు విలన్‌గా ఉండే వాళ్ళు. ప్రేమకు వాళ్ళు అంగీకారం తెలపకపోతేనే సమస్య. అయితే కాలం మారిపోయింది. ఇప్పుడు ప్రేమికుల మధ్య వచ్చిన గొడవలే ప్రేమకు విలన్స్‌గా మారుతున్నాయి అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశాం. ఒక అమ్మాయి చిన్నప్పటి నుంచి ఒకరిని ఇష్టపడుతుంది. అతనే ఆ అమ్మాయికి స్ఫూర్తిని ఇచ్చాడు. అలాంటి వ్యక్తి కాలగమనంలో వేరే క్యారెక్టర్ అయిపోయాడని తెలిస్తే ఆ అమ్మాయి పరిస్థితి ఏమిటి ? అనేది ఈ జనరేషన్‌కి నచ్చేలా ఉంటుంది. చాలా మంది జీవితాల్లో జరిగే కథ ఇది. సెకండ్ హాఫ్ బ్యూటీ ఏమిటంటే.. మూడు రోజుల్లో జరుగుతుంది. పెళ్లి నుంచి శోభనం మధ్యలో జరిగే లవ్ స్టోరీ రాశాం. ఇది చాలా కొత్తగా అనిపిస్తుంది. అందరికీ నచ్చుతుంది. రోహిత్, అపర్ణ లాంటి నటులు దొరకడం మా అదృష్టం. వేద చాలా మంచి ఆల్బమ్ ఇచ్చాడు. ఇందులో పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. ప్రస్తుతం ఒక ప్రాజెక్ట్ పై వర్క్ జరుగుతోంది. అలాగే ఒక వెబ్‌సిరీస్‌తోపాటు 'ఉస్తాద్ భగత్‌సింగ్'కి పని చేస్తున్నాను. నటుడిగా అవకాశాలు వస్తే చేస్తాను' అని అన్నారు.



దశరథ్

రొటీన్ సినిమా కాదు

విరాజ్ అశ్విన్, పాయల్ రాజ్‌పుత్, సిమ్రత్ కౌర్, రజత్ రాఘవ్ ప్రధాన పాత్రల్లో నటించిన స్మార్ట్ ఫోన్ థ్రిల్లర్ 'మాయా పేటిక'. రమేష్ రాపర్తి దర్శకత్వంలో జస్ట్ ఆర్డినరీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై మాగుంట శరత్ చంద్రా రెడ్డి, తారక్‌నాథ్ బొమ్మిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈనెల 30న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.

ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత శరత్ చంద్ర మాట్లాడుతూ, "థాంక్యూ బ్రదర్' సినిమాను అందరూ ఆదరించారు. ఇది మా రెండో సినిమా. ఇందులో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఎలిమెంట్స్ ఉంటాయి. రెగ్యులర్ రొటీన్ సినిమాలా ఉండదు' అని తెలిపారు. డైరెక్టర్ రమేష్ రాపర్తి మాట్లాడుతూ, 'ఇదొక సెల్ ఫోన్ కథ. మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ సినిమా. ఈ చిత్రంలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. పాటలు, కామెడీ ఇలా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. పాయల్ అందరి గుండెల్ని కొల్లగొడుతుంది' అని అన్నారు. 'నా మనసుకు నచ్చిన పాత్ర చేశా. ఆడియెన్స్‌కు నచ్చుతుందని ఆశిస్తున్నాను. గుణ బాలసుబ్రహ్మణ్యం సంగీతం ఈ సినిమాకు ప్రాణం పోసింది. సురేష్ కెమెరా వర్క్ బాగుంటుంది. శ్యామల, సునీల్ కాంబినేషన్ అందరినీ నవ్విస్తుంది. పాయల్ అందరినీ ఆకట్టుకుంటుంది' అని హీరో విరాజ్ అశ్విన్ చెప్పారు.



సిమ్రత్ కౌర్, విరాజ్ అశ్విన్

రంగు రంగుల చిలక..

తెలంగాణ పల్లె కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న మరో చిత్రం 'తురుమ్ ఖాన్‌లు'. స్టార్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్ పై శివకళ్యాణ్ దర్శకత్వంలో ఎండీ.ఆసిఫ్ జానీ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్‌ని శరవేగంగా జరుపుకుంటోంది. తాజాగా ఈ చిత్రం నుంచి తొలి సాంగ్ 'రంగు రంగుల చిలక..' పాటను దర్శకుడు త్రినాథరావు నక్కిన గ్రాండ్‌గా రిలీజ్ చేశారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,"రంగు రంగుల చిలుక' పాటను సింగర్ మంగ్లీ అద్భుతంగా పాడారు. పాటతో పాటు సినిమా కూడా చాలా హిట్ కావాలని ఆశిస్తున్నా' అని తెలిపారు. 'పల్లెటూరు రివేంజ్ కామెడీ జోనర్‌తోపాటు మహబూబ్ నగర్ స్లాంగ్‌లో ఉన్న తొలి సినిమా ఇది. బలమైన కథ, సహజమైన పాత్రలతో చిత్రాన్ని క్వాలిటీగా మా దర్శకుడు శివకళ్యాణ్ తెరకెక్కించారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పారు.

ఉద్యమ కెరటాలు మొదలైంది



ఇంద్ర ఫిలిమ్స్ బ్యానర్‌పై పిడమర్తి రవీంద్ర దర్శకత్వం వహిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'ఉద్యమ కెరటాలు'. ఈ చిత్రంలో హీరోగా చందు రాగం, హీరోయిన్‌గా హాసిని, ప్రీతి సుందర్ నటిస్తున్నారు.ఈ చిత్ర పూజ కార్యక్రమం ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కాసర్ల శ్యామ్ యూనిట్ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'గోరేటి వెంకన్నతో కలిసి పాటలు రాయడం అదృష్టంగా భావిస్తున్నాను' అని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన సినిమాకి పనిచేయడం గర్వంగా ఉంది. ఈ సినిమాకి మంచి పాటలు అందిస్తాను' అని సంగీత దర్శకుడు బోలె షావలి అన్నారు.

హీరో చందు రాగం మాట్లాడుతూ,'ఇలాంటి చారిత్రాత్మక సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాత పిడమర్తి రవీంద్రకి కృతజ్ఞతలు' అని తెలిపారు. 'ఈ జనరేషన్ యువతకి తెలంగాణ ఉద్యమ పోరాటాన్ని తెలియజేయడానికి ఈ సినిమాను నిర్మిస్తున్నాను. అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ సినిమా కచ్చితంగా మెప్పిస్తుంది' అని దర్శక, నిర్మాత పిడమర్తి రవీంద్ర అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భోలే షావలి, పాటలు: కాసర్ల శ్యామ్, గోరేటి వెంకన్న, డిఓపి : వెంకట్ హనుమ, గాయనీ గాయకులు: మధు ప్రియ, వరం, డాన్స్: గణేష్ మాస్టర్.

క్లిష్ట సమయంలో దేశాన్ని కాపాడిన మహానేత పీవీ

పీవీ జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

క్లిష్ట సమయంలో దేశాన్ని కాపాడిన మహానేత పీవీ నర్సింహారావు అని ముఖ్యమంత్రి కే చంద్రశేఖ రరావు కొనియాడారు. నాడు ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలాలే నేడు దేశ ప్రజల అనుభవంలోకి వచ్చాయని తెలిపారు. భారత మాజీ ప్రధాని పీవీ 102వ జయంతి సందర్భంగా బుధవారం ఆయన సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. స్థితప్రజ్ఞతతో భారతదేశాన్ని ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిపేందుకు పునాది వేసిన దార్శనికుడు అని గుర్తు చేశారు. 'దేశానికి మౌనంగా మేలు చేసిన భారత ప్రధాని పివి నర్సింహారావు' అని పేర్కొన్నారు. పలు సంస్కరణలతో భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడిన ఘనత తెలంగాణ బిడ్డ పీవీ నర్సింహారావుకే దక్కుతుందని తెలిపారు. వారి సేవలను సమున్నతంగా గౌరవించుకునే బాధ్యత మన మీద ఉన్నదని పేర్కొన్నారు. వారి గొప్పతనాన్ని గుర్తించుకునేందుకు వారి జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని వివరించారు. 'తెలంగాణ ఠీవి మన పీవీ' అని సీఎం పునరుద్ఘాటించారు. వారి స్ఫూర్తితో దేశాభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని సీఎం స్పష్టం చేశారు.

గాంధీభవన్‌లో...

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకుని బుధవారం గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, అనిల్‌కుమార్ యాదవ్, వినోద్‌కుమార్, కల్వసుజాత ఆయన సేవలను స్మరించుకున్నారు. పీవీ ఘాట్ వద్ద మాజీ ఎంపీ మల్లు రవి, నాయకులు హర్కర వేణుగోపాల్ నివాళులర్పించారు.

అసెంబ్లీలోనూ...

అసెంబ్లీలోని ఆయన నిలువెత్తు చిత్రపటానికి పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ దేశంలో అనేక సంస్కరణలు తెచ్చిన గొప్ప ప్రధాని పీవీ నరసింహారావు అని తెలిపారు. తన ఆలోచన విధానంతో దేశానికి మార్గాన్ని చూపారని చెప్పారు. ఆయన చూపిన ఆర్థిక సంస్కరణలు ఇప్పటికి దేశంలో అమలు అవుతున్నాయని కొనియాడారు. శాసనసభ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, పీవీ కూతురు ,ఎమ్మెల్సీ వాణి దేవి, ఎమ్మెల్సీ యల్.రమణ తదితరులు నివాళులర్పించారు.

నిర్వాసితులంతా ఐక్యంగా పోరాడాలి

- అదానీ, అంబానీ సేవలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం: 'పోలవరం పోరుకేక'లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్

జీలుగుమిల్లి : పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి, ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి ప్రజల కోసం పని చేయాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీల సేవలో తరిస్తున్నదని, ఈ నేపథ్యంలో పరిహారం, ప్యాకేజీ, పునరావాసం వంటి సమస్యల పరిష్కారానికి పోలవరం నిర్వాసితులంతా ఐక్యంగా పోరాడాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్ పిలుపునిచ్చారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ(ఎం) చేపట్టిన పోలవరం పోరుకేక మహాపాదయాత్ర తొమ్మిదో రోజు బుధవారం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలోని కొత్త మామిడిగొంది నిర్వాసిత కాలనీ నుంచి ప్రారంభమైంది. బర్రింకలపాడు, వంకావారిగూడెం, మడకంవారిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం కాలనీల మీదుగా జీలుగుమిల్లి మండలంలోని కొరుటూరు కాలనీలకు చేరుకుని బస చేసింది. ఈ సందర్భంగా వంకావారిగూడెం, మడకంవారిగూడెం గ్రామాల్లో జరిగిన సభల్లో సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటించిందని గుర్తు చేశారు. నిధులు కేటాయించి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్య కేవలం ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న గిరిజనులు, గిరిజనేతరుల సమస్య మాత్రమే కాదనీ, ఇది జాతీయ సమస్య అని అన్నారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పన, నష్టపరిహారం అందజేతలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోందని, ప్రజలు సమస్యల కోసం పోరాడుతుంటే వారి మధ్య కులాలు, మతాల పేరుతో చీలికలు సష్టించి పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. కేవలం నిర్వాసితులకు పునరావాసం కల్పించడమే కాకుండా ఆ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కూడా కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు. ఇక్కడి ప్రజలకు పోరాటాలు చేసే స్ఫూర్తి, తమ హక్కులను కాపాడుకునే ధైర్యం ఉందని, వారికి ఎర్రజెండా సీపీఐ(ఎం) అండగా నిలుస్తుందని ప్రకటించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలాన్ని కేంద్రం ప్రయోగశాలగా మార్చాలని చూస్తోందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో మండలంలో గ్రామాలను ఖాళీ చేసి ఆయుధ ఫ్యాక్టరీని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అదాని ఆయుధ ఫ్యాక్టరీని మండల ప్రజలు తిప్పికొట్టాలన్నారు. జీలుగుమిల్లి మండలానికి గొప్ప పోరాట చరిత్ర ఉందన్నారు. అనేక భూపోరాటాల్లో రాటుదేలిన ప్రజలు మడకంవారిగూడెంలో ఉన్నారని అభినందించారు. పోరాట యోధులంతా తిరిగి ఎర్రజెండా పట్టుకోవడం అభినందనీయమన్నారు. భూపోరాటాల మాదిరిగానే ఆయుధ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడి తమ భూములు వదలబోమని తేల్చి చెప్పాలన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో మడకంవారిగూడెం, వంకావారిగూడెం తదితర ప్రాంతాలు నిర్వాసిత ప్రాంతాలుగా మారే అవకాశం ఉందన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల లక్షా ఐదు వేల కుటుంబాలు సర్వం కోల్పోతున్నాయని, అందుకే వారి హక్కుల కోసం ఈ నెల 20న నెల్లిపాక నుంచి ప్రారంభమైన మహాపాదయాత్ర దాదాపు 170 కిలోమీటర్లు పూర్తి చేసుకుని వంకావారిగూడెం చేరుకుందన్నారు. పోలవరం నిర్వాసితులకు అంతా సంఘీభావం ప్రకటించి అండగా నిలవాలని కోరారు.



పొలిటికల్ గేమ్!

- భారత క్రికెట్ కేంద్రంగా 'అహ్మాదాబాద్'
- ప్రధాన మ్యాచులన్నీ మోడీ స్టేడియంలోనే..
- ప్రపంచకప్ వేదికలు, షెడ్యూల్‌పై విమర్శలు

అశ్రిత పక్షపాతంతో పరిశ్రమలు, పెట్టుబడులు, నిధుల కేటాయింపు.. ఇలా ఒకటేమిటి ప్రతిదీ గుజరాత్‌కు క్యూ కడుతోంది. తాజాగా ఈ జాబితాలోకి భారత క్రికెట్ సైతం చేరిపోయింది. ఐపీఎల్, జాతీయ జట్టు సిరీస్ సహా తాజాగా ప్రపంచకప్ మ్యాచులు సైతం అహ్మాదాబాద్‌కు తరలిపోయాయి. ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో ప్రధాన మ్యాచులన్నీ అహ్మాదాబాద్‌కే కేటాయించటం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నవతెలంగాణ క్రీడావిభాగం

ఐపీఎల్ 2022 ఫైనల్ వేదిక అహ్మాదాబాద్. ఐపీఎల్ 2023 ఆరంభ మ్యాచ్ వేదిక అహ్మాదాబాద్. ఐపీఎల్ 2023 టైటిల్ పోరుకు వేదిక అహ్మాదాబాద్. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ఆరంభ వేడుకలు, ఆరంభ మ్యాచ్‌కు వేదిక అహ్మాదాబాద్. వన్డే వరల్డ్‌కప్‌లో అత్యంత మెగా మ్యాచ్ భారత్, పాకిస్థాన్ పోరుకు వేదిక అహ్మాదాబాద్. ఇక ప్రపంచ క్రికెట్ ఎదురుచూసే ప్రపంచకప్ ఫైనల్ పోరుకు వేదిక అహ్మాదాబాద్. ఇలా చెప్పుకుంటూ పోతే.. ఇటీవల భారత క్రికెట్‌లో ప్రధాన మ్యాచులన్నీ పూర్తిగా అహ్మాదాబాద్‌లోనే జరిగాయి. తాజాగా ఐసీసీ వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల కావటంతో.. అహ్మాదాబాద్‌కు అప్పనంగా ప్రధాన మ్యాచులను కేటాయించటం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

అంతా అక్కడే..!

భారత క్రికెట్‌లో అత్యంత కీలక, ప్రధాన మ్యాచులకు ముంబయి, కోల్‌కత, చెన్నై, బెంగళూర్ సహా మొహాలి స్టేడియాలు వేదికలుగా నిలిచేవి. సంప్రదాయ క్రికెట్ అభిమానులకు ఆ నగరాలు కేంద్రాలు కావటం అందుకు ఓ కారణం. కానీ ఇటీవల కాలంలో భారత క్రికెట్‌కు ఏకైక చిరునామాగా నిలిస్తోంది అహ్మాదాబాద్‌లోని మొతెరా (నరేంద్ర మోడి స్టేడియం) గ్రౌండ్. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్‌కు ఐపీఎల్ ఫ్రాంచైజీ వచ్చి రెండేండ్లు మాత్రమే కావస్తుంది. కానీ, అహ్మాదాబాద్ అంతకుముందే ఐపీఎల్ ఫైనల్స్‌కు ఆతిథ్యం ఇచ్చింది. ఐపీఎల్‌లో వరుసగా మూడుసార్లు టైటిల్ పోరుకు వేదికగా నిలిచిన స్టేడియంగా రికార్డు సృష్టించింది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం డిఫెండింగ్ చాంపియన్ సొంత స్టేడియంలో ఆరంభ, తుది మ్యాచులు నిర్వహిస్తారు. రూల్స్ ప్రకారం 2023 ఐపీఎల్ ఆరంభ, ఫైనల్ మ్యాచులకు మాత్రమే అహ్మాదాబాద్ ఆతిథ్యం అందించే హక్కులు ఉన్నాయి. కానీ 2022 ఐపీఎల్‌కు సైతం అహ్మాదాబాదే వేదికగా నిలిచింది. అయినా, భారత క్రికెట్‌లో దీనిపై గళమెత్తేవారే కరువయ్యారు.

2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు భారత్ ఆతిథ్యం ఇస్తోండగా.. మంగళవారమే 100 రోజుల కౌంట్ డౌన్‌తో షెడ్యూల్ ప్రకటించారు. అహ్మాదాబాద్‌లో ఐదు మ్యాచులు జరుగనుండగా.. అవి అన్ని ప్రధాన మ్యాచులే కావటం గమనార్హం. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు కోసం వందల కోట్ల అభిమానులు ఎదురు చూస్తారు. ఇక ప్రపంచకప్ ఆరంభ వేడుకలు, ముగింపు వేడుకలు సహా ఆరంభ, తుది మ్యాచ్‌ను సైతం ప్రపంచవ్యాప్తంగా క్రికెట్, క్రికెటే తర అభిమానులు ఆసక్తిగా చూస్తారు. అటువంటి కీలక మూడు మ్యాచులను అహ్మాదాబాద్‌కే కేటాయించారు.

> 2023 ఐసీసీ ప్రపంచకప్ వేదికల నుంచి మొహాలిని తప్పించటం వెనుక రాజకీయ జోక్యం కనిపిస్తుంది. పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని బీసీసీఐలో ప్రశ్నించనుంది. అహ్మాదాబాద్‌లోని మోడి స్టేడియంలో ఐదు మ్యాచులు, పక్కన ఉన్న ధర్మశాలలో ఐదు మ్యాచులు, ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలోనూ ఐదు మ్యాచులు షెడ్యూల్ చేశారు. కానీ మొహాలికి ఒక్క మ్యాచ్ దక్కలేదు. ఇందులో స్పష్టమైన రాజకీయ ఉద్దేశాలు కనిపిస్తున్నాయి'
>
> \- గుర్మీత్ సింగ్, పంజాబ్ క్రీడాశాఖ మంత్రి

మొహాలికి మొండిచేయి

భారత క్రికెట్‌లో మొహాలి (పీసీఏ) స్టేడియానికి ఓ చరిత్ర ఉంది. 1996 ప్రపంచకప్, 2011 ప్రపంచకప్ సెమీఫైనల్స్‌కు మొహాలి వేదికగా నిలిచింది. 2016 టీ20 ప్రపంచకప్ భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్‌కు సైతం మొహాలి ఆతిథ్యం అందించింది. అయినా, మొహాలికి ఈసారి ప్రపంచకప్ వేదికల్లో చోటు దక్కలేదు. అందుకు రాజకీయ కారణాలే కారణమని పంజాబ్ క్రీడాశాఖ మంత్రి గుర్మీత్ సింగ్ ఆరోపించారు. గుర్మీత్ సింగ్ వ్యాఖ్యలపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్‌శుక్లా స్పందించారు. ఐసీసీ ప్రమాణాలకు అనుగుణంగా మొహాలి స్టేడియం లేనందునే ప్రపంచకప్ మ్యాచుల కేటాయింపు చేయలేదని వివరణ ఇచ్చాడు. నిర్మాణంలో ఉన్న నూతన స్టేడియం అందుబాటులోకి వస్తే కచ్చితంగా ప్రపంచకప్ మ్యాచుల కేటాయింపు దక్కేదని అన్నారు.

జై షా 'చక్రం'

భారతీయ జనతా పార్టీ అగ్రనేత, కేంద్ర మంత్రి అమిత్ షా కుమారుడు జై షా వరుసగా రెండోసారి బీసీసీఐ కార్యదర్శి పదవిలో కొనసాగుతున్నారు. జై షా వరుసగా రెండోసారి పదవిలో కొనసాగేందుకు జస్టిస్ లోధా కమిటీ సిఫారసులను సైతం సవరించారు. జై షా కనుసన్నల్లో బీసీసీఐ పని చేస్తున్నప్పటి నుంచీ మ్యాచుల కేటాయింపులో గుజరాత్‌కు అగ్ర తాంబూలం దక్కుతుందనే విమర్శ బలంగా వినిపిస్తోంది. ఐపీఎల్, ద్వైపాక్షిక సిరీస్‌లు సహా తాజాగా ప్రపంచకప్ షెడ్యూల్‌లోనూ అహ్మాదాబాద్‌కు లభించిన ప్రాధాన్యత కనిపిస్తూనే ఉంది. గతంలో ప్రధాన మ్యాచులను ముంబయి, కోల్‌కత, చెన్నై, మొహాలి నగరాల్లో సమ ప్రాధాన్యంగా నిర్వహించగా.. ఇప్పుడు ఏకమొత్తంగా అన్ని మ్యాచులను అహ్మాదాబాద్‌లోనే నిర్వహిస్తున్నారు.






2 నుంచి జాతీయ స్విమ్మింగ్ పోటీలు

- ప్రారంభించనున్న క్రీడా మంత్రి, శాట్స్ చైర్మెన్

నవతెలంగాణ, హైదరాబాద్

హైదరాబాద్ మరో జాతీయ స్థాయి స్పోర్ట్ ఈవెంట్‌కు వేదికగా నిలువనుంది. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియం ఆవరణలోని ఈత కొలనులో జులై 2 నుంచి జాతీయ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్స్ జరుగనున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు బుధవారం వెల్లడించారు. 76వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. 'ఈతకొలనులో తెలంగాణ స్విమ్మర్లు ఇటీవల వరుసగా పతకాలు సాధిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నది. వయసుతో నిమిత్తం లేకుండా స్విమ్మింగ్‌ను అందరూ నేర్చుకోవాలని' శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు.

నాలుగు రోజుల పాటు సాగే జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో..42 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. జాతీయ స్థాయిలో 500 మంది స్విమ్మర్లు, 100 మంది అధికారులు పాల్గొననుండగా.. తెలంగాణ రాష్ట్రం నుంచి 22 మంది స్విమ్మర్లు (11 మెన్, 11 ఉమెన్) పోటీపడనున్నారు. జులై 2న పోటీలను షురూ కానుండగా.. క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్‌లతో కలిసి తెలంగాణ స్విమ్మింగ్ సంఘం ఆఫీస్ బేరర్లు జాతీయ స్థాయి చాంపియన్‌షిప్స్‌ను ఆరంభించనున్నారు.



బక్రీద్ పర్వదినం ప్రత్యేకం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
www.navatelangana.com
హైదరాబాద్ | గురువారం | 29 జూన్ | 2023
ADVT FEATURE

త్యాగానికి ప్రతీక బక్రీద్

భక్తి, శ్రద్ధలతో ముస్లింలు జరుపుకునే పండుగ

▶ నిరుపేదల కుంటుంబాలకు దానధర్మాలు ▶ నేడే బక్రీద్



నవతెలంగాణ-మెహిదీపట్నం/ ధూల్ పేట్

సర్వమత సమ్మేళనం అయిన భారతదేశంలో అన్ని మతాల పండుగలు ఘనంగా జరుగుతాయి. అన్ని మతాల వారు కలిసిమెలిసి సోదర భావంతో తమ వేడుకలను జరుపుకునే సంస్కృతి మన దేశంలో ఉంది. నేడు ముస్లింలు జరుపుకుంటున్న ఈద్-అల్-అదా అనగా బక్రీద్ ముస్లింలు జరుపుకునే పండుగలలో ముఖ్యమైనది. ఇది ఇస్లాం మతంలో రంజాన్ తర్వాత జరుపుకునే రెండో అతిపెద్ద పండుగ. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం 12వ నెల 10వ తేదీన ఈ బక్రీద్ పండుగను జరుపుకుంటారు. రంజాన్ నెల ముగిసిన 70 రోజుల తర్వాత ఈ పండగ వస్తుంది. ఈ మేరకు గురువారం(నేడు) బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోనున్నారు. ఈ నెలలోనే హజ్ తీర్థయాత్ర కూడా మొదలవుతుంది. త్యాగాల ప్రతీకగా చెప్పే బక్రీద్ పండగను ముస్లింలు భక్తి,శ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకుంటారు.బక్రీద్ అంటే బకర్ ఈద్ అని అర్థం. బకర్ అంటే జంతువు, ఈద్ అంటే పండుగ అని అర్థం. జంతువును ఖుర్బాని ఇచ్చే పండుగ కాబట్టి దీనిని ఈదుల్ ఖుర్బాని అని కూడా అంటారు.

నేపథ్యం

సమాజంలో పేరుకుపోతున్న రుగ్మతల నుంచి జనవాళిని జాగృతపరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లాహ్ భూమండలానికి 80 వేల మంది ప్రవక్తల్ని పంపినట్లు ముస్లింల ఆరాధ్యగ్రంథం దివ్య ఖురాన్ చెబుతోంది. వారిలో ఒకరు ప్రవక్త హజరత్ ఇబ్రహీం. ఇతను మక్కా పట్టణా న్ని నిర్మించి దాన్ని నివాన యోగ్యంగా మలిచాడని ఖురాన్ చెబుతున్నది. అల్లాహ్ ప్రార్థనల కోసం ఇతను కాబా మందిరాన్ని కూడా నిర్మించారు. అల్లాహ్‌పై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం గడపాలని మానవాళికి బోధిస్తున్న ప్రవక్తల్లోని విశ్వాసాన్ని కూడా గ్రహించేందుకు అల్లాహ్ అనేక పరీక్షలతో పరీక్షించేవారు. ఈ క్రమంలో ప్రవక్త ఇబ్రహీం అనేక పరీక్షల్లో తన విశ్వాసాన్ని నిరూపించినట్టు ఖురాన్ పేర్కొంది. ఈ క్రమంలోనే హజరత్ ఇబ్రహీం, ఆయన సతీమణి హజీరాలకు వారి వృద్ధాప్యంలో అల్లాహ్ వారికి సంతానప్రాప్తి కలిగించారు. లేక లేక జన్మించిన తమ కుమారుడు ఇస్మాయిల్‌ను వృద్ధ దంపతులు అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తరుణంలో ఒక రోజు రాత్రి ఇబ్రహీం తమ కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లాహ్‌పేర బలిదానం చేస్తున్నట్టు కలగన్నాడు. దీంతో అల్లాహ్ తన కుమారుడిని బలిదానం కోరుకుంటున్నాడని గ్రహించిన ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌ను బలిదానం (ఖుర్బానీ) ఇచ్చేందుకు సిద్ధపడతాడు. తండ్రి అంతరంగాన్ని గమనించిన కుమారుడు ఇస్మాయిల్ కూడా అల్లాహ్ మార్గంలో బలయ్యేందుకు సిద్ధపడతాడు. బలి ఇచ్చే సమయంలో పుత్రవాత్సల్యం అడ్డువస్తే తనను బలి ఇవ్వకుండా తన తండ్రి వెనకడుగు వేస్తాడేమోనని, అల్లాహ్‌తో విశ్వాసఘాతకుడిగా నిలవకుండా, కండ్లకు గంతలతో తనను బలిఇవ్వమంటూ ఇస్మాయిల్ తండ్రికి సూచిస్తాడు. దీంతో ఇబ్రహీం అల్లాహ్‌కు విశ్వసపాత్రుడిగా తన కుమారుడిని బలి ఇవ్వడానికి సిద్ధమవుతాడు. అదే సమయంలో సైతాను అక్కడకు వచ్చి అల్లాహ్ ఆజ్ఞను తిరస్కరించేందుకు ఇబ్రహీంను ప్రోత్సహిస్తాడు. కానీ ఇబ్రహీం సైతాని రాళ్లతో కొట్టి అక్కడి నుండి తరిమి వేస్తాడు. దానికి గుర్తుగా హజ్ యాత్రకు వెళ్లిన యాత్రికులు ఆ స్థలంలో సైతాన్ గుర్తుగా ఉన్నటువంటి స్తంభాల వైపు రాళ్లు విసురుతారు. సైతాన్‌ను ప్రారదోలిన తర్వాత ఇబ్రహీం అల్లాహ్ నామస్మరణతో తన కుమారుడిని బలి ఇచ్చేందుకు గొంతుపై కత్తిపెట్టిన క్షణంలో అతని త్యాగనిరతికి మెచ్చిన అల్లాహ్ ఆఖరు క్షణంలో ఇస్మాయిల్‌ను తప్పించి అదే స్థానంలో ఒక గొర్రె పిల్లను ప్రత్యక్ష పరుస్తాడు. దీంతో గొర్రె పిల్ల గొంతు తెగి అల్లాహ్ మార్గంలో అది ఖుర్బాన్ అవుతుంది. బక్రీద్ సందర్భంగా ముస్లింలు జంతు బలి ఇస్తుంటారు. బలి ఇచ్చిన జంతువు మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని పేదలకు పంచి పెడతారు. మిగిలిన భాగాల్లో రెండో దానిని బంధువులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు.

ఖుర్బానీ



ఖుర్బానీ అంటే సాన్నిధ్యం, సామీప్యం, సమర్పణ, త్యాగం. ఖుర్బానీ అంటే పేదలకు మాంసం దానం ఇవ్వడం అనుకుంటారు. దానినే త్యాగం అని పిలుస్తున్నారు. ఖుర్బానీ అంటే సాన్నిధ్యం, సామీప్యం, సమర్పణ, త్యాగం అని కూడా అర్థాలున్నాయి. అంటే దైవ సాన్నిధ్యం పొందడం, దైవానికి సమర్పించడం, దైవం కోసం త్యాగం చేయడమని అర్థం. ఖుర్బానీ ద్వారా రక్త మాంసాల్ని సమర్పించడం కాదు. భక్తి రూపేణా హృదయంలో జనించే త్యాగ భావం, భయ భక్తులే భగవంతుని చెంతకు చేరుస్తాయని ముస్లింల భావన.

జంతువులకు అవయవ లోపం ఉండకూడదు

ఖుర్బానీ విషయంలో ఎన్నో నియమ నిబంధనలు పాటించాలి. బక్రీద్ ఖుర్బానీ ఇచ్చే జంతు వులకు ఎలాంటి అవయవ లోపం లేకుండా ఆరోగ్య కరంగా ఉండాలి.హజ్ యాత్ర చేయలేని వారు బక్రీద్ రోజు జీవాన్ని బలి ఇచ్చి ఖుర్బానీ చేస్తుంటారు. ఖురాన్ నియమ నిబంధనల ప్రకారం కోడిని బలి ఇవ్వరు.

ప్రార్థనలతో బక్రీద్ పండుగ ప్రారంభం

బక్రీద్ పండుగ రోజు ప్రార్థనలతో ప్రారంభమవుతుంది. తెల్లవారుజామున నమాజు కోసం ముస్లింలు సమీపంలోని మసీదులకు వెళ్తారు. నమాజ్ తర్వాత ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటారు. అనేక ముస్లిం కుటుంబాలు నుండి కుర్బానీ చేసిన జంతువు మాంసాన్ని కుటుంబం, పేదల మధ్య పంపిణీ చేస్తారు. పండుగ సందర్భంగా మటన్ బిర్యానీ, మటన్ కుర్మా, మటన్ కీమా, షీర్ కుర్మా, కీర్ లాంటి వంటకాలను చేస్తారు. మృతి చెందిన వారి సమాధులను దర్శిస్తారు. సమాధులను అందంగా అలంకరిస్తారు. వారికిష్టమైన దుస్తులు, భోజనం అక్కడ ఉంచుతారు. దివంగతులు వాటిని స్వీకరిస్తారని నమ్మకం. అన్ని గుణాల్లోనూ దానగుణమే ఉత్తమోత్తమమైనది. ఆకలి అనేది అందరికి సమానమైనది. కాబట్టి ఈ పండగకు నిరుపేద కుటుంబాలకు శక్త్యనుసారంగా దానధర్మాలు చేసి కొంత మందికైన ఆకలి తీర్చగలిగాం అని సంతృప్తి చెందుతారు.

హజ్ యాత్రకు చేసేది ఈ నెలలోనే..

ఆర్థిక స్థోమత కలిగిన ముస్లింలు తమ జీవితంలో ఒక్కసారైన మక్కా యాత్ర (హజ్)కు వెళ్తుంటారు. హజ్ యాత్రకు వెళ్ళిన ముస్లింలు కూడా అక్కడ తమ వంతుగా ఖుర్బానీ ఇస్తారు. హజ్ యాత్రకు ఈ ఏడాది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది ఇప్పటికే బయలుదేరివెళ్ళారు.

బక్రీద్ శుభాకాంక్షలు

ప్రిన్సిపాల్ నిఖాత్ ఫాతిమా



నవతెలంగాణ-సంతోష్ నగర్

బక్రీద్ పండుగ సందర్భంగా తల్లిదండ్రుల, విద్యార్థుల, స్నేహితులు, బంధువులకు సంతోష్ నగర్ ఈధీ బజార్ ఇంటిగ్రల్ ఫౌండేషన్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ నిఖాత్ ఫాతిమా శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం నవ తెలంగాణతో ఆమె మాట్లాడుతూ ఈద్ సంతోషకరమైన సందర్భాన్ని జరుపుకుం టున్న నేపథ్యంలో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. ఈద్ అనేది ప్రతిబింబం, కృతజ్ఞత, వేడుకల సమయం అన్నారు. ఈద్.. కుటుంబాలను ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఇది.. బంధాలను బలోపేతం చేయండి..సంఘాన్ని పెంపొందించుకోండి అన్నారు. సామరస్యపూర్వకమైన సమాజానికి పునాది కాబట్టి ఈ విలువలను మీ పిల్లలకు అందించాలని సూచించారు.కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అల్లాహ్ ఆశీర్వాదాలు ఉండాలంటూ ఈద్ శుభాకాంక్షలు తెలిపారు.

పవిత్ర పండుగ బక్రీద్

ఎస్‌హెచ్‌ఓ మొహమ్మద్ ముస్తఫా



నవతెలంగాణ-సంతోష్ నగర్

త్యాగానికి ప్రతికంగా ఇస్లాం మతస్తులు జరుపుకునే పవిత్ర పండుగ బక్రీద్ అని మలక్ పేట్ ఫైర్ స్టేషన్ డిస్ట్రిక్ట్ ఎస్‌హెచ్‌ఓ మహమ్మద్ ముస్తఫా అన్నారు. రాష్ట్ర ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. భక్తిని త్యాగ గుణాన్ని బక్రీద్ పండుగ చాటి చెప్పిందని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వేరవకుండా దేవునిపై విశ్వాసాన్ని కలిగి సన్మార్గంలో జీవనాన్ని సాధించాలని గొప్ప సందేశాన్ని బక్రీద్ పండుగ మానవులకి ఇస్తుందని అన్నారు. తమకు కలిగిన దాంట్లో నుంచి ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ పండుగ కలిగిస్తుందని చెప్పారు ఆయనతో పాటు లీడింగ్ ఫైర్ మాన్ ఎస్ అంజిరెడ్డి, డ్రైవర్ ఎంఎస్ రెడ్డి, ఫైర్ మాన్ కె. నరేష్, కుమార్, వి.విజయ్ కుమార్, హెూంగార్డ్ రాజు నాయక్, మోహన్ రెడ్డి, పాండురంగయ్య, మలక్‌పేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



'గ్రూప్-4'కు పరీక్షలకు వసతులు కల్పించాలి

రాష్ట్రంలో వివిధ విభాగాలలోని ఖాళీలను భర్తీ చేయుటకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండటం మంచి విషయం. అందులో భాగంగా 8039 ఖాళీల భర్తీకి జులై ఒకటిన స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్4 రాత పరీక్ష నిర్వహిస్తున్నారు. దాదాపు పది లక్షల మంది అభ్యర్థులు దీనికి హాజరయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల్లో వేల సంఖ్యలో పరీక్షా కేంద్రాలు నెలకొల్పేలా సన్నాహాలు చేస్తున్నారు. ఈ పరీక్ష రాసే అభ్యర్థులకు తోడుగా వారి తల్లిదండ్రులు, సంరక్షకులు మొత్తం దాదాపు మూడు లక్షల మంది ఆరోజు ప్రయాణం చేస్తారు. ఈ పరీక్షా కేంద్రాలకు రాకపోకలు సాగించుటకు ఆర్టీసీ ఉచితంగా ప్రత్యేకమైన బస్సులు రాష్ట్రమంతటా నడపాలి. ఒక్కరోజే కాబట్టి బస్సులు తప్పక ఉచితంగా నడపాలి. ఇంతే కాక ఆటోలు ఇతర ప్రయివేటు వాహనాల వారు కూడా అభ్యర్థులకు వారి సంరక్షకులకు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ప్రయాణం చేయుటకు చేయూత నివ్వాలి. మామూలు చార్జీలు మాత్రమే తీసుకోవాలి. ఎందుకంటే ఉద్యోగార్థులు ఎన్నో సంవత్సరాల నుండి ఈ పరీక్షల కోసం ఎదురుచూస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే ఉంటుంది. సొంత వాహన దారులు వారు ప్రయాణిస్తున్న దిశలో ఒకవేళ అభ్యర్థులు కనిపిస్తే వారికి సహకరించి వారు పరీక్షా కేంద్రానికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయాలి. రాష్ట్రంలోని బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రత్యేకంగా రైళ్లు ఉదయం సికింద్రాబాద్ నుండి కాగజ్‌నగర్ , మధిర నిజామాబాద్ ఆదిలాబాద్, మహబూబ్ నగర్ నల్గొండ వికారాబాద్ తాండూరు అదేవిధంగా సికింద్రాబాద్ వైపు వచ్చుటకు పై ప్రాంతాల నుండి పరీక్ష అయిన తదుపరి అభ్యర్థులు వారి గమ్యస్థానాలు చేరుటకు తగు విధంగా నడిపించుటకు ఏర్పాటు చేయించాలి. తద్వారా అభ్యర్థులు ఎటువంటి కష్టనష్టాలకు గురికాకుండా తోడ్పడాలి. ఇది మన రాష్ట్ర యువత భవిష్యత్తు కాబట్టి కేంద్ర, రాష్ట్ర విషయం అనే భేషజాలకు పోకుండా అన్ని పక్షాల వాళ్లు సహకరించాలి. అది కేంద్ర ఉద్యోగమైనా, రాష్ట్ర ఉద్యోగమైనా అభ్యర్థులు తెలంగాణ వారే కాబట్టి అధికారులు రాజకీయ నాయకులు ఈ పరీక్ష సాఫీగా అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా పరీక్ష కేంద్రాలకు రాకపోకలకు సాగించుటకు విస్తతమైన ఏర్పాట్లు చేయాలి. అదికాకుండా ఈ పరీక్ష ఉదయం, సాయంత్రం రెండు పూటలా నిర్వహిస్తున్నందున మంచినీరు, మధ్యాహ్నం భోజనవసతి ఏర్పాట్లను స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, పెద్ద పెద్ద హెూటల్స్‌వారు రాయితీల మీద అందించాలి. ఇవన్నీ సాఫీగా జరిగేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటే అభ్యర్థులు ఆందోళనలు లేకుండా పరీక్ష రాయగలుగుతారు.

దండంరాజు రాంచందర్‌రావు, 9849592958

ప్రయివేటులో ఫీ'జులుం' ఆగెదెప్పుడు?

రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులుం కొనసాగుతూనే ఉన్నది. నియంత్రణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యంగానే కనిపిస్తోంది. నర్సరీ నుండి మొదలుకొని పదవ తరగతి వరకు వేల నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారు. పుస్తకాల పేరిట ఇప్పటికే భారీగా దండుకున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారు. అత్యధిక శాతం ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలను పాటించడం లేదు. పైగా మూడు నుంచి నాలుగేండ్ల పిల్లలకు కూడా వేల రూపాయలు వసూలు చేయడం ఆందోళన చెందాల్సిన అంశం. వారు ఏడాది మొత్తం బడికెళ్లినా తెలుగు వర్ణమాల, ఆంగ్లంలో ఆల్ఫబెట్స్ కూడా సరిగా నేర్చుకోలేదు. నాలుగు అక్షరాలు నేర్పించడానికి ఇంత ఫీజు వసూలు చేయడమేంటి? ద్వితీయ శ్రేణి కార్పొరేట్ స్కూలు, పేరున్న ప్రయివేటు విద్యాసంస్థలవారు ఎల్‌కేజీకి రూ.40 వేల దాకా వసూలు చేస్తున్నారు. గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల్లో రూ.30 వేల నుంచి రూ.80 వేలు తీసుకుంటున్నారు. ఎంత డబ్బు ఎక్కువగా తీసుకుంటే అంత నాణ్యతగా చదువు ఉంటుం దని తల్లిదండ్రులను మభ్య పెడుతున్నారు. తరగతి పెరిగేకొద్దీ ఈ మొత్తాలు కూడా మరింత పెరుగుతుంటాయి. ఇవిగాక పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం, టై, బెల్టులు, బూట్లు, సాక్సుల దుకాణాలూ బడిలోనే ఏర్పాటు చేసినా కన్నెత్తి చూసే నాథుడు లేడు. నాలుగైదు వందల రూపాయలకు మించని పుస్తకాలకు వేలు వసూలు చేస్తున్నారు. రకరకాల సామగ్రి పేరిట అదనంగా డబ్బులు లాక్కుంటున్నారు. అందరి దృష్టిని ఆకర్షించడానికి పాఠశాలలకు వివిధ రకాల పేర్లు జోడిస్తున్నారు. ఈ టెక్నో, ఈ లర్నింగ్, గ్లోబల్, స్మార్ట్, ఈ స్మార్ట్, ఐఐటీ, నీట్, ఒలంపియాడ్, కాన్సెప్ట్, ఇంటర్నేషనల్... ఇలా వివిధ రకాల పేర్లతో పాఠశాలలు నిర్వహిస్తున్నారు. గతంలో ఈ పేర్లతో భారీ హోర్డింగులు, బోర్డులు పెట్టేవారు. కానీ పాఠశాల పేర్లతోనే విద్యాసంస్థలు నిర్వహించాలని ఆదేశాలు రావడంతో రూటు మార్చారు. విద్యాసంస్థలో వాటి పేరిట ఇంటిగ్రేటెడ్ కోర్సులు నిర్వహిస్తున్నామని అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. సాధారణ చదువులకు ఇవి భిన్నమని విద్యార్థుల తల్లిదండ్రులను నమ్మిస్తున్నారు. దీంతో తమ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని, విషయ పరిజ్ఞానం పెరుగుతుందని తల్లిదండ్రులు అడిగినంత ఫీజు చెల్లిస్తున్నారు. తల్లిదండ్రుల బలహీనతలను యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి.


తాటికొండ రవి
9177302248

నిబంధనలు బేఖాతరు...

రాష్ట్ర ప్రభుత్వం 1994లో జీఓ నెం.1లో ఒకసారి, 2008లో జీఓ నెం.90, 91, 92లో మరోసారి ప్రయివేటు విద్యా సంస్థలు పాటించాల్సిన నియమ నిబంధనలను పేర్కొంది. ఈ జీఓల్లో ఫీజుల నియంత్రణపై స్పష్టమైన ఆదేశాలను ఇచ్చింది. 1994 జీఓ నెంబర్ -1 ప్రకారం ఫీజులను నిర్ణయించడానికి పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఇద్దరు, విద్యార్థి సంఘాలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. పాఠశాలల యాజమాన్యాలు వసూలు చేసిన ఫీజుల్లో 5శాతానికి మించి తీసుకోవడానికి వీల్లేదు. వసూలు చేసిన ఫీజుల్లో 50శాతం మొత్తాన్ని ఉపాధ్యాయులకు వేతనాలివ్వాలి. 15శాతం వరకు పాఠశాల నిర్వహణ, విద్యుత్, అద్దె ఖర్చులు, 15శాతం స్కూల్ అభివృద్ధికి ఉపయోగించాలి. 15శాతం ఫీజును స్కూల్ సిబ్బందికి బీమా, భవిష్యనిధి కోసం కేటాయించాల్సి ఉంటుంది. కానీ ఇవేమీ ఎక్కడా అమలు కావడం లేదు. 2008 జీఓ నెం.90, 91, 92.. ప్రకారం ఫీజు నిర్ణయించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి, ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, విద్యార్థి సంఘాలు, ప్రయివేటు విద్యా సంస్థల ప్రతినిధితో కమిటీని ఏర్పాటు చేయాలి. దీనికి కలెక్టర్ చైర్మన్‌గా ఉండాలి. ఈ కమిటీ పాఠశాలను పరిశీలించి మౌలిక సదుపాయాలు, పరిస్థితులు చూసి ఎంత ఫీజులు వసూలు చేయాలనే విషయమై నివేదిక ఇస్తుంది. దీనిపై విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే ప్రభుత్వ పరంగా ఓ ప్రకటన విడుదల చేయాలి. ఈ ఉత్తర్వులను విధిగా అమలు చేయాలి. జీఓ నెంబర్ 42 ప్రకారం ఫీజులను పెంచాలంటే జిల్లా ఫీజ్ రెగ్యులేషన్ కమిటీ అనుమతి తీసుకోవాలి. ఎలాంటి అనుమతి లేకుండా ప్రతి సంవత్సరం 20 నుండి 30శాతం ఫీజులను యథేచ్ఛగా పెంచుతూ వెళ్తున్నారు. జీఓ నెంబర్ 91 ప్రకారం దరఖాస్తు రుసుము రూ.100, అడ్మిషన్ ఫీజు రూ.500 మాత్రమే తీసుకోవాలి. అదే పాఠశాలలో పుస్తకాలు, విద్యాసామగ్రిని కొనుగోలు చేయాలన్న నిబంధనలు పెట్టరాదు. పాఠశాలల్లో విక్రయ కేంద్రాలు తెరవకూడదు. సెక్షన్ -8(1) ప్రకారం విద్యాసంస్థ పేర్లకు ఇంటర్నేషనల్, ఐఐటీ, ఒలంపియాడ్, కాన్సెప్ట్, ఈ -టెక్నో వంటి పదాలను చేర్చకూడదు. జీఓ 88, 2008 ప్రకారం 200 మంది విద్యార్థులు చదివే పాఠశాలలో 700 చదరపు మీటర్ల విస్తీర్ణంలో క్రీడా మైదానం ఉండాలి. అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. అగ్నిమాపక సామగ్రిని అందుబాటులో ఉంచాలి. కానీ ఏ ఒక్క ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అగ్నిమాపక సామాగ్రిని పెట్టడం లేదు.



విద్యాహక్కు చట్టం అమలేది..?

2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి పాఠశాల యాజమాన్యం ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో పెట్టాలి. ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ప్రతి కార్పొరేట్ ప్రయివేటు పాఠశాలల్లో 25శాతం సీట్లను పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేటాయించి ఉచిత విద్యను అందించాలి కానీ ఏ ఒక్క విద్యాసంస్థ కూడా ఉచిత విద్య అందించిన దాఖలాలు లేవు. విద్యార్థుల నుండి ఫీజులను వసూలు చేయాలంటే ఆ విద్యాసంస్థల్లో ఎన్నో సదుపాయాలు ఉండాలి. విద్యార్థులకు వసతులు కల్పించాలి. ఈ విధంగా ఏ ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యం వ్యవహరించడం లేదు. ప్రయివేటు, కార్పొరేటు పాఠశాలల్లో ప్రతి 20మంది విద్యార్థులకు ఒక తరగతి గదిని కేటాయించాలి. కానీ ఒక తరగతి గదికి 50 నుంచి 80మంది విద్యార్థులను కేటాయిస్తున్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో, అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఫైర్ సేఫ్టీ లేదు. ఒక్కొక్క తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి. ఉపాధ్యాయులు శిక్షణపొంది ఉండాలి. కానీ వేతనాలు అధికంగా ఇవ్వాల్సి వస్తుందని తక్కువ మంది సిబ్బందితో, అర్హతలేని ఉపాధ్యాయులతో చాలా పాఠశాలలు నడుస్తున్నాయి. విద్యార్థులకు క్రీడాలకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉండాలి. విశాలమైన ఆటస్థలాన్ని ఉండాలి. కానీ రాష్ట్రంలో 80శాతం పాఠశాలలకు ఈ సౌకర్యాలు లేవు. ఇరుకు గదులు, జనసమ్మర్థం ఉండే కూడళ్లు, అపార్ట్‌మెంట్లలో పాఠశాలలు నడుస్తున్నాయి. తరగతి గదుల్లోకి గాలి, వెలుతురు సమృద్ధిగా ప్రసరించాలి. చాలా పాఠశాలల్లో ఆ పరిస్థితి లేదు. విద్యార్థుల నుంచి బిల్డింగ్ ఫండ్‌ను వసూలు చేయరాదు. కొన్ని కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాలకు లోబడి ఫీజులు వసూలు చేయాలి. కానీ వేలు... లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాయి. ఇలా అనేక రకాలుగా దోపిడీ జరుగుతున్న, రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖాధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడం వలన రాష్ట్రంలో విద్యరంగం వ్యాపార వస్తువుగా మారింది. విద్యాహక్కు చట్ట అమలు, ఫీజుల నియంత్రణ చట్టం అమలు, అక్రమదోపిడీని అరికట్టేందుకు, విద్యావేత్తలు, మేధావులు, తల్లి దండ్రులు, విద్యార్థి, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ■

ఆహార కల్తీని కట్టడి చేయలేమా!?

ఒకవైపు వాతావరణంలో కాలుష్య కారకాలు పెరిగిపోయి ప్రజారోగ్యం గాలిలో దీపంగా మారింది. మరోవైపు పాలకుల ఉదాసీనత, వినియోగదారుల విచ్చలవిడి రెడీమేడ్ ఫుడ్‌కు అలవాటు పడుతున్న తీరుతో కట్టడి లేని కల్తీ శృతి మించిపోయి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే విధంగా వ్యాపారస్తులు తెగబడుతున్నారు. ఆహార పదార్థాల తయారీలో, నిలువలో, ప్యాకింగ్‌లో వాటిలో వాడే నూనెలు, కారం పొడి, పిండి పదార్థాలు, పసుపు, మసాలా లాంటి వాటిలో కల్తీ కరాళ నృత్యం చేస్తుంది. అధికారులు నిబంధనలకు పాతరేస్తూ నామమాత్రపు తనిఖీలు, పరిశీలించకుండానే లైసెన్సులు ఇవ్వడాలు జరుగుతుంది. లైసెన్సు లేకుండా నడుస్తున్న ఆహార పదార్థాల వ్యాపార జోరును ఆపలేని పాలకుల కళ్ళు ఉండీ చూడలేని విధానాలతో కల్తీ ఆహార పదార్థాలు ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. నేడు మనిషి ఉరుకులు పరుగుల జీవితం మూలంగా రెడీమేడ్ బయటి ఆహారానికి అలవాటు పడిపోవడంతో ఆ ఆహారానికి గిరాకీ పెరిగిపోతుంది. మహానగరాలు, పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ఆహార పదార్థాల విక్రయాలు భారీగా పెరిగిపోయాయి. ఎంతగా పెరిగిపోయాయి అంటే? అడుగడుగునా రహదారుల వెంట ఎక్కడపడితే అక్కడ బిరియాని, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లు, బార్ల ముందు తినుబండారాల సెంటర్లతో వినియోగ దారులకు ఎలాంటి శ్రమ, ప్రయాస లేకుండా డబ్బులు పడేస్తే రెడీమేడ్‌గా తయారైన ఫుడ్‌ను రాత్రి, పగలు అనే తేడా లేకుండా అందిస్తున్నాయి. వినియోగదారులు అది కల్తీదని తెలియక మొత్తం మీద తింటున్నారు. ఈ తయారీదారులు ఏ జీవనోపాధి లేకపోవడంతో వినియోగదారుల విపరీత జిహ్వ చాపల్యం (నాలుక రుచి) కోరికల మేరకు అందిస్తున్నారు. ఇది ఒక భాగమైతే మహా నగరాలు, పట్టణాల ప్రజానీకం నిత్యం ఇంట్లో వంటలకు స్వస్తి పలికి ఉదయం టిఫిన్లు, సాయంత్రం మందుబాబులకు వేడి వేడి బజ్జీలు, మిర్చీలు, గారెలు తదితర జంక్ ఫుడ్, వెజ్, నాన్ వెజ్ ఫాస్ట్ ఫుడ్లతో కాలం వెళ్ళదీస్తున్నారు. వీకెండ్ పార్టీల పేరిట కుటుంబ సమేతంగా రెస్టారెంట్లు జనాలతో కిటకిట లాడుతున్నాయి. ఇంతగా ప్రజలు ఆహారం కోసం ఇంట్లో తయారు చేసుకోకుండా రెడీమేడ్ స్పైసీ నాలుకరుచి కోసం నాణ్యతను పట్టించు కోకుండా ఆహారానికి అలవాటు పడుతూ... ఈ విక్రయ కేంద్రాల వద్ద నిలబడి బార్లు కడు తుంటే? పొట్ట గడవడం కోసం ఈ వ్యాపారం చేస్తున్న వారు కొందరైతే, వినియోగదారుల కోరికలే వ్యాపారంగా ఎంచుకొని ఆహార భద్రతకు, ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తూ పొట్టకొడుతున్న వారు ఉన్నారు. పాలకులకు ప్రజా ఆరోగ్యంపై, వినియోగదారులకు ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాల మీద కనీస స్పృహ (సోయి) లేకుండా పోతుంది. బతుకుదెరువు కోసం వ్యాపారం చేసుకోవచ్చు. కానీ ఏ వ్యాపారం చేయాలన్నా ఆ పరిధిలోని సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల వద్ద లైసెన్సులు, అనుమతులు తీసుకోవాలి. కానీ విచ్చలవిడిగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నెలకొల్పి లాభాపేక్షతో ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవడం మాత్రం తప్పే అవుతుంది. ఆహార పదార్థాల తయారీలో నాసిరకం సరుకులు, కల్తీ నూనెలు వాడి నాణ్యత లేని వాటిని తక్కువ ధరలకు అమ్ముచూ ఆఫర్లు పెట్టడంతో ఎక్కువమంది వినియోగదారులు ఆకర్షితులై ఇంట్లో వంటలు మానేసి ఎగబడి తింటూ రోగాల బారిన పడుతున్నారు. ఇలా కల్తీ ఆహారం మూలంగా గుండె, కాలేయం, చర్మ, మూత్రపిండాలు, స్పైసీ-జంక్ ఫుడ్ లాంటి వాటితో జీర్ణాశయ వ్యాధులు, అల్సర్లు, క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు వైద్యులు అంటున్నారు. ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) వారు ఆహార భద్రతకు సంబంధించి మనదేశంలోని రాష్ట్రాలకు ఇటీవల ఇచ్చిన ర్యాంకుల్లో తెలంగాణ 15వ, ఆంధ్రప్రదేశ్ 17వ, స్థానంలో నిలిచాయి. దీనికి కారణం మన రాష్ట్రంలో ఎలాంటి అనుమతులు, లైసెన్సులు లేకుండానే ఆహార పదార్థాలను విక్రయిస్తున్న సంస్థలైన హెూటళ్ళ, రెస్టారెంట్లు, తినుబండార విక్రయ కేంద్రాలు... అవి కూడళ్లలో, రహదారుల పొడవునా ఉన్న బిరియాని, ఫాస్ట్‌ఫుడ్, పానీపూరి, బజ్జీల బళ్ళు విపరీతంగా పెరిగి పోతున్నాయి. ఆ మేరకు తనిఖీ వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేయలేకపోవడంతో ఆహార కల్తీకి కట్టడి లేకుండా పోతుంది. 2021-22 సంవత్సరంలో విడుదల చేసిన ఆహార నాణ్యత సూచీలో దేశంలోని 17 పెద్ద రాష్ట్రాల్లో, మన తెలంగాణ రాష్ట్రానికి 15వ స్థానం దక్కడం చూస్తే కల్తీ వ్యాపారం ఏ మేరకు నడుస్తుందో తెలిసిపోతుంది. ఈ ఆహార నాణ్యత సూచీలో వంద మార్కులకు గాను తెలంగాణకు 34శాతం మార్కులు వచ్చాయి. అంటే మన రాష్ట్రంలో ఆహార నాణ్యత ప్రమాణాలు 34శాతం ఉన్నట్లు లెక్క. తొలి మూడు స్థానాల్లో మొదటి స్థానం తమిళనాడు 82శాతం, రెండో స్థానం గుజరాత్ 77శాతం, మహారాష్ట్ర 70శాతంగా నిలిచాయి.


మేకిరి దామోదర్
957366650

ఆహార భద్రతకు, కల్తీ ముప్పు నివారణకు తయారీ ప్రదేశాల్లో శుభ్రత, తనిఖీలు, నాణ్యత పర్యవేక్షణ చేయాల్సిన ఆహార తనిఖీ అధికారులు రాష్ట్రంలో 50మంది మాత్రమే ఉన్నారు. వారిలో జీహెచ్ఎంసిలో 26మంది, మిగిలిన రాష్ట్రమంతా మరో 24మంది పనిచేస్తుండటం గమనార్హం. సిబ్బంది కొరత మూలంగా కల్తీ వ్యాపారం మూడు పువ్వులు ముప్పై ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. మన దేశంలోని రాష్ట్రాల్లో ఆహార నాణ్యత సూచీలో తొలిస్థానంలో ఉన్న తమిళనాడులో తనిఖీ వ్యవస్థ పక్కాగా పనిచేస్తుంది. వారి విధానాల నుండి మన పాలకులు స్ఫూర్తిని పొంది, ఆహార నాణ్యత ప్రమాణాలను పెంచాలి. మన రాష్ట్రంలోని ఈ శాఖ సిబ్బందిని, తనిఖీ అధికారుల నియమకాలను చేపట్టాలి. ప్రయోగశాలలు, శాంపిల్ పరీక్షలు పెంచి క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. ఆహార నాణ్యత ప్రమాణాలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో విస్తృతంగా అవగాహన, చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి. తనిఖీలు తూతూ మంత్రంగా కాకుండా కల్తీకి పాల్పడిన వ్యాపారులపై కఠిన శిక్షలు పడేలా చేయాలి. అలాంటప్పుడే ఇంకొకరు కల్తీకి పాల్పడకుండా ఉంటారు. రాష్ట్రవ్యాప్తంగా నడపబడుచున్న ఆహార పదార్థాల సంస్థలైన స్టార్ హెూటల్ నుండి రోడ్ల వెంట, కూడళ్లలో పెట్టుకునే సంచార బండ్ల వరకు అన్నింటికి సంబంధిత శాఖ లైసెన్సులు, అనుమతులు తీసుకునేలా చూడాలి. లేని వాటిపై ఫైన్లు వేసి అన్నింటిని క్రమబద్ధీకరించాలి. అప్పుడే వ్యాపారులకు భరోసా, వినియోగదారులకు భద్రత కలిపిస్తూ.. కల్తీని కట్టడి చేయవచ్చు. వినియోగదారులు కూడా ఇంటి ఆహారాన్ని (హెూమ్ ఫుడ్) తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. కోటి విద్యలు కూటి కోసమే కదా... ఆ కూడే కల్తీ దాన్ని తినడమా! ఇదేం చేటు కాలం. ప్రభుత్వాలు ఆహారభద్రత, నాణ్యతకు భరోసా కల్పించాలి. వినియోగదారులారా మీరు మారండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి... ■



బిజినెస్

వేలాది ఉద్యోగులపై వేటు



- మూడు సంస్థల యోచన
- క్రెడిట్ సూస్సెలో 35వేల సిబ్బంది..
- ఫోర్డ్‌లో 3వేల మంది ఇంటికి..
- గూగుల్‌లోనూ మళ్లీ ఉద్వాసనలు

న్యూఢిల్లీ: బహుళజాతి కార్పొ రేట్ సంస్థలు భారీ ఆదాయాలను ఆర్జిస్తున్నప్పటికీ.. మందగమన భయా లను సాకుగా చూపుతూ.. మరింత పొదుపు చర్యలకు పాల్పడుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది చివరి నుంచి వరుసగా ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి. తొలుత టెక్నలాజీ రంగంలో లక్షలాది మంది సిబ్బందిపై ఉద్వాసనలు ప్రారంభం కాగా.. ఆ తర్వాత తయారీ, స్టార్టప్, ఇతర రంగాల్లోనూ తొలగింపులు ఊపందుకున్నాయి. తాజాగా ప్రముఖ బ్యాంకింగ్ దిగ్గజం క్రెడిట్ సూస్సె, ఫోర్డ్, గూగుల్‌లో వేలాది మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నట్లు రిపోర్టులు వస్తోన్నాయి. అయితే ఈ సంస్థలు భారత్‌లో ఎంత మందిని తొలగించేది స్పష్టత లేదు. స్విట్జర్లాండ్ కేంద్రంగా పని చేస్తోన్న క్రెడిట్ సూస్సె ఏకంగా 35,000 ఉద్యోగులను తొలగించే యోచనలో ఉందని సమాచారం. సంక్షోభంలోని ఈ సంస్థను ఇటీవలే యుబిఎస్ స్వాధీనం చేసుకుంది. సూస్సెలో పని చేసే వారిలో సగానికిపైగా ఉద్యోగులను యుబిఎస్ తొలగించనుందని బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. ప్రస్తుత ఏడాదిలో మూడు దఫాలుగా ఉద్వాసనలు ఉంటాయని తెలుస్తోంది. వచ్చే రెండు మాసాల్లో కఠిన నిర్ణయాలు తీసుకోబోతున్నామని యుబిఎస్ సిఇఒ సెర్గియో ఎర్మోట్టి జూన్ ప్రారంభంలో పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో క్రెడిట్ సూస్సెలో 45వేల మంది ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, మెటా, ట్విట్టర్, గూగుల్, అమెజాన్ తదితర కంపెనీలు తమ వేలాది మంది ఉద్యోగులపై వేటు వేసిన విషయం తెలిసిందే.

గూగుల్ మ్యాపింగ్‌లో తొలగింపులు..

టెక్ దిగ్గజం గూగుల్‌లో మరోసారి ఉద్యోగులపై వేటు పడనుంది. గూగుల్ మ్యాపింగ్ సర్వీస్ వేజ్‌లో ఉద్యోగులను తొలగించాలని యోచిస్తో న్నట్లు ఆ కంపెనీ తెలిపింది. అదే విధంగా వేజ్ అడ్వర్‌టైజింగ్ సాఫ్ట్‌వేర్‌ను గూగుల్ యాడ్స్ టెక్నాలజీ కోసం వినియోగించనున్నట్లు పేర్కొంది. వేజ్ ప్రకటనల మానిటైజేషన్‌కు సంబంధించిన ఉద్యోగాల్లో తొలగింపులుంటా యని గూగుల్ జియో యూనిట్ వైస్ ప్రెసిడెంట్ క్రిస్ ఫిలిప్స్ ఉద్యోగులకు తెలిపారు. అయితే ఎంత మందిపై వేటు వేసేది ఆ సంస్థ వెల్లడించలేదు.

ఫోర్డ్‌లో 3వేల మంది..

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ ఫోర్డ్ తమ ఆదాయం తగ్గడంతో ఉద్యోగులను తగ్గించుకోనున్నట్లు ప్రకటించింది. అమెరికాలో పనిచేస్తున్న వారిలో మూడు వేల మందిని తొలగించనున్నట్లు అంచనా. వీరిలో రెండు వేల మంది సాధారణ సిబ్బంది కాగా, మిగతా వెయ్యి మంది కాంట్రాక్ట్ ఉద్యోగులని రిపోర్ట్‌లు వస్తోన్నాయి. అన్ని స్థాయిల్లో తొలగింపులు ఉండనున్నప్పటికీ.. ప్రధానంగా అధిక వేతనాలు పొందుతున్న ఉన్నత స్థాయి ఉద్యోగులు ఎక్కువ మందిని ఇంటికి పంపించనున్నట్లు సమాచారం.

ఎనిమిదేళ్లలో మూడు రెట్లయిన శాఖలు

- బంధన్ బ్యాంక్ వెల్లడి

హైదరాబాద్: ప్రయివేటు రంగంలోని బంధన బ్యాంక్ గడిచిన ఎనిమి దేళ్లలో తమ శాఖల సంఖ్య మూడు రెట్లు పెరిగిందని వెల్లడించింది. ప్రస్తు తం 1500 పైగా శాఖలకు విస్తరించినట్లు పేర్కొంది. మరో 4,500 బ్యాం కింగ్ యూనిట్ల నెట్‌వర్క్‌తో, మొత్తం బ్యాంకింగ్ అవుట్‌లెట్‌ల సంఖ్య 6,000 ను అధిగమించినట్లు తెలిపింది. 2015 ఆగస్టులో 501 శాఖలతో తన ప్రయాణాన్ని ప్రారంభించినట్లు పేర్కొంది. ప్రస్తుతం 34 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు తమ కార్యకలాపాలను విస్తరించామని బంధన్ బ్యాంక్ ఎండి, సిఇఒ చంద్ర శేఖర్ ఘోష్ తెలిపారు.

ఇంటి పనికి లభించని ప్రతిఫలం

అధిక పని గంటలతో మహిళ సతమతం

చెన్నయ్ : పని గంటలపై తమిళనాడులో చర్చోపచర్చలు సాగుతున్నాయి. గతంలో రోజుకు 9 పని గంటలు మాత్రమే ఉండగా రాష్ట్ర ప్రభుత్వం వాటిని 12కు పెంచింది. అయితే భాగస్వామ్య పక్షాలు, కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. అయినప్పటికీ దీనిపై రాష్ట్రంలో వాడివేడిగా చర్చలు కొనసాగుతున్నాయి. పని గంటలు పెంచితే ఉత్పత్తి పెరుగుతుందని పారిశ్రామికవేత్తలు వాదిస్తుంటే 8 గంటలకు మించి పని చేస్తే కార్మికులు అలసిపోతారని, వారి సమర్థతపై ప్రభావం పడుతుందని కార్మిక సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. పని గంటలను పెంచితే ఉద్యమాల ద్వారా సాధించుకున్న హక్కుకు విఘాతం కలుగుతుందని కార్మికులు వాదిస్తున్నారు.

పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువ సమయం పని చేయాల్సి వస్తోంది. అటు పని ప్రదేశాలలోనూ, ఇటు ఇంటి వద్ద పని చేస్తూ వారు అధిక శారీరక శ్రమకు గురవుతున్నారు. ఇంటి వద్ద చేసే పనికి ఎలాగూ వేతనం అంటూ ఉండదు. అంటే ఏమిటి? కర్మాగారాలలో పని చేస్తే వచ్చే జీతంతోనే వారు సరిపెట్టుకోవాల్సి వస్తోంది. పని గంటలు మాత్రం అధికం. ఒక్క మాటలో చెప్పాలంటే వారు రెండు షిఫ్టులలో పని చేస్తున్నారన్న మాట. ఉదాహరణకు తమిళనాడు గ్రామీణ ప్రాంతాలలో 92.9% మంది, పట్టణ ప్రాంతాలలో 90.4% మంది మహిళలు చేసే పనికి ఎలాంటి ప్రతిఫలం లభించడం లేదు. ఎనిమిది గంటలకు వేతనం తీసుకుంటూ రోజుకు 12-13 గంటలు పని చేస్తున్నారన్న మాట. వీరికి కార్మిక చట్టాలేవీ వర్తించవు. ఎక్కువ గంటలు పని చేయడాన్ని శ్రమ దోపిడీగా పరిగణించడం లేదు. అది ఓ భార్య లేదా తల్లి బాధ్యత అని వితండవాదం చేస్తున్నారు.

వేతనంతో కూడిన పనిలోనూ పురుషులు, మహిళల మధ్య తేడా కన్పిస్తోందని పలు నివేదికలు చెబుతున్నాయి. తమిళనాడు ప్రభుత్వం ఇటీవలే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. నెలవారీ మహిళా విద్యా నిధిని ప్రవేశపెట్టింది. మధ్యాహ్న భోజన పథకంలో అల్పాహారాన్ని చేర్చింది. పని గంటల బిల్లు విషయంలో వెనక్కి తగ్గినప్పటికీ మహిళల శారీరక శ్రమను మాత్రం అర్థం చేసుకోవడం లేదు.

ఇక దేశంలో పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఓ నివేదిక ప్రకారం 15-29 సంవత్సరాల మధ్య వయసున్న మహిళల్లో 85% మంది ఎలాంటి ప్రతిఫలం లేకుండానే ఇంటి పనులు చేస్తున్నారు. వీరి శ్రమకు గుర్తింపు లభించడం లేదు. ఎన్ఎస్ఎస్ నివేదిక ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో 76.7% మంది, పట్టణ ప్రాంతాలలో 81.1% మంది మహిళలు చేసే పనిని ఉత్పాదకత లేని పనిగా పరిగణిస్తున్నారు. అంటే ఇంటి పనిని లెక్కలోకి తీసుకోవడం లేదు. మహిళలు తాము కర్మాగారాలు, ఇతర పని ప్రదేశాలలో చేసే పని కంటే ఇంటి వద్ద నాలుగైదు గంటలు ఎక్కువ సమయమే పని చేస్తున్నారు. అదే పురుషులైతే కేవలం గంటన్నర మాత్రమే ఇంటి పనికి కేటాయిస్తున్నారు. మహిళలు ఆర్థికంగా పురుషుల పైన ఆధారపడాల్సి రావడంతో వారు వృత్తివిద్యకు, నైపుణ్యాభివృద్ధికి దూరమవుతు న్నారు. గృహహింసకు సైతం గురవుతున్నారు.

రాహుల్‌పై అనుచిత వీడియో

బీజేపీ ఐటీ విభాగం చీఫ్‌పై కేసు

బెంగళూరు : బీజేపీ ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవ్యాపై బెంగళూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సామాజిక మాధ్యమాలలో వీడియోను పోస్ట్ చేయడం ద్వారా ప్రజలలో శత్రుత్వాన్ని ప్రేరేపిస్తున్నారని, ప్రజలను రెచ్చగొడుతున్నారని మాలవ్యాపై కర్నాటక పీసీసీ సభ్యుడు రమేష్ బాబు ఫిర్యాదు చేశారు. రాహుల్ గాంధీ పైన, కాంగ్రెస్ పార్టీ పైన దురభిప్రాయం కలిగించేలా ఉన్న యానిమేషన్ వీడియోను మాలవ్యా పోస్ట్ చేశారు. అంతేకాక 'రాహుల్ గాంధీ ప్రమాదకారి. ఆయన ఓ కృత్రిమమైన ఆట ఆడుతున్నాడు. ఆ పార్టీ వారు మరింత ప్రమాదకారులు. భారతదేశ ప్రతిష్టను విదేశాలలో దిగజార్చేందుకు వారు ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. గౌరవనీయ ప్రధాని నరేంద్ర మోడీని అప్రదిష్టపాలు చేసేందుకే వారు ఇలా చేస్తున్నారు' అంటూ ట్వీట్ కూడా చేశారు. దీనిపై ఐపీసీలోని 153(ఏ), 120(బీ), 505(2), 34 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

మతం, జాతి, పుట్టిన ప్రదేశం, నివాసం, భాష ఆధారంగా వివిధ వర్గాల ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని, సుహృద్భావ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని, కుట్రకు పాల్పడ్డారని మాలవ్యాపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు. తనపై కేసు నమోదు కాగానే మాలవ్యా అదే వీడియోను మళ్లీ పోస్ట్ చేస్తూ రాహుల్ గాంధీ విదేశీ బంటు అని ట్వీట్ చేశారు. మాలవ్యా చర్యలపై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే మాట్లాడుతూ చట్టప్రకారం చర్యలు తీసుకుంటే బీజేపీ నాయకులు గగ్గోలు పెడుతుంటారని చెప్పారు. చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించడంలో వారికి సమస్యలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. మాలవ్యాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ఎలాంటి దురుద్దేశం లేదని చెప్పారు.

మాంసం అమ్మకాలపై నిషేధం

కన్వర్ యాత్ర సందర్భంగా యూపీ ప్రభుత్వ ఆదేశం

లక్నో: కన్వర్ యాత్ర సాగే మార్గంలో మాంసా న్ని బహిరంగంగా విక్రయించడంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిషేధం విధించింది. సీనియర్ అధికారుల తో జరిపిన సమీక్షా సమావేశం అనంతరం ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కన్వర్ యాత్ర వచ్చే నెల 4వ తేదీన ప్రారంభమవుతుంది. ఈ సంవత్సరం అధిక మాసం వచ్చినందున శ్రావణ మాసం రెండు నెలల పాటు కొనసాగుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కాలంలో శ్రావణ శివరాత్రి, నాగపంచమి, రక్షా బంధ న్ పండుగలను ప్రజలు జరుపుకుంటారని ఆయన తెలిపారు. భక్తుల మనోభావాలను గౌరవి స్తూ కన్వర్ యాత్ర మార్గంలో మాంసాన్ని బహి రంగంగా అమ్మడంపై నిషేధం విధించామని వివరించారు. ఈ మార్గం శుభ్రంగా ఉండాలని, ఎప్ప టికప్పుడు పారిశు ధ్య చర్యలు చేపట్టాల్సి ఉంటుందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొ చ్చారు. మత ప్రాతిపదికన ప్రజలను రెచ్చగొట్టేం దుకు కొందరు దుండగులు ప్రయత్నిస్తారని, వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశిం చారు. బక్రీద్ సందర్భంగా నిర్దేశించిన మార్కెట్ ప్రదేశాలలో తప్ప ఎక్కడా జంతువధ జరగకుండా చూడాలని అన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, ఛాటింగ్ యాప్స్ ద్వారా మత మార్పిడులు జరుగుతున్నాయని చెబుతూ ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. అంతర్జాతీయ సిండికేట్ ఈ అక్రమ మత మార్పిడులకు పాల్పడుతోందని ఆరోపించారు. గత సంవత్సరం శ్రావణ మాసంలో కోటి మంది భక్తులు వారణాసిలోని కాశీ విశ్వనాథ దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ నెలలో ప్రతి సోమవారం ఆరు లక్షల మంది దేవాల యాన్ని సందర్శిస్తారు.

ఏఐకేఎస్ ఆందోళన విజయవంతం

- తమిళనాడు మామిడి రైతులకు ఊరట

చెన్నయ్ : తమిళనాడులో మామిడి రైతుల కోసం అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) చేపట్టిన ఆందోళన విజయవంతం అయింది. దిండిగల్ జిల్లాలో ఇరు పక్షాలకూ ఆమోదయోగ్యమైన ధర చెల్లించి రోజుకు 400 టన్నుల మామిడి కాయలను కొనుగోలు చేసేందుకు అధికారులు అంగీకరిం చారు. మామిడి సీజన్ ముగుస్తుండడంతో టన్ను మామిడి కాయల ధర రూ.7000 నుండి రూ.14,000 మాత్రమే పలుకుతోంది. గత సంవత్సరం ఇదే కాలంలో టన్ను మామిడి కాయలకు రూ.30,000 నుండి రూ. 70,000 వరకూ ధర లభించింది. ధరలను తగ్గించేందుకు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడడంతో ప్రస్తుతం టన్నుకు రూ.6,500 మాత్రమే లభిస్తోంది.

దీంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలోని 15,800 హెక్టార్లలో మామిడిని పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కనీసం నాలుగు ప్రాంతాలలో కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర చెల్లించాలని ఏఐకేఎస్, రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతులు తమ డిమాండ్ల సాధన కోసం ఏఐకేఎస్ నేతృత్వంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. రైతుల ఆందోళన నేపథ్యంలో సీజన్ ముగిసే వరకూ రోజుకు 400 టన్నుల మామిడి కాయలు కొనుగోలు చేసేందుకు జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీ అంగీకరించిందని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి రామస్వామి తెలిపారు. రైతులకు న్యాయమైన ధర లభించాలంటే ప్రభుత్వమే వ్యవసాయ సహకార సంఘాల ద్వారా మామిడి కాయలు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అత్యుత్తమ పెట్టుబడికి అధ్యయనం ముఖ్యం

- ఆలిస్ బ్లూ సిఇఒ సిధవేలాయుధం

చెన్నయ్ : స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు అధిక అధ్యయనం అవసరమని ఆలిస్ బ్లూ సిఇఒ సిధవేలాయుధం పేర్కొన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడుల కోసం స్టాక్‌లు, ఈక్విటీ ఫండ్‌ల మధ్య నిర్ణయం తీసుకోవాల్సి వస్తే అనుభవం లేకపోతే ఇన్వెస్టర్లు నలిగి పోతారని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "మీ పెట్టుబడి దృక్పథం దీర్ఘకాలికంగా ఉంటే.. మార్కెట్‌ను అర్థం చేసుకోవడానికి మీకు సమయం, అనుభవం లేనట్లయితే.. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో ఎటువంటి సందేహం లేకుండా పెట్టుబడి పెట్టాలి. అయితే.. మీరు దీర్ఘకాలిక పెట్టుబడి కోసం స్టాక్‌లను పరిశోధించే నైపుణ్యాన్ని కలిగి ఉంటే, వాటిని క్రమ పద్ధతిలో పరిశీలించి, ఓపికను అలవర్చుకుంటే, మీరు విజయవంతమైన పెట్టుబడిదారుగా మారే అవకాశం ఉంది." అని పేర్కొన్నారు.

చాలా మంది కొత్తగా పార్ట్ టైమ్ ఇన్వెస్టర్లు నేరుగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం, ఈక్విటీ ఫండ్స్ ద్వారా ఇన్వెస్ట్ చేయడం మధ్య నలిగిపోతున్నారన్నారు. వ్యక్తిగత దీర్ఘకాలిక పెట్టుబడిదారులు పెద్ద మొత్తంలో సంపదను పోగుచేసుకోవడం నిజమే అయినప్పటికీ, ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

ఇవి వినూత్నతలకు ఎంజి మోటార్ మద్దతు

న్యూఢిల్లీ: విద్యుత్ వాహన రంగంలో వినూత్నతను ప్రోత్సహించడానికి ఎంజి మోటార్స్ తీసుకున్న ఎంజి డెవలపర్ ప్రోగ్రామ్, గ్రాంట్ సీజన్ 4.0 ముగిసినట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ సీజన్‌లో 250కి పైగా దరఖాస్తులను అందుకున్నట్లు పేర్కొంది. ఇందులో 30 శాతం మహిళ ఔత్సాహికవేత్తల ఉత్పత్తులు ఉన్నట్లు తెలిపింది. ప్రథమంగా నిలిచిన 14 బృందాలను షార్ట్ లిస్ట్ చేశామని ఎంజి మోటార్ ఇండియా డిప్యూటీ ఎండి గౌరవ్ గుప్తా తెలిపారు. ఎంపికైన సంస్థలు, ఆవిష్కర్తలు, ఔత్సాహికవేత్తలకు అగ్రగామి సంస్థల సహకార సమన్వయంతో మద్దతును అందించనున్నామన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

- మంత్రి కేటీఆర్‌పై చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అంతకుముందు తెలంగాణ అభివృద్ధి జరగలేద న్నట్టు...బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే అభివృద్ధి జరిగినట్టు మంత్రి కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తు న్నారని టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. బుధవారం హైద రాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ మోడల్ అంటూ హైదరాబాద్ అభివృద్ధిని బీఆర్ఎస్ ఖాతాలో వేసు కునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హైదరా బాద్‌కు అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు కాం గ్రెస్ హయాంలోనే వచ్చాయన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఎంతమందికి ఇచ్చారో కేటీఆర్ సమా ధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ పేరుతో తెలంగాణ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంలో పేద ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించు కుంటుందా? అని ప్రశ్నించారు. తొమ్మిదేండ్లలో కేసీఆర్ పాలనలో మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ అప్పుల రాష్ట్రంగా మారిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు ఇంటికి పంపడం ఖాయమని చెప్పారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు హామీలతో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిందన్నారు. తెలంగాణ అభివృద్ధి అంతా పైన పటారం లోన లొటారంగా ఉందని ఎద్దేవా చేశారు.

ధరణి లోపాలపై జవాబేది? :కోదండరెడ్డి

అవినీతి, దళారీ వ్యవస్థను తొలగించేందుకే ధరణి తెచ్చామంటూ సీఎం చెప్పడం సిగ్గుచేటని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి అన్నారు. ధరణి లోపా లపై అడిగిన ప్రశ్నలకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జవాబు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు 24 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు పంచితే, బీఆర్ఎస్ అధికారం లోకి వచ్చాక సీఎం నియోజకవర్గంలో 1500 ఎకరాల అసైన్డ్ భూమి చట్ట విరుద్ధంగా 600 ఎకరాలు అమూల్ కంపెనీకి, గంగుల కమలాకర్‌కు 50 ఎకరాలు ఇచ్చారని చెప్పారు.

జాతీయ ఉత్తమ టీచర్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

- జులై 15 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ ఏడాదికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి కేంద్ర విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నదని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 15లోగా http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశముందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆ వెబ్‌సైట్‌ను సంప్రదించి పూర్తి వివరాలను తెలుసుకోవాలని కోరారు.

ధ్రువపత్రాల పరిశీలనకు 13,248 మంది హాజరు

- ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో

973 మంది ఆప్షన్ల నమోదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియలో బుధవారం 13,248 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. 63,455 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకున్నారని తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు వచ్చేనెల ఐదో తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. బుధవారం 973 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని వివరించారు. వచ్చేనెల ఆరు వరకు ధ్రువపత్రాల పరిశీలన, ఎనిమిదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు గడువుందని తెలిపారు. ఇతర వివరాల కోసం www.: //tseamcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు ఐసెట్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ రాతపరీక్షల ఫలితాలు గురువారం విడుదల కానున్నాయి. ఈ మేరకు ఐసెట్ కన్వీనర్ పి వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఫలితాలను గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)లోని కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి విడుదల చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ వీసీ తాటికొండ రమేష్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్కే మహమూద్, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు పాల్గొంటారని పేర్కొన్నారు. గతనెల 26,27 తేదీల్లో నిర్వహించిన ఐసెట్ రాతపరీక్షలకు 37,112 మంది అబ్బాయిలు, 38,815 మంది అమ్మాయిలు, ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు కలిపి మొత్తం 75,932 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 70,900 మంది హాజరయ్యారు.

విద్యార్థులు ఉగ్రవాదులా?

- నాగర్ కర్నూల్‌లో అక్రమ అరెస్టులకు ఎస్ఎఫ్ఐ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాగర్ కర్నూల్ జిల్లాలో ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆ సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు వెళ్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులను పోలీసులు మధ్యలో అడ్డగించి, అక్రమంగా అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారని తెలిపారు. వారిపై కేసులు బనాయించారని పేర్కొన్నారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సమస్యలను పరిష్కారం కోసం పోరాడుతున్న విద్యార్థి నాయకులను ఈడ్చుకుంటూ తీసుకెళ్లి అరెస్ట్ చేయడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. విద్యార్థులేమైనా ఉగ్రవాదులా? అని ప్రశ్నించారు. పేద విద్యార్థుల చదువుకు ఆటంకంగా ఉన్న సమస్యలను పరిష్కరిం చాలనీ, లేదంటే ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైల్వేల్లో 2.74 లక్షల ఖాళీలు

న్యూఢిల్లీ: భారతీయ రైల్వే శాఖలో భారీగా ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. అన్ని విభాగాల్లో కలిపి దాదాపు 2.74లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉండగా.. వీటిలో ఒక్క సేఫ్టీ కేటగిరీలోనే 1.7లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నట్టు రైల్వే శాఖ తాజాగా వెల్లడించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన సమాచార హక్కు చట్టం కార్యకర్త చంద్రశేఖర్ గౌర్ రైల్వేల్లో ఖాళీలపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు వెల్లడించింది. రైల్వేశాఖలో గ్రూప్ సీ కేటగిరీ (లెవెల్ 1 లేదా ఎంట్రీ లెవెల్ స్టాఫ్)లోనే 2,74,580 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపింది. వీటిలో ఒక్క భద్రతకు సంబంధించిన కేటగిరీలోనే 1,77,924 ఖాళీలు ఉన్నట్టు పేర్కొంది. ఈ ఏడాది జూన్ 1 నాటికి సేఫ్టీ కేటగిరీలో 9,82,037 పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా.. 8,04,113 ఉద్యోగాలను భర్తీ చేసినట్టు సమాధానంలో పేర్కొంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, త్వరితగతిన పదోన్నతులు కల్పించడం, శిక్షణ తర్వాత కోర్ ఉద్యోగాలకు నాన్-కోర్ సిబ్బందిని తరలించడం వంటి చర్యల ద్వారా సమస్యను పరిష్కరిస్తున్నట్టు రైల్వేశాఖ అధికార ప్రతినిధి అమితాబ్ శర్మ తెలిపారు. కాగా, రైల్వేశాఖలో మొత్తంగా 3.12లక్షల నాన్ గెజిటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ 2022 డిసెంబర్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే.

రాష్ట్రానికి మరో ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీ

టీసీఎల్ గ్రూపు రూ.225 కోట్ల పెట్టుబడి

- తొలి దశలో 500 ఉద్యోగావకాశాలు
- మంత్రి కేటీఆర్ సమక్షంలో టీసీఎల్-రిసోజెట్ సంస్థ ప్రతినిధుల అవగాహన ఒప్పందం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీ టీసీఎల్ తెలంగాణలో తన కార్యకలాపాలను ప్రారంభించ నున్నది. రాష్ట్రానికి చెందిన రిసోజెట్ సంస్థతో కలసి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనున్నది. ఈ మేరకు పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో రిసోజెట్‌తో టీసీఎల్ సంస్థ ప్రతినిధులు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చు కున్నారు. రిసోజెట్‌తో కలిసి టీసీఎల్ ఒక జాయింట్ వెంచర్ సంస్థ రూపంలో ప్రపంచ స్థాయి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. ఆ రంగంలో విస్తత ఉత్పత్తుల శ్రేణిని కలిగిన టీసీఎల్ ఎలక్ట్రానిక్స్ తన ప్రధాన కేంద్రమైన చైనాలోని హెఫెయి నగరం తర్వాత విదేశంలో ఏర్పాటు చేస్తున్న తొలి తయారీ యూనిట్ ఇదే కావడం విశేషం. తొలుత వాషింగ్ మెషిన్లను తయారు చేసేందుకు ఉద్దేశించిన ఈ తయారీ కేంద్రం నుంచి సమీప భవిష్యత్తులో రిఫ్రిజిరేటర్లు, డిష్ వాషర్లను కూడా ఉత్పత్తి చేయనున్నారు.

రంగారెడ్డిలోని రావిర్యాల్లో ఉన్న ఈ-సిటీలో ఏర్పాటు చేయనున్న తయారీ యూనిట్ కోసం టీసీఎల్ సంస్థ రూ.225 కోట్ల పెట్టుబడిగా పెట్టనున్నది. ఈ తయారీ యూనిట్ ద్వారా సుమారు 500 మందికిపైగా ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు తొలిదశలోనే రానున్నాయి. రాష్ట్రానికి టీసీఎల్ కంపెనీ రాకను మంత్రి కేటీఆర్ స్వాగతించారు. తెలంగాణ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, హైటెక్నాలజీ ఉత్పత్తుల తయారీకి ఇక్కడ అవకాశమున్నదని తెలిపారు. టీసీఎల్ కంపెనీ పెట్టుబడి ద్వారా రాష్ట్రం ఎలక్ట్రానిక్స్ రంగంలో తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటుందని వివరించారు. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీకి తెలంగాణ అత్యంత అనువైన ప్రాంతమని, టీసీఎల్ కంపెనీ రాష్ట్రంలో తమ ఉత్పత్తులను తయారు చేసేందుకు ముందుకు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్న రిసోజెట్ కంపెనీ ఎండీ రమీందర్‌సింగ్ సోయిన్, టీసీఎల్ ప్రతినిధులకు కేటీఆర్ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. టీసీఎల్ తయారీ యూనిట్‌కి అవసరమైన అన్ని రకాల సహకారాన్ని రాష్ట్రం అందిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరాన్ని పెన్షన్ ఆఫ్ ఇండియాగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలను, టీసీఎల్ సంస్థ చైర్మెన్ జువాన్ డూకి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ తయారీ విధానానికి ఉన్న అనుకూల పరిస్థితులు, మౌలిక వసతుల రంగంలో ఉన్న సౌకర్యాలను పరిశీలించేందుకు తెలంగాణ రాష్ట్రంలో పర్యటించాలని ఆమెను కేటీఆర్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కంపెనీ రిసోజెట్ గ్రూప్ చైర్మెన్ రమీందర్ సింగ్ సొయిన్, తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ విభాగం డైరెక్టర్ సుజాయ్ కారంపురి తదితరులు పాల్గొన్నారు.

తప్పుదోవ పట్టించిన మంత్రి హరీశ్ రావు

హెచ్‌ఆర్‌డీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణంపై వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు వాస్తవాలను పక్కదారి పట్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్ డీఏ) విమర్శించింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షులు కె.మహేశ్ కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2009లో నాటి ముఖ్యమంత్రి రోశయ్య ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించారని తెలిపారు. 2014 తర్వాత ఉస్మానియా ఆస్పత్రికి సంబంధించిన బ్లూప్రింట్ గానీ లేదా ప్లాన్ గానీ లేదా నిధుల కేటాయింపునకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు కాని ఇవ్వలేదని తెలిపారు. గత నాలుగేండ్లుగా పాత వారసత్వ భవనంపై ప్రభుత్వం ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని? ప్రశ్నించారు. పాత భవనం కూల్చి వేసి లేదా కూల్చివేయకుండా కొత్త భవన నిర్మాణంపై ప్రభుత్వ నిర్ణయమేంటని హైకోర్టు అడిగినా, గత నాలుగున్నరేండ్ల నుంచి ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నించారు. చివరిసారిగా 2022 డిసెంబర్ 13న కోర్టు, ప్రభుత్వ వైఖరి ఏంటని? అడిగి ఆరు నెలలు గడుస్తున్నా...ప్రభుత్వం నుంచి స్పందన లేదని విమర్శించారు. కోర్టు నిర్ణయం తీసుకుంటుందని వైద్యారోగ్యశాఖ మంత్రి చెప్పడం తప్పుదోవ పట్టించడమేనని పేర్కొన్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో సమీక్షలను ఆపి, కోర్టులో కొత్త బిల్డింగ్ బ్లూ ప్రింట్, అఫిడవిట్ దాఖలు చేసి, నిధులను కేటాయించి, నిర్దేశిత సమయంలో భవన నిర్మాణం పూర్తి చేసేందుకు పూనుకోవాలని కోరారు.

డీఎంఈకి వినతి...

ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవనాన్ని నిర్మించాలని జాయింట్ అసోసియేషన్ ఫర్ న్యూ ఒజీహెచ్ (హైదరాబాద్) కోరింది. ఈ మేరకు అసోసియేషన్ నాయకులు రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. పాత భవనంలో వైద్యమందించడం ఇబ్బందికరంగా మారిందనీ, రోగులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు.

విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మెరిట్ విద్యార్థులకు బహుమతుల ప్రదానం కార్యక్రమంలో మంత్రి కొప్పు ఈశ్వర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్వరాష్ట్రంలో విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సెలెబ్రేటింగ్ సక్సెస్ మీట్ కార్యక్రమానికి మంత్రి హాజరై ప్రసంగించారు. నాడు పాలకల నిర్లక్ష్యం, వసతుల లేమితో కుదేలైన విద్యారంగం సర్కార్ నిర్ణయాలతో బలోపేతమయ్యిందన్నారు. తెలంగాణలో గురుకుల విద్యా వ్యవస్థను ఉన్నత స్థాయికి తీసుకొచ్చామని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు 298 గురుకుల విద్యాసంస్థలు ఉండగా నేడు 1030కి పెంచుకోవడం జరిగిందన్నారు. కోట్లాది రూపాయల నిధులతో సకల వసతులు సమకూర్చుకుని కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యా బోధన జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యారంగం అభివద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలతో గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రతి ఏటా గురుకుల విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం పోటీ పెరుగుతోందన్నారు.

తెలంగాణ రాష్ట్రమే ఎడ్యుకేషన్ హబ్‌గా రూపుదిద్దుకున్నదన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలన్నీ తెలంగాణ వైపు చూస్తున్నాయని చెప్పారు. 'మనఊరు-మనబడి'తో ఎవరూ ఊహించనంతగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మంత్రి చెప్పారు. ఇంగ్లీష్ మీడియంతోపాటు డిజిటల్ విద్యాబోధన అందించడం వల్ల ప్రతి ఏటా ఉత్తీర్ణతా శాతం పెరుగుతున్నదన్నారు. పోటీ పరీక్షల్లో గురుకుల విద్యార్థులు ప్రతిభచాటుతూ తెలంగాణ ఖ్యాతిని దేశ వ్యాప్తంగా తెలియచేస్తున్నారని అన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లల్లో మంచి గైడ్ లైన్స్ పాటించడంతో 95 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఇది తెలంగాణ ప్రభుత్వం గొప్పతనం అన్నారు. జాతీయ స్థాయిలో మూడు వేల మంది విద్యార్థులకు వివిధ స్థాయిల్లో అవకాశం దక్కిందన్నారు. రాబోయే రోజుల్లో విద్యారంగంలో మరిన్ని విజయాలు తప్పక చేకూరుతాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి రోనాల్డ్‌రోస్, ట్రైబల్ వెల్ఫేర్ విద్యాసంస్థల కమిషనర్ క్రిస్టినా తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష మార్పు ఒట్టిమాటే

బూత్‌ల వారీగా పార్టీ బలోపేతానికే విస్తారక్‌ల రాక : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రాష్ట్రంలో అధ్యక్షుడి మార్పు ఒట్టిమాటే. తరుణ్‌చుగ్‌తో సహా అనేకసార్లు జాతీయ నాయకులు మార్పు ఉండదని చెప్పినా తప్పుడు వార్తలు ఆగడంలేదు. ఆ వార్తలన్నీ చూసీచూసీ అలవాటైపోయింది. దీన్ని తమ కార్యకర్తలెవ్వరూ పట్టించుకోవట్లేదు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ అన్నారు. 'మేరా బూత్ సబ్‌సే మజ్బూత్' కార్యక్రమంలో పార్టీ బలోపేతం కోసం బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన విస్తారక్‌లకు ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీని బూత్‌ల వారీగా తమ పార్టీని బలోపేతం చేసేందుకే ఆయా రాష్ట్రాల నుంచి 650 మంది విస్తారక్‌లు తెలంగాణకు వచ్చారని తెలిపారు. మంచిర్యాల, ఖాజీపేట, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ల నుంచి మండల కేంద్రాలకు వెళ్లారన్నారు. వారంతా పోలింగ్ బూత్‌ల వారీగా పార్టీని బలోపేతం చేసే పనిలో నిమగ్నమవుతారని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీని బలహీనం చేసేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈటల హత్యకు కుట్ర చేసిన వారిపై తక్షణమే విచారణ జరపడంతోపాటు బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈటల రాజేందర్‌కు కచ్చితంగా తగిన భద్రత కల్పించాలని కోరారు. పార్టీ బలోపేతం కోసమే ఈనెల 8న 11 రాష్ట్రాల అధ్యక్షులు, సంఘటనా మంత్రుల సమావేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

రెండు కొత్త మండలాల ఏర్పాటు

- ఆయా గ్రామాలను సరిహద్దు జిల్లా, మండలాల్లోకి మార్పు
- ఉత్తర్వులు జారీచేసిన రెవెన్యూశాఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రెండు కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కొత్త మండలాలతో పాటు పరిపాలన సౌలభ్యం, అభివృద్ధి దృష్ట్యా కొన్ని గ్రామాలను సరిహద్దు మండలాలతోపాటు జిల్లాల్లోకి కూడా మార్చారు. మార్పులు, చేర్పులు రెవెన్యూ శాఖ ప్రతిపాదనలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. కొత్త మండలాల ఏర్పాటు, గ్రామాల మార్పునకు సంబంధించిన ఏమైనా అభ్యంతరాలు ఉంటే 15రోజుల్లో తెలియజేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి డివిజన్ చిట్యాల మండలంలోని గిద్దెముత్తారం, కల్వపల్లే గ్రామాలతోపాటు పెద్దపల్లి జిల్లాలోని మంథని డివిజన్ ముత్తారం మండలంలోని శాంతరాజుపల్లిని జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన టేకుమట్ల మండలంలో కలపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఇదే జిల్లాలో కొత్తపల్లిగోరి అనే కొత్త మండలాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఉన్న రేగొండ మండలంలోని కొత్తపల్లిగోరి, చెన్నపూర్, చెన్నకొడేపాక, జగ్గయ్యపేట, సుల్తాన్ పూర్, జంషెడ్‌బేగ్‌పేట్, కొనరావుపేట్ గ్రామాలను కొత్తపల్లిగోరి మండలానికి కేటాయించింది.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్‌లో కొత్తగా ఇర్విన్ మండలాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఉన్న మాడ్గుల మండలంలోని ఇర్విన్, బ్రాహ్మణపల్లి, ఆర్కపల్లి, అందుగుల, అన్నేబోయినపల్లి, సుద్ధపల్లి, గిరికొత్తపల్లి, కలకొండ, రమణంపల్లి గ్రామాలను ఇర్విన్ మండలానికి కేటాయించింది.

హన్మకొండ జిల్లాలోని వేలేర్ మండలంలోని కన్నారం, ఎర్రబెల్లి గ్రామాలను అభివృద్ధి దృష్ట్యా వేర్వేరు జిల్లాల్లోకి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. కన్నారం గ్రామాన్ని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని అక్కన్నపేట మండలంలోకి మార్చనుంది. ఎర్రబెల్లి గ్రామాన్ని హన్మకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలంలోకి మార్చనుంది.

జులై 13న చంద్రయాన్-3

న్యూఢిల్లీ : ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న చంద్రయాన్-3 ప్రయోగానికి తేదీ ఖరారయ్యింది. జులై 13 మధ్యాహ్నం 2.30 గంటలకు జాబిల్లి వైపు దూసుకెళ్లనుంది. ఈ విషయాన్ని ఇస్రో అధికారికంగా బుధవారం ప్రకటించింది. ఈ మిషన్‌కు సంబంధించిన పనులు ఇప్పటికే దాదాపు పూర్తయినట్లు సమాచారం. యువ శాస్త్రవేత్త వీరముత్తుయేల్ సారథ్యంలో రూపుదిద్దుకున్న ఈ ఉపగ్రహం అనుసంధాన పనులతోపాటు రోవర్, ల్యాండర్ బిగింపు పనులు ఏకకాలంలో చేస్తున్నారు. శ్రీహరికోటలోని షార్ నుంచి జీఎస్ఎల్వీ ఎం-3 భారీ వాహకనౌక ద్వారా ఈ ప్రయోగం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.615 కోట్లు కేటాయించింది. ఇక చంద్రయాన్-1ను 2008లో చేపట్టగా.. అది విజయవంతంగా చంద్రుడి ఉపరితలంపై నీటి జాడలను గుర్తించిన విషయం తెలిసిందే. అయితే, అది రెండేళ్ల పాటు పనిచేసే విధంగా రూపొందించినప్పటికీ.. దాదాపు ఏడాదిలోనే దాంతో సంబంధాలు తెగిపోయాయి. చంద్రుడి చుట్టూ తిరుగుతూ మొత్తం 312 రోజులు సేవలు అందించిన తర్వాత.. ఆ మిషన్ ముగిసినట్లు ఆగస్టు 2009లో ఇస్రో ప్రకటించింది. అనంతరం చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని ఆవిష్కరించడమే లక్ష్యంగా ఇస్రో చేపట్టిన చంద్రయాన్-2.. చంద్రుడి ఉపరితలంపై సాఫ్ట్‌ల్యాండింగ్ సమయంలో విఫలమైంది. అయినప్పటికీ ఎనిమిది సాంకేతిక పరికరాలతో కూడిన ఆర్బిటర్ మాత్రం చంద్రుడి కక్ష్యలో విజయవంతంగా తిరుగుతోంది. ఇక చంద్రయాన్ 3 మిషన్ విజయవంతమైతే మాత్రం భారత అంతరిక్ష పరిశోధనలో కీలక అడుగుపడినట్లే.

సోలిపేటకు మంత్రి హరీశ్ నివాళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిద్దిపేట జిల్లాకు చెందిన మాజీ ఎంపీ సోలిపేట రామచంద్రారెడ్డి మరణించడం పట్ల రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాదులో సోలిపేట రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించారు.

ఓట్ల కోసమే...

- బీజేపీ తెరపైకి కామన్ సివిల్ కోడ్ : టీపీసీసీ అధికార ప్రతినిధి కృష్ణతేజ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్లు దండుకునేందుకే కామన్ సివిల్ కోడ్‌ను తెరపైకి తెచ్చిందంటూ టీపీసీసీ అధికార ప్రతినిధి కృష్ణతేజ విమర్శించారు. అది స్వచ్ఛంగా ఉండాలే కానీ తప్పనిసరి కాదని 21వ లా కమిషన్ చెప్పిందని గుర్తు చేశారు. దీని అమలు చేయాలంటే భవిష్యత్తులో అందర్ని కలుపుకునిపోవాలని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సూచించారని తెలిపారు. బుధ వారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో అధికార ప్రతినిధులు శ్రీరంగంసత్యం, కల్వసుజాతతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రధాని నీతులు చెప్పడమే తప్ప బీజేపీ నేతలను కట్టడి చేయడం లేదని విమర్శించారు. కేంద్ర హోంమంత్రి కుమారుడు జై షా, ఎంపీ బ్రిజ్‌భూషణ్ ప్రవర్తన వివాదమవుతున్నా...బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట కవిత విషయంలోనూ బీజేపీ సర్కారు చర్యలు తీసుకోవడం లేదన్నారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ...తెలంగాణలో అసలు సమస్యలే లేవన్నట్టు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని భూ నిర్వాసితుల సమస్యలపై చర్చకు వస్తారా? అని సవాల్ విసిరారు. పేపర్ లీకేజీ విషయంలోనూ మంత్రి కేటీఆర్ అతి తెలివిగా మాట్లాడి తన చాణక్యనీతి ప్రదర్శించారని ఎద్దేవా చేశారు.

హయ్యర్ పెన్షన్ సమస్యలపై 3న ధర్నా

- టీఎస్ఆర్టీసీ జేఏసీ ప్రకటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హయ్యర్ పెన్షన్ ఆన్‌లైన్ సమస్యల పరిష్కారం కోసం జులై 3వ తేదీ బర్కత్‌పురాలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు టీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ప్రకటించింది. బుధవారం టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీస్‌లో జేఏసీ సమావేశం చైర్మెన్ కే రాజిరెడ్డి అధ్యక్షతన జరిగింది. కన్వీనర్ వీఎస్ రావు, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, జేఏసీ నాయకులు పీ రవీందర్‌రెడ్డి, ఎమ్ వెంకట్‌గౌడ్, ఎన్ మంగ, డి.గోపాల్ , కె.రాంరెడ్డి, బి.జకరయ్య, కె.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జేఏసీ కలిసి పనిచేస్తామని టీఎమ్‌యూ ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి లేఖ ద్వారా తెలిపారు. ఆయన తరపు ప్రతినిధులుగా బీ యాదయ్య, ఎన్ కమలాకర్, బి.నరేందర్, జీపీఆర్ రెడ్డి పాల్గొన్నారు. కార్మికులు తక్షణం ఎదుర్కొంటున్న ప్రధానమైన రెండు సమస్యలపై జేఏసీ నిర్ణయం తీసుకుంది. పీఎఫ్-కేవైసీ అనుసంధానం, హయ్యర్ పెన్షన్ సమస్యలపై ధర్నా చేయాలని నిర్ణయించారు. చనిపోయిన ఉద్యోగుల పిల్లలు, మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగంలో చేరిన వారికి రెగ్యులర్ ఉద్యోగులకు ఇస్తున్న అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జేఏసీ కలిసి వచ్చే అన్ని సంఘాలతో కలిసి ముందుకు సాగుతామని తెలిపారు.

అరుణాచలం బస్సులు ఫుల్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తొలిసారిగా టీఎస్ఆర్టీసీ గురుపౌర్ణమి సందర్భంగా జులై 3వ తేదీ తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సుల్ని అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. మొత్తం 15 బస్సుల్ని ఏర్పాటు చేయగా వాటిలో 13 బస్సుల్లో సీట్లు ముందస్తు రిజర్వేషన్లతో నిండిపోయాయనీ, మిగిలిన బస్సుల్లో కూడా కొద్ది సీట్లే ఉన్నాయని ఆ సంస్థ మేనేజింగ్‌డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ నుంచి 12, వేములవాడ నుంచి 2, మహబుబ్‌నగర్ నుండి ఒక బస్సును అరుణాచలానికి ఏర్పాటు చేశామన్నారు. భక్తుల డిమాండ్ దృష్ట్యా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసేందుకు సంస్థ సిద్ధంగా ఉందని తెలిపారు. అరుణాచలం టూర్ ప్యాకేజీ ముందస్తు రిజర్వేషన్ కోసం టీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ www.tsrtconline.in ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పారిశ్రామికంగా అభివృద్ధి సాధించాం

- జిల్లా కేంద్రాల్లోనూ ఎగ్జిబిషన్లు పెట్టండి : ఎక్స్‌పో-2023 ప్రారంభోత్సవంలో మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్రం పారిశ్రామికంగా అద్భుత ప్రగతి సాధించిందని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ముందుచూపు వల్లే ఈ విజయం సాధ్యమైందని చెప్పారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ టెక్నాలజీ ఎక్స్‌పో-2023ని ఆయన ప్రారంభించారు. పారిశ్రామిక వేత్తలు మీలా జయదేవ్, తారా సత్యవతి, విష్ణువర్ధన్‌రెడ్డి, అనిల్ అగర్వాల్, శ్రీనివాస్ మహంకాళి, సురేష్ కుమార్ సింఘాల్, పాస్ పోర్ట్ అధికారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు వినూత్నంగా తయారు చేస్తున్న ఉత్పత్తుల ప్రదర్శనలను జిల్లా కేంద్రాల్లోనూ ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా వ్యవసాయ రంగంతో పాటు చేపలు, మాంసం ఉత్పత్తుల్లో పూర్తి స్థాయి వృద్ధిని సాదించామన్నారు. మిల్లెట్స్ సాగులో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందనీ, రైతాంగం పత్తి వైపు మొగ్గు చూపడంతో ప్రస్తుతం ఈ సాగు తగ్గిందన్నారు.

ఆర్టీసీ మెగా రక్తదాన శిబిరాలకు అనూహ్య స్పందన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ ఏర్పాటు చేసిన 101 రక్తదాన శిబిరాలకు అనూహ్య స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో 3,315 మంది రక్తదానం చేశారని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వీరంతా స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొని, తమ సామాజిక బాధ్యతల్ని నిర్వర్తించారని ప్రసంసించారు. ఒక్కొక్కరి నుంచి యూనిట్ 350 ఎమ్ఎల్ చొప్పున మొత్తం 3315 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు తెలిపారు. టీఎస్ఆర్టీసీ సామాజిక సేవా కార్యక్రమాలల్లోభాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు.

విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తే ప్రోత్సాహకాలు : కేంద్ర ఆర్థికశాఖ వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత విద్యుత్ సంస్కరణల్ని అమలు చేస్తే భారీగా రాష్ట్రాలకు ప్రోత్సాహకాలను ఇస్తామని కేంద్ర ఆర్థికశాఖ ప్రకటించింది. 2023-23 ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాల కోసం రూ.1,43,332 కోట్ల ప్రోత్సహకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ బుధవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేసింది. సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకు దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో 0.5శాతం అదనపు రుణాలు ఇస్తామని తెలిపింది. ఇప్పటికే అనేక రాష్ట్రాలు ఈ మేరకు రూ.66,413 కోట్ల లాభాల్ని పొందాయని వివరించారు.

2న గ్రూప్-1, గ్రూప్-2పై ఉచిత అవగాహనా సదస్సు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏపీలో త్వరలో నిర్వహించబోయే గ్రూప్-1, గ్రూప్-2 రాతపరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు వచ్చేనెల రెండో తేదీన ఉదయం తొమ్మిది గంటలకు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఉన్న తమ అకాడమిలో ఉచిత అవగాహన సదస్సును నిర్వహించనున్నట్టు అమిగోస్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమి ప్రకటించింది. గ్రూప్-1, గ్రూప్-2 సిలబస్, సన్నద్ధత, ప్రణాళిక, నోట్స్ మేకింగ్, సమయపాలన వంటి అంశాలపై సీనియర్ అధ్యాపకులతో సమగ్ర అవగాహన కల్పిస్తామని ఆ అకాడమి నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-2 ప్రిలిమ్స్ రాష్ట్రస్థాయి మాక్ పరీక్షను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు వ్యవసాయ మార్కెట్ పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా, మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ శంభీపూర్ రాజు విచ్చేస్తున్న నేపథ్యంలో, కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత తొమ్మిదిన్నర ఏండ్ల కాలం నుంచి కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో, ఎంతో అభివృద్ధి చేసుకున్నామని ,ఎన్నో ఏండ్లుగా పరిష్కారం కానీ పను లు ఇప్పుడు నెరవేరాయని పేర్కొన్నారు. కేపీహెచ్‌బీలోని అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన రైతు బజార్ నేడు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ఇటీవలే మంత్రి తన్నీరు హరీష్ రావు చేత శంకుస్థాపన చేపట్టిన వంద పడకల ఆసుపత్రి కూడా త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు.

వర్షపునీటిని తొలగించే మోటార్ వాహనం పరిశీలించిన మేయర్

నవతెలంగాణ-దుండిగల్



వర్షా కాలం దృష్ట్యా సెల్లార్, లోతట్టు ప్రాంతాలలోని వర్షపు నీటిని తొలగించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 5 హెచ్‌పీ మోటర్‌ను నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎన్ఎంసీ అధికారులతో కలిసి కమిషనర్ రామకృష్ణ రావు పరిశీలించారు. అదనంగా మరికొన్ని మోటర్లను ఏర్పాటు చేయనున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సత్యనారాయణ, డీఈ సుదర్శన్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సుకృత, అధికారులు, ఎన్ఎంసీ బీఆర్ఎస్ జెనరల్ సెక్రెటరీ నాగరాజ్ యాదవ్, సంయుక్త కార్యదర్శి దండుగుల స్వామి, ,యువ నాయకుడు ఆనంద్ రెడ్డి,ఇతర ముఖ్యులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీ బోనాలకు రూ. 250 కోట్లు..

- సమీక్ష సమావేశంలో మంత్రి తలసాని

నవతెలంగాణ-ధూల్‌పేట్



పాతబస్తీ ఆషాడ మాసం బోనాల ఉత్సవాలు రూ. 250 కోట్ల వ్యయంతో నిర్వహిస్తున్నామని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. వచ్చే నెల 16న పాతబస్తీలో జరిగే బోనాల ఉత్సవాల నిర్వహణపై, ఏర్పాట్లపై బుధవారం సాలార్జంగ్ మ్యూజియంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్టు చెప్పారు. గొప్పగా బోనాల ఉత్సవాలను జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో వివిధ దేవాలయాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం రూ. 15 కోట్ల రూపాయలను విడుదల చేసిందని వివరించారు. ప్రయివేటు దేవాలయాలకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణా మాత్రమేనని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు జరిగేలా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇతర జిల్లాల నుండి అదనపు పోలీసు బలగాలను రప్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరుగుతుందన్నారు. వివిధ ఆలయాల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు, జనరేటర్‌లను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. భక్తులకు తాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆలయాల వద్ద ఎక్కడా సీవరేజ్ లీకేజీ లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుందని అన్నారు. రహదారుల మరమ్మతులు, వాటర్, సీవరేజ్ లైన్ వంటి అభివద్ధి పనులు ఏమైనా ఉంటే వచ్చే నెల 13 వ తేదీ లోగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆలయ పరిసరాలు, కాలనీలు, రోడ్లపై ఎక్కడా చెత్త లేకుండా తొలగించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నిరంతర పారిశుధ్య నిర్వహణ కోసం అదనపు శానిటేషన్ సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రాంతాలలో స్ట్రీట్ లైట్ లు వెలిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్కన్న మాదన్న, సబ్జి మండి ఆలయాలకు అమ్మవార్ల ఊరేగింపు కోసం అంబారి (ఏనుగు)ను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలలోని ప్రజలు టీవీలలో వీక్షించే విధంగా ప్రత్యక్ష ప్రసారం జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. 17 వ తేదీన అక్కన్న మాదన్న దేవాలయం నుంచి ఢీల్లీ దర్వాజ వరకు నిర్వహించే ఉమ్మడి దేవాలయాల ఊరేగింపునకు కూడా ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఊరేగింపును కొంచెం త్వరగా ప్రారంభించాలని నిర్వాహకులను కోరారు. దమయంతి భవన్, ఢిల్లీ దర్వాజ ల వద్ద త్రీడీ మ్యాపింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నే దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహించడం జరిగిందని వివరించారు. బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్, ఉమ్మడి దేవాలయాల కమిటీ చైర్మెన్ ఆలె భాస్కర్ రాజ్, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకష్ణ, జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్, ఆర్డీవో వెంకటేశ్వర్లు, వాటర్ వర్క్స్ డైరెక్టర్ కష్ణ, సౌత్ జోన్ డీసీపీ సాయి చైతన్య, ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్, ఆర్ అండ్ బీ ఎస్ఈ హఫీజుద్దీన్, టూరిజం ఎండీ మనోహర్, ట్రాన్స్ కో ఎస్ఈ అబ్దుల్ రహమాన్, వివిధ దేవాలయాల కమిటీ ప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గురుద్వారా సాహెబ్ అభివృద్ధికి కార్పొరేటర్‌కు వినతి



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని గురుద్వారా సాహిబ్ కమిటీ సభ్యులు బుధవారం స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి గురుద్వారా అభివృద్ధి విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా సిక్కుల సమాజ పెద్ద అమర్ సింగ్ కార్పొరేటర్ కు వివరిస్తూ యాత్రికుల నివాసం కొరకు, వంట చేయుటకు లంగర్ హాల్‌ను నిర్మించాలని వినతి పత్రాన్ని అందజేశారు. అందుకు వెంటనే సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సబ్బండ వర్ణాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నయని, కులాలకు గతంలో ఎవ్వరూ నిధులు ఇవ్వలేదని ఇప్పుడు కేసీఆర్ అన్ని కులాల వారికి నిధులిస్తున్నారని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జస్సు సింగ్, మంగళ్ సింగ్, చంద్ సింగ్, జీత్ సింగ్‌తో పాటు స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకుల తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కులం నుంచి ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని బహిష్కరించాలి

- డాక్టర్ రొండ మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్



రెడ్డి కులం నుండి ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే బహిష్కరించాలని వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రొండ మల్లారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీసీలు వెనుకబడిన సామాజిక వర్గాల వారిని అవమానపరిచే విధంగా మాట్లాడుతూ రెడ్డిల పరువు తీస్తున్నాడని ఆరోపించారు. రెడ్డి కుల పెద్దలు ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకొని నిర్ణయం తీసుకోవాలని కోరారు. పాడి కౌశిక్ రెడ్డి ముదిరాజ్ కులస్తులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి ఎమ్మెల్సీ పదవి నుంచి పాడి కౌశిక్ రెడ్డిని భర్తరఫ్ చేయాలని సూచించారు. అదే ఎమ్మెల్సీ పదవిని తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి ప్రాణ త్యాగం చేసి ఉద్యమానికి ఊపిరి పోసిన బీసీ ముద్దుబిడ్డ శ్రీకాంత చారి తల్లి శంకరమ్మకు కేటాయించాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. బీఆర్ఎస్ పార్టీ నుండి కౌశిక్ రెడ్డిని సస్పెండ్ చేసి, జీఎస్ఆర్ టీవీ కెమెరామెన్ అజయ్ ముదిరాజ్‌ను కిడ్నాప్ చేసి దాడి చేసిన విషయంలో హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు పంపాలని పోలీస్ ఉన్నంత అధికారులను కోరారు.

రాజీవ్ గాంధీ యూత్ ఆన్ లైన్ క్విజ్‌లో యువత పాల్గొనాలి



- కౌన్సిలర్ కందాడి జ్యోత్స్నా శివారెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ పోటీలో యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కందాడి జ్యోత్స్న శివారెడ్డి పిలుపునిచ్చారు. యువతలోని ప్రతిభను గుర్తించేందుకు ప్రతిష్టాత్మకంగా రూపొందించబడిన రాజీవ్ గాంధీ యూత్ క్విజ్ ప్రాముఖ్యత గురించి కుత్బుల్లాపూర్ సుచిత్రలోని ఎక్సెలెన్సియా జూనియర్ కళాశాల యువతకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యువత మేల్కొనే దిశగా హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తితో రాజీవ్ గాంధీ ఆన్ లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నరన్నారు. రాజీవ్ గాంధీ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో 16-35 సం॥ ఉన్న ప్రతిఒక్కరు పాల్గొనవచ్చని తెలిపారు. యువత పోటీ పరీక్షల్లో చురుగ్గా పాల్గొనివారి యొక్క ప్రతిభను చాటాలని ఆమె సూచించారు. రాజీవ్ గాంధీ యూత్ క్విజ్‌లో విద్యార్థులు రిజిస్ట్రేషన్ కొరకు 7661899899కి మిస్ కాల్ ఇవ్వాల్సిందిగా తెలిపారు. రిఫెరల్ కోడ్ 15005 తో రిజిస్టర్ అవ్వాలని కోరారు. తెలంగాణ కాంగ్రెస్ చేపడు తున్న ఈ వినూత్న కార్యక్రమం యువతలోని ప్రతిభ వెలు గులోకి రావటమే కాకుండా, యువత మానసిక స్థైర్యాన్ని మేల్కొల్పడం, తెలంగాణ చరిత్ర గురించి తెలియజేలనేది రాజీవ్ గాంధీ యూత్ క్విజ్ యొక్క లక్ష్యమని జ్యోత్స్నా శివా రెడ్డి తెలియజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

- డీఈవో రోహిణీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డ్స్-2023గాను ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల నుంచి కేంద్ర వనరుల మంత్రిత్వ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తుందని, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారిణీ ఆర్.రోహిణీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను వచ్చేనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్ వెబ్‌సైట్ (హెచ్‌టీటీపీ: //నేషనల్ అవార్డ్స్ టుటీచర్స్.ఎడ్యూకేషన్.గౌ.ఇన్) ద్వారా పంపించాలని ఆమె కోరారు.

దివ్యాంగులకు ఉచిత బస్ పాస్‌లు అందజేత

నవతెలంగాణ-మేడ్చల్



దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులు అందించిన మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్, సిబ్బందికి ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, డబిల్ పూర్ సర్పంచ్ గీత భాగ్యరెడ్డిలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మేడ్చల్ మండల పరిధిలోని డబిల్ పూర్ గ్రామానికి చెందిన దివ్యాంగులు 30మందికి ఉచిత బస్సు పాసులు మేడ్చల్ ఆర్టీసీ డిపో వారు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, సర్పంచ్ గీత భాగ్య రెడ్డిలు మాట్లాడుతూ సదరం సర్టిఫికేట్ ఉన్న దివ్యాంగులకు సంవత్సరం వాలిడిటీతో ఉచితంగా బస్సు పాసులు అందించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ రామరావు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు గౌస్, వార్డు సభ్యులు దామోదర్ రెడ్డి, కవిత సుదర్శన్, ఎంపీటీసీ సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు భాగ్య పానుగంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నదీమ్ రాయ్ సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు నదీమ్ రాయ్ తన సొంత నిధులతో సమకూర్చిన నోటు పుస్తకాలను పాఠశాల హెడ్మాస్టర్ రవీందర్‌తో కలిసి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపడ్డాయి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించడం శుభ పరిణా మమన్నారు. దాతలు ఇస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- కార్పొరేటర్ రావుల శేషగిరి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజలు ఇబ్బందులు పడకుండా సమస్యలు తక్షణమే పరిష్కరించాలని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు అధికారులను ఆదేశించారు. బుధవారం గాజుల రామారం డివిజన్ పరిధి భవాని నగర్ పరిధిలో జీహెచ్ఎంసీ అధికారులతో కలసి రోడ్లు ,డ్రయినేజ్ సమస్యలపై పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజల సహాయ సహకారాలతో డివిజన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న రోడ్ల గురుంచి అధికారులతో మాట్లాడి త్వరగా వేయాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి దేవా గౌడ్, కాలనీ వాసులు పాండు, ఆదిశేషు, చంద్రశేఖర్, రాంరెడ్డి, ప్రతాప్ రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ తులసి చందుకు అఖిల పక్షాల సంపూర్ణ మద్దతు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్

స్వతంత్ర జర్నలిస్ట్ తులసి చందు పై బీజేపీ, ఆర్ఎస్ఎస్ వారి బెదిరింపులను ఖండిస్తూ బుధవారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి సీపీఐ, సీపీఐ(ఎం), కాంగ్రెస్, సీపీఐ ఎమ్ ఎల్ న్యూ డెమోక్రసీ, ప్రజా పంథా, జనసేన, బీఎస్పీ పార్టీల నాయకులు, టీజేఎఫ్ జర్నలిస్ట్, విద్యార్థి నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశా నికి సీపీఐ కార్యదర్శి ఉమామహేష్ అధ్యక్షత వహించగా సీపీఐ జాతీయ సమితి సభ్యులు యూసుఫ్, కాంగ్రెస్ అధ్య క్షుడు శ్రీనివాస్ రెడ్డి, సీపీఎం నాయకులు కీలుకాని లక్ష్మణలు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక మనువాదాపు భావజాలంతో పనిచేసే ఆర్ఎస్ఎస్ ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్న, ప్రశ్నించే వారిపై దాడులు హత్యలు కూడా చేస్తున్నాయని అందుకు ఉదాహం¨ణ గౌరీ లంకేష్ అని, ఇప్పుడు మన తులసి చందుని కూడా చంపుతామని బెదిరించడం దుర్మార్గమని అన్నారు. బేటి బచావో అని నినాదం ఇచ్చిన బిజెపి ఆ భేటీల పైనే దాడులు చేయడం సిగ్గుచేటని వారిని ఎవ్వరూ ప్రశ్నించిన వాళ్లు దాడి చేస్తారని వారి ఆగడాలను అరికట్టాలంటే అలాంటి వారిని అరెస్టు చేసి శిక్షించాలని అన్నారు. విద్యార్థి నాయకులు సాయి పంతులు మాట్లాడుతూ గతంలో జర్నలిస్టులపై దాడులు చేసినప్పుడు ఎక్కువగా స్పందించకపోవడం వల్ల ఆ దాడులు ఇప్పుడు తీవ్రమయ్యాయి అన్నారు. అలా జరగ¨కుండా కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్ట్ సంఘాల అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయ ని వాటిని ఎదుర్కోవడానికి ప్రతిఘటించడానికి అందరూ ఐక్యం కావలసిన సమయం వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కార్యదర్శి ప్రవీణ్ పాటలు పాడగా, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్ వందన సమర్పణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ నాయకులు గణేష్, సీపీఐ నాయకులు స్వామి, సాయిలు, ఇమామ్, జెవిని నాయకులు వరప్రసాద్, సీపీఎం నాయకులు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శుక్రవారం నాడు అన్ని రాజకీయ పార్టీలో ప్రజాసంఘాలు జర్నలిస్ట్ సంఘాలు కలుపుకొని ర్యాలీ నిర్వహించాలని తీర్మానం చేయడం జరిగింది.

రావల్ కోల్ చెరువులో పడి వ్యక్తి గల్లంతు



నవతెలంగాణ-మేడ్చల్

రావల్ కోల్ గ్రామ శివారులోని వాగులో వ్యక్తి పడి గల్లంతైన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అస్సాం రాష్ట్రానికి చెందిన రషీద్ హుసేన్(48)ఏడాది క్రితం రావల్ కోల్ గ్రామానికి బతుకు దెరువు కోసం వచ్చి స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. బుధవారం పరిశ్రమకు విధులకు వెళ్లకుండా గ్రామ శివారులోని వాగు వద్దకు వెళ్ళి అందులో స్నానం చేయడానికి దిగి గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పేద ,మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో కృష్ణవేణి స్కూల్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



2016 సంవత్సరంలో ప్రారంభమైన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 8ఏండ్లుగా తులసి నగర్, అల్లపూర్, బొరబండ, విద్యార్థులు ఎంతో మంది పేద మధ్య తరగతి విద్యార్థులకు విద్యను అందిస్తు విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చింది. ఎక్కువ ఒత్తిడికి గురి కాకుండా చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆటలు అన్ని రకాల సౌకర్యాలతో పాటు నాణ్యత మైన విద్యను అందిస్తున్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్. టీచర్స్‌కి ట్రైనింగ్ ఇచ్చి విద్యార్థులకు విద్యను బోధిస్తున్నారు. పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటుగా, ఉన్నత స్థానాలకు చేరేలా విద్యతో పాటు, క్రమశిక్షణ, సమాజం పట్ల అవగాహన కల్పిస్తూ విద్యార్థులకు వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నది. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చైర్మన్ రాజు సంగని మాటాడుతూ విద్యార్థులందరూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణులు కావడమే లక్ష్యంగా విద్యార్థులకు విద్యా భోధిస్తు న్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ విజయన రధి,జోనల్ మేనేజర్ జవీదలి ప్రిన్సిపల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

హైటెన్షన్ లైన్ లింక్ రోడ్డు పనులు పూర్తి చేయాలని వినతి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆపేసిన హైటెన్షన్ లైన్ లింక్ రోడ్డు పనులను పూర్తి చెయ్యాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కు కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మె ల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేర కు ప్రారంభించిన, కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని హై టెన్షన్ లైన్ రోడ్డు (లింక్ రోడ్డు నెం.75) పనులను మధ్యలోనే ఆపేశారని, పనులు పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

కార్పొరేటర్ల పెండింగ్ పనులపై మేయర్ సమావేశం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషనన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి అధ్యక్షతన కమిషనర్ రామకృష్ణ రావు, ఎస్.ఈ సత్యనారాయణతో కలిసి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్వతంత్ర కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలు, పెండిగ్‌లో ఉన్న పలు నిర్మాణ అభివృద్ధి పనులపై చర్చించారు. మేయర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎల్లవేళల కృషి, చేస్తానని పెండింగ్ దశలో ఉన్న పలు నిర్మాణ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. అదే విధంగా వర్షాకాలం దృష్ట్యా కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, డ్రైనేజ్‌లు, ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులు పూర్తి, ట్రాఫిక్ ఇబ్బందులు, జాగ్రత్త, వంటి విషయాలపై ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ టీమ్, ఆయా విభాగాల అధికారులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, బాలాజీ నాయక్, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి అధికారులు, సిబ్బంది, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.